సృజన

ఆధునిక సాహిత్యవేదిక

మాసపత్రిక

సముద్రునిపై - రిపోర్టర్

తాగుడొద్దు-తన్నులాట లొద్దు - గోపాల్

ప్రణాళికా విధానం-రాజ్యాంగ యంత్ర స్వభావం
- ఆర్. యస్. రావు

192-193

అక్టోబర్
నవంబర్ **1991**

నిర్వహణ
'సాహితీ మిత్రులు'

సృజన

ఆధునిక సాహిత్యవేదిక

192/193 మాసపత్రిక అక్టోబర్/నవంబర్ **1991**

ఈ సంచికలో....

నిర్వహణ

'సాహితీమిత్రులు'

ఈ సంచిక రు. 5 సంవత్సర చందా రు. 50

Edited, Printed and Published by P. Hemalatha, Flat 11, Block 2, MIG II, Baghlingampalli, Hyderabad-500 044 and Printed at Nagendra Press, Vijayawada-520 002

Working Editor : Vara Vara Rao

'వేయిపడగల స్వామి'

…కాళరాత్రి హత్య - కాపేయ రాజీవ……

భయద భీకర తిమిర - సముదయంబున క్రుంగి

దిక్కుతోచని జనత పిక్కటిలి పోవంగ

ఒకచోట కనిపించె - ఒక కాంతి కిరణమ్ము….

దీన జనాభ్యుదయము - దీక్షదాల్చిన యోగి

సర్వజన సౌభాగ్య - సాధనమ్మును చేయ

అతని నేతృత్వమే - ఆమోదయోగ్యమై

జననా యకులందరూ - జేజేలు పల్కిరి….

వేయి పడగల పాము విప్పారుకొని వచ్చె

భద్రాయత మూర్తియై - భారతావని నిలిచె

కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రి, ఎమర్జెన్సీ తర్వాత జనతాపార్టీ ప్రముఖ నాయకుడు, తెలుగుదేశం మాజీ ఎం. పి., తిరిగి ప్రస్తుతం కాంగ్రెస్ లీడింగ్ క్రిమినల్ లాయర్, మేధావి అయిన ఇ. అయ్యపురెడ్డి 'వేయిపడగల స్వామి' పి.వి. నరసింహారావు గురించి ఆంధ్రజ్యోతి దినపత్రిక దీపావళి సంచికలో రాసిన ప్రశంసా వ్యాసం ఈ మంజరీ ద్విపదతో ప్రారంభమవుతుంది.

ఆంధ్రప్రదేశ్ అవతరణ దినం రోజునుంచీ ఆరుకోట్ల ఆంధ్రుల అభిమానాన్ని నోచుకున్న 'అన్నగారి' అభిమానాన్ని దోచుకున్న 'తెలుగుబిడ్డ' ప్రధాని అయిన పైనం గురించి ఆలోచిస్తుంటే జవాబు దొరికినట్లయింది.

పి. వి. నరసింహారావు ప్రధాని అయిన వారం పది రోజుల్లోనే తెలుగు విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం జరిగింది. ఆరంభ దినాల సంరంభంలోనైనా సరే తీరిక చేసుకొని వచ్చాడు. కన్నతల్లి ఒడిలోకి వచ్చినట్లుగా ఉందని తన గొంతు గాద్గదికం కాగా ప్రేక్షకులకూ కన్నీళ్ళు తెప్పించాడు. హింసా సంస్కృతి గురించి తాత్త్విక ఆవేదన ప్రకటించాడు. అంతే. ఇంక అప్పటికీ ఇప్పటికీ నంద్యాల లోక్ సభకు నామినేషన్ వేయడానికి తప్ప ఆయనకు ఆంధ్ర దేశానికి రావడానికి తీరలేదు. ఇన్నటిదాకా తన నియోజకవర్గమైన రామటెక్ ప్రాంతంలో వార్ధానది పొంగి వందలాది మంది మరణించినా చూడ తీరలేదు. చుండూరులో ఇరవై మంది దళితులను

అగ్రకుల భూస్వాములు పట్టపగలు హత్య చేసినా పట్టలేదు. అయినాసరే దేశంలో మొదటిసారి తెలుగుబిడ్డ ప్రధాని అయ్యాడు గనుక ఆయనకు పోటీ నిలబెట్టవద్దని 'తెలుగుదేశం' నేత నిర్ణయించుకున్నాడు. దశాబ్దాలుగా గ్రూపు తగాదాలకు, ఫ్యాక్షన్ ఘర్షణలకు పేరుబడిన విజయ భాస్కరరెడ్డి, కె.ఇ. కృష్ణమూర్తి ముఠాలు ఒకటయి పి. వి. నరసింహారావును గెలిపించడానికి, 'తెలుగుసత్తా' చూపుతున్నాయి. కిడ్నాపులు, బాంబులు, హత్యలు - కర్నూలు, కడప ఎన్నికల్లో బహిష్కరణ చెప్తున్న పీపుల్స్ వార్ కాదు, ప్రధానిని 'ఏకగ్రీవం'గా గెలిపించి తీరాలని వీలుకాని కాంగ్రెస్, అధికార యంత్రాంగం అమలు చేస్తున్నది. ఇపుడింక ప్రధాని కాదుగదా, కేంద్ర రాష్ట్రమంత్రులు కూడ అటు పక్క తొంగి చూడనక్కర్లేదని, గెలిచినాక పుట్టపర్తి సాయిబాబాకు 'నంద్యాల ప్రజల'కు కృతజ్ఞతలు చెప్పడానికి మాత్రమే ప్రధాని వస్తాడని ముఖ్యమంత్రి జనార్దనరెడ్డిగారు సెలవిచ్చారు.

ఎన్టీఆర్, నేదురుమల్లి ఏకగ్రీవ నిర్ణయం వల్లనే కాదు పి. వి. నరసింహారావు నంద్యాల స్థానం ఎంచుకోవడానికి ఎంతో గత ఘన చరిత్ర వుంది. ఈ నియోజక వర్గంలోని దళితుల ఇళ్ళన్నీ బయటినుంచి గొళ్ళాలు పెట్టి, ఒక దళితుణ్ణీ ఓటు వేయకుండా చేసి నీలం సంజీవరెడ్డిని గెలిపించుకున్న ప్రజాస్వామ్య చరిత్ర వుంది ఇక్కడి భూస్వాములకు, అగ్రకులాలకు. ఆంధ్రదేశంలో గెలిచిన ఆ ఒకే ఒక్క సీటుతో ఆయన ప్రపంచంలోకెల్ల పెద్దదయిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి స్పీకరూ అయ్యాడు. రాష్ట్రపతీ అయ్యాడు. అప్పటినుంచీ రిగ్గింగు ఎన్నికల ప్రజాస్వామ్యంలో సాధించిన నైపుణ్యం వల్ల గంగుల ప్రతాపరెడ్డి రాష్ట్రంలోకల్లా అత్యధిక ఓట్లు సాధించి గెలిచి త్యాగం చేసి ప్రధానిని మెప్పించాడు. బ్యాలెట్ బాక్స్ బాక్సింగ్‌లో అంపైర్‌లను కూడ డంగు చేయగల హంగులు ఇపుడు ప్రధాన పదవిని కాపాడబోతున్నాయి.

కారంచేడులో కమ్మ భూస్వాములు దళితులను హత్య చేశారు. అందులో స్వయంగా ఎన్టీఆర్ వియ్యంకుడు దగ్గుపాటి చెంచురామయ్య ప్రధాన నిందితుడు. అప్పుడు ముఖ్యమంత్రి ఎన్టీఆర్. చుండూరులో రెడ్డి భూస్వాములు దళితులను హత్యచేసారు. ఇపుడు జనార్దనరెడ్డి ముఖ్యమంత్రి. ఈ ఇద్దరూ కుడి ఎడమల పి. వి. ప్రధాని పదవిని బలపరచడమే కాదు, ఏకగ్రీవ ఎన్నికకోసం కంకణం కట్టుకున్నారు. జనాకర్షణ ఎత్తుగడగా బి.జె.పి. బంగారు లక్ష్మణ్‌ను పోటీకి పెట్టినప్పటికీ లాల్

బహదూర్ శాస్త్రి తర్వాత తమకు ఇంత అనుకూలమైన ప్రధాని లేడని స్వయంగా లాల్ కృష్ణ అద్వానీ ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలకు రహస్యంగా చెప్పాడు. మరొక రాజవంశ ప్రతినిధి (రిజర్వేషన్ల హీరో) వి పి సింగ్ జనతాదళ్ కూడ పి వి మీద పోటీపెట్టక ఎన్టీ ఆర్ నిర్ణయాన్ని గౌరవిస్తుందన్నాడు.

పి వి నరసింహారావు ప్రధాని కావటాన్ని బహిరంగంగా సమర్థించిన ఇ ఎం ఎస్ నంబూద్రి ప్రాద్ సి పి ఐ ఎం పార్టీ లోగుట్టు బయటపెట్టినట్లు ఇబ్బంది పెట్టినా, కాశ్మీర్ పంజాబ్ అయోధ్య సమస్యలపై ఆయన వైఖరిని సమర్థించాలని సిపిఐ, సిపిఐ ఎం రెండూ నిర్ణయించుకున్నాయి. దేవాలయాల బిల్లునుంచి అయోధ్యను మినహాయించినా వాళ్ళకాయనది సెక్యులర్ వైఖరి అనిపించడం ఆ పార్టీలలోనూ మైనారిటీలపట్ల వున్న అనాదరణ వల్లనే.

చుండూరులోనూ దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ దళితులపై హత్యాకాండకు నిరసనగా పార్లమెంటులోని ఎస్ సి ఎం పీలు రాష్ట్రపతి రామస్వామి వెంకట్రామన్‌ను కలవడానికి వెళ్తే దర్శనమివ్వడానికి నిరాకరించాడు. రామేశ్వరంలోనో, తిరుపతిలోనో 'అస్పృశ్యు'లకు గర్భగుడిలో ప్రవేశం నిరాకరించినట్లుగా-దైవ దర్శనం నిషేధించినట్లుగా.

మండల్ కమిషన్ రిజర్వేషన్‌ల గురించి చేసిన కొన్ని సూచనలను అమలు చేస్తానన్న జనతాదళ్ ప్రభుత్వ ఉత్తర్వును సవాల్ చేస్తే దానిలో రాజ్యాంగ పరమైన న్యాయాన్యాయాలు చెప్పకుండా సుప్రీంకోర్టు తాత్సారం చేసే ఉద్దేశంతో తీగ లాగి డొంకంతా కదిలిస్తున్నది. ఆ ధర్మాసనానికి అధిష్టాత రంగనాథ మిశ్రా ఆడ వాళ్లు వంటిల్లు వదిలి రాజకీయాల్లోకి రావడం అపరాధమని సెలవిచ్చాడు.

దేశంలో మనుధర్మశాసనమే కానీ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమలు కావడం లేదని, ఏతావాతా తేలుతున్నది కనుకనే నాలుగు వర్ణాల ఈ హైందవ మంటపాన్ని 'వేయిపడగల స్వామి' మోస్తున్నాడు.

నంద్యాలలో హింసాత్మక శక్తుల స్వైర విహారాన్ని అనుమతిస్తున్న పోలీసులు చుండూరు సాకుగా గుంటూరు జిల్లాలో మూడు నెలలుగా నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు. ఇది 'సర్వజన సౌభాగ్యం' కోరే స్వామి పాలనలో సర్వ జనాభ్యుదయ సమితికి కాదు, దళిత ఉద్యమానికే ఎక్కుపెట్టిన దమన బాణమని ఇంగితమున్న

ఎవరైనా గ్రహించగలరు. ఈ శ్మశాన శాంతిలోకి త్రిదండి జియ్యర్ స్వామి గారు వెళ్ళి దళితుల హత్యాకాండ అనివార్యమని, సమర్థనీయమేనని ప్రవచించి వస్తారు. గ్రామ కంఠంలో ఖననం చేసిన దళితుల శవాలను తొలగించాలని తాను ముఖ్య మంత్రికీ, ప్రధానికీ స్వయంగా కలిసి విజ్ఞప్తి చేసానన్నాడు. అది హైందవ ధర్మానికి విరుద్ధమన్నాడు. ఒక దైవప్రతినిధి చంద్రస్వామి అంతర్జాతీయ ఆయుధాల వ్యాపారంలో ప్రత్యక్షంగా బయటపడితే, మఠాక మతపీఠాధిపతి అగ్రవర్ణాల హింసా ప్రవృత్తి అనివార్యమైందని ధర్మశాస్త్రాల ఆధారంతో చెప్తున్నాడు.

ఈ ధర్మ భూమి మీద ఇదంతా ఎట్లా సాధ్యమైంది! ఈ భూమిని వేయిపడగల స్వామి భద్రలోకానికి భద్రయత మూర్తియై మోస్తున్నందున సాధ్యమైంది. దీన జనాభ్యుదయము దీక్ష దాల్చిన ఆ యోగి నలభై ఏళ్ళుగా మళ్ళీ మళ్ళీ భూసంస్కరణలు తెస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎప్పుడూ అధికారంలోనే వుంటూ కూడ దీన జనుల కోసం ఒక్క సెంటు భూమి వదులుకోలేదు. ఆ విజ్ఞాన నిధియైన శేషఫణి తన ఇంట్లో విద్యాలయమో గ్రంథాలయమో కాదు పోలీసు క్యాంపు పెట్టించాడు. దండకారణ్య ప్రాంతమంతా ఇండోటిబెటన్ సరిహద్దు భద్రతా దళాలతో మోహరించాడు. చుండూరు నిందితుల భూములు చుండూరు బాధితులకు పంచలేదు. వారం రోజుల్లో నిందితులను అరెస్టు చేయకపోతే వాళ్ళ భూములను జప్తు చేసుకుంటానన్న జనార్దన రెడ్డి చిరాగ్ ప్యాలెస్ భూముల్ని స్వాధీనం చేసుకొనే కార్యక్రమంలో నిమగ్నమయి వున్నాడు. ఇంక ఈ ధర్మ భూమి మీద అసాధ్యమేమిటి?

పురుషులందు పుణ్య పురుషులు వేరయా - అన్నట్లు తెలుగు జాతిలో కూడ పాముల జాతి వేరు చీమల జాతి వేరు. 'వేయిపడగలస్వామి-విజ్ఞాన గుణగామి' అయిన పాములపర్తి వారిది పాముల జాతియని ఆ జాతి తెలుగువారే అయిన నందమూరి తారకరామారావు, నేదురుమల్లి జనార్దనరెడ్డి, కోట్ల విజయ భాస్కరరెడ్డి గ్రహించ గలరు గానీ చీమతలకాయకా సహస్రఫణి తెలివితేటలెట్లా తేటతెల్లమవుతాయి.

చీమలు పెట్టిన పుట్టలు పాములకిరవవడమూ ప్రకృతి ధర్మమే. కాకపోతే బలవంతమైన సర్పాలకప్పుడప్పుడూ చలి చీమలచేత చిక్కి చస్తామేమోనని వెన్ను పూస నుంచి వణుకు పుట్టుకొస్తూ వుంటుంది. పాములకు ఆ భయాన్ని అన్ని వేళలా వుంచగలిగితే తప్ప చీమల బతుక్కి భరోసాలేదు.

నవంబర్ 7, 91

— సంపాదకుడు

ఆ అమ్మ....

గౌతమ్

ఆ మాటలలో ధ్వనించే శబ్దంలో ఎప్పుడూ ఒక ఎదురు చూపు ఉంటుంది
కళ్ళకింద చారికలు కట్టిన నలుపు
యిక తిరిగిరాని రెండో కొడుకు
కళ్ళ ముందే లారీ కింద పచ్చడైపోవడం ఎప్పుడూ చూపిస్తూనే ఉంటుంది
కాని వీడిలా కాదు........
వీడు చూపులకి ఎదురు చూట్టం మప్పాడు
అలసి కొంగు పరిచి చెరువొడ్డున సాగోరితే
రాలితాకిన రావి ఆకు స్పర్శలా చురుక్కున తగిలి
చూపులే వెక్కిరిస్తే హుస్సారు మనడం మప్పాడు—
అవును! ఆ చూపుకి-నలుపుకి-ఈ నిట్టూర్పుకి నేనే సాక్షిని
అప్పుడు మా డొక్కు సైకిల్ని కీలుగుర్రంలా
పంటపొలాలమీదా-గోదావరి కాలవలమీదా ఎగిరించి
ఆ చెరువొడ్డున వాలేసరి కల్లా
ఆమె మురికిని చావబాది తెలుపుని ఆరేసేదో
కింద మంట పెట్టి బానలో బట్ట లేసేదో
ఆ రాగాన్నలా వొడ్డుమీద నుంచోబెట్టి
కళ్ళకి (ఉత్తుత్తునే) చిన్న కోపాన్ని తగిలించుకొని
నల్ల చిలక లాంటి వాడిమీద పాటలు పాడేది
యిప్పుడిక పాటల్లేవు-చివాట్లూ లేవు
యిక రాడేమో అన్న నా మాట ఆమె చూపుల్ని విరిచేసినా
వస్తాడన్న ఆశ ఆమె కాళ్ళని పడిపోకుండా నిలబెట్టింది-
వస్తానుండని వొడ్డు మీద నుంచోపెట్టిన రాగాన్ని
అలా చెరువు పాత చేసి
తాను మైల బట్టలా ఆ మూల పోగుబడిపోయింది

నువు గీసిన బొట్టు చెదరిపోలేదు

ఆవాజ్

ఇది యుగాల చీకటి
ఇంకా తెల్లార లేదు
చంద్రుడు చచ్చిపోలేదు
నక్షత్రాలు మాత్రం రాలిపోతున్నాయ్
ఓ తల్లి పేగు తెగిపోయింది
లోకం శోకసముద్రమైంది
సుధాకరా! సూర్యుడా! అమరుడా!
నా కొడుకేడి?
నా ప్రాణమేది?
నా పేగేది? నా కన్నేదీ? నా కశేదీ???
ఏ దేవుడు ఏ నేల ఏ నింగి ఏ చెట్టు ఏ పుట్ట
ఆ తల్లి కడుపుకోత చల్లార్చగలదు
కట్టలు తెంచుకొస్తున్న శోకం
ఏ తల్లి చెయ్యని త్యాగం
పండులాంటి వాడా, ఏ పాము కాటేసింది నిన్ను
పులిలాంటి వాడా, ఏ కిరాతుడు వేటాడిండు నిన్ను
మాట తప్పనోడా నువ్వే మట్టిలున్నావు
చెట్టంత కొడుకా నువ్వే చెట్టువైనావురా
సుధాకరా! సూర్యుడా!! అమరుడా !!!
తైలం పెట్టి తానం పోసి పాలు తాపి తొట్టెలూపిన
చేతులడుగుతున్నాయ్, కొడుకేడని!
అన్నం పెట్టి బట్టలేసి బొట్టుదూసి బడికి పంపిన
చేతులడుగుతున్నయ్, కొడుకేమైనాడని !

ముద్దాడిన పెదవులు నువ్వు నిలిచిన కళ్ళు
లాలించిన గుండె ఎత్తుకున్న భుజాలు అడుగుతున్నాయ్
కొడుకు జాడ చెప్పమని!
నువ్వు పట్టిన నాగలి
నువ్వు పొర్లిన బురదపొలం
నువ్వెక్కిన చెట్లు
నువ్ తొక్కిన సైకిల్ అడుగుతున్నాయ్
కొడుకును ఎవరు మాయం చేసారని!
నువ్వు ఊర్లో పాడిన పాట ఇంకా మార్మోగుతూనే వుంది
నువ్వు రాసిన గోడమీది రాతలు మాతో మాట్లాడుతూనే వున్నాయి
నువ్వు గీసిన బాట చెదరిపోలేదు
నీ నినాదం మేమెత్తిన పిడికిలి
నీవిచ్చిన ఆయుధం చివరిదాకా మా భుజంపైనే
సుధాకరా! సూర్యుడా!! అమరుడా!!!
నువ్వు కలిసిన చెట్లతో వాళ్ళకు చితులు పెట్టుతాం
నువ్వు కలిసిన మట్టితో వాళ్ళ సమాధులు కట్టుతాం
నువ్వు కలిసిన చెట్లతోనే కొత్త పూలు పూయిస్తాం
నువ్వు కలిసిన మట్టితోనే మా స్వప్నాల గూళ్ళు నిర్మించుకుంటాం
సమస్త భూగోళం నీ చుట్టు ప్రదక్షిణ చేస్తుంది
మా కన్నీళ్ళతో నీ స్థూపానికి అభిషేకం చేస్తాం
సుధాకరా! సూర్యుడా! అమరుడా!
సముద్రాలు నోళ్ళు తెరచి
అడవులు నోళ్ళు తెరచి
జైళ్ళు నోళ్ళు తెరచి
జహీర్ సిద్దిక్ అమర్ హై!
అమర్ హై!!
అమర్ హై!!!

సముద్రునిపై ...

రిపోర్టర్

దయ్యాలు వేదాలు వల్లిస్తున్నాయి
ఖాకులు చట్టాలు ప్రవచిస్తున్నాయి
ఖాకుల గోలంతా
హరిదాసు ఉల్లిగడ్డ శాస్త్రం
కథలల్లటం, కథల్చెప్పటంలో
గోబెల్స్ ఆదర్శంగా సంచరిస్తున్నవవి
అక్షరాల్ని చితగ్గొట్టి, నలగ్గొట్టి
అసత్యాలను పత్రికల కెత్తుతున్నాయి
చట్టం వాటబ్బసొత్తైంది
ఊసరవెల్లి రంగుల ప్రదర్శనైంది
వాటం తీరు సంధ్యవార్చే
నక్కలజాతి ఖాకుల ఆప్తబంధువులు
కళ్ళన్నీ భయంతో గాజుకళ్ళై చూస్తుండగానే
నువ్వు బందీ వయ్యావు
ఇంట్లో అలసి సొలసి నిద్రిస్తున్నా
అడవిలో కాళ్ళు పుండ్లయి అలసట తీర్చుకుంటున్నా
జనారణ్యంలో బాటసారివైనా
వెన్నుపోటుకు బలయి బందీవైనావు
నువ్వు వెన్నెల పాటవైనావని
వసంత గీతమైనావని
శ్రమజీవులకు నీడనిచ్చే చెట్టైనావని
గులాం బాంచెనుగాళ్ళకు ప్రశ్నించడం నేర్పావని
అడుక్కునే బొచ్చెల తిరుగుబాటుకు జండావైనావని
నీ తలకు వెలకట్టారు
బందీవైనా బతకనిస్తే

శ్రాద్ధపు మెతుకులైనా దొరకనీం వని
ప్రజాపోరుతో తలుపులు, తాళాలు బద్దలుకొట్టి
తలకొరివి పెట్టావని
ఘాతులు నీ ముఖాన్ని పొడిచాయి
చిత్రహింసలు, చివరి గడియల్లో
కన్నతల్లి రొమ్ముగుద్దుకావని
ఉద్యమం ఉనికిని బజార్లో పెట్టావని
ఆశ పడ్డాయి అరాచకం చేశాయి
చివరి చూపు దక్కకుండా చేశాయి
చివరి రూపు చూసుకోకుండా చేశాయి
చితిమంటలు చూడలేకపోయాం
గుండెమంటలు ఆపుకోలేకపోతున్నాం
అనామకునివే సముద్రునివైనావు
జన హృదయాల్లో కదులుతున్న అలలు
ఒకనాడు తుఫాన్ సృష్టించడం ఖాయం

పాట :

మాసాబ్‌టాంక్ కిరణ్

సింహ

విద్యార్థులనాయకుడె మాయన్న
నగర ఉద్యమానికి వారసుడె కిరణన్న
మా పోరాటం మారుపేరే కిరణన్న
కిరణన్న కిరణన్న
మాసాబ్‌టాంక్ కిరణన్న
మా రాడికల్ల కిరణన్న
మా అరుణ కిరణమే నీవన్న
మా ఎర్ర కిరణమే నీవన్న ॥వి॥

వీరులగన్న ఓరుగల్లు జిల్లాలో
పుట్టి పెరిగిన విద్యార్థన్న
పుట్టిపెరిగిన ఊరునుండి
చదువుకున్న కాలేజివరకు
పేరు బుద్ధి జ్ఞానం ఉన్న
వయస్సు చిన్నది బుద్ధి పెద్దది మాయన్న
నీ బుద్ధికే మా జోహార్లె కిరణన్న ॥కి॥

రాష్ట్రిమంతట సాంకేతిక
విద్యార్థులను ఏకంజేసి
సమస్యల్ని ముందటబెట్టి
సంఘటితంగ పోరాడుదమని
నిర్బంధంలో నిప్పురవ్వల
సమ్మెర్యాలీ ధర్నాజేసి
సాంకేతిక అధికారుల మాయన్న
నిలదీసి అడిగినడే కిరణన్న ॥కి॥

కాలేజి హాస్టల్‌లోపల
అన్యాయాలు జరుగనివ్వనని
అక్రమాలను అరికడతానని
పేకాటాడే పోకిరీలను
తాగుబోతు దొంగలబట్టి
గుండగాళ్ళకు రౌడిగాళ్ళకు, మాయన్న
గుండెలదిరే బుద్ధిచెప్పె కిరణన్న ॥కి॥

హాస్టల్ బిల్డింగ్ నీటు గుండాలని
కరెంటు వైరు రిపేరు చెయ్యాలని
ప్రతి రూములో ఫ్యాన్ ఉండాలని

గోడలకేమో పెయింట్ వెయ్యాలని
కాలేజీగ్రౌండు నీటిగుంటాలని
యూనియన్ బాడి మెంబర్లతో
నిరహార దీక్షలు జేసి
కార్మిక మంత్రి కాలరు బట్టి మాయన్న
మా కష్టాలన్ని తీర్చుమన్నదె కిరణన్న ॥కి॥

మెస్సులోపల పనిజేసేటి
కార్మికులందర్ని కలిసినాడురా
కష్టసుఖాలు తెలుసుకున్నాడు
కారణాలు మరి ఇప్పి సెప్పినడు
సమ్మెజేసి మరి పోరు చెయ్యమని-మాయన్న
పోరాటంలో దించిందె–కిరణన్న ॥కి॥

మండల్ అమలు జరుగాలని
రామజన్మ భూమి మనకువొద్దని
దున్నేవానికి భూమి కావాలాని
గల్ఫ్‌యుద్ధము ఆపాలని
మేధావుల పిలిపించి–మాయన్న
సెమినార్లె జరిపించె–కిరణన్న ॥కి॥

కిరణ్ లేడని చింతవద్దు ఓ
విద్యార్థి నా అన్నలారా
ఆశయాలు మన ముందున్నాయి
సిద్ధాంతం మనవద్దన ఉంది
పోరాటం మన ఆయుధముంది
సాయుధపోరు అండవుంది
ఒక్క అరుణ కిరణము కానే కాదు మాయన్న
వెయ్యి కిరణాలయ్యి పుట్టుకొస్తదే కిరణన్న ॥కి॥

మెరిసే అక్షరాల వెనుక

రాయేశం

ఆకొండల తొండయి అక్షరాల కొనాలు
గెలుక్కుంటు గిలుక్కుంట దుమ్ముధూళి వూదుకుంట
వంగి వంగి సాగి సాగి కంపోజులు చేస్తేను
గూనివచ్చె గాదరో - గోరంటల సమ్మయ్య
చూపు బాయె గాదరో - పినుపూళ్ళ గిర్మాజి

కంపోజు వ్యూహరును కూలకుంట రాలకుంట
చెప్పులోన బిగియించి చేతులతో ఎత్తితేను
నలపైకిలోల ఫారం నాభికాడ కలుక్కుమనె
ఛాతి నొప్పిలేచెనా - గుండేటి రాజేందర్
బింక బయట పెట్టెనా - ఆమంచ లక్ష్మయ్య

లయ్యి రాసిన చెయ్యి చెదలు బట్టినట్టులాయె
పర్ఫొరేషన్ మిషిని తొక్క వరిబీజము నొప్పి
చేతి నెంబరింగు వేయ జబ్బలోన తీపు
మెడ నరాలు గుంజెనా - దిడ్డోల్ల సుదర్శనం
వెన్నుపూస నొప్పులా - నాగులోల్ల రాములు

కొరత వేసినట్టుగ కదలకుంట నిలబడాలె
మిషినికాడ గద్దవోలె రెక్కలు ఆడించాలె
నడుము విరుచుకోడానికి నడుమ టైము లేదాయె
కాళ్ళ వాపులొచ్చెనా - పోతన సారంగపాణి
నడుము విరిగిపోయెనా — గజ్జెల రాములన్న

ఎనిమిది గంటలు నిలబడి కంపోజు చెయ్యాలె
కొనాలు గెలికి గెలికి గోళ్ళు చిగుళ్ళు పగిలె
స్టిక్కు బట్టిన చెయ్యి పడిపోయి నట్టులాయె
వేళ్ళు చెడిపోయెనా - వంగరోల్ల శంకరయ్య
కీళ్ళ నొప్పులొచ్చెనా - ఘరింగంటి ఆచార్య

సీసం ముద్ద విషమే పట్టిన ముసికి విషమే
ప్రింటింగు ఇంకు విషము పేపరు తడి.కూడ విషము
మైలతుత్తము విషము మొత్తంగా విషమయము
టి. బి. వచ్చె గాదరో - కూచనోల్ల నాగయ్య
దగ్గుతా దగ్గరబడితివా - పిసుమాళ్ళ సుదర్శనం

యెంత జేసినగాని జీతమైతే బెత్తెడేను
యెన్నాళ్ళు జేసినగాని జీవితము వృథగదరో
యేళ్ళ తెగిపోయినగని వెనుకముందు యేమిలేదు
ఆదరణే లేదురో - కోటోల్ల అయిలయ్య
దిక్కు తోచదాయెరో - రామా మార్కండేయ

మినిమమ్ వేజస్ అంటు నింగిపైపు చూపినారు
మింగమెతుకుకు సైతం సరిపోనిది ఆ జీతం
అదియైన అమలుగాదు ప్రలోభాల యంత్రాంగం
బాంచె బతుకు మిగిలెనా - అంకమోల్ల వెంకటయ్య
అప్పుల పాలైతివా — దేవులపల్లి సంజీవం

రామా కొమురయ్య పిసుమాళ్ళ వీరస్వామి
అద్దకపు పద్మనాభం రామోల్ల యాదగిరి
కోడం కట్టయ్య రామా రామనర్సయ్య
అసువులె బాసిరో - అయ్యలార వందనాలు
బలిపశువులు మీకురో - జోహార్లు జోహార్లు

అచ్చయ్యకు బుచ్చయ్యకు అందమాను లచ్చయ్యకు
బిచ్చగాడికి సైతం అచ్చుపని కావాలె
కథలు గొట్టువారము మన వెతలు వినేవారు లేరు
యేం బతుకులు మనయిరో - అన్నలార తమ్ములార
పోరు సేయ లేవరో - అన్నలారా తమ్ములార

కాశ్మీరీ కవితలు :

వర్తమానాన్ని గమనించు

దీనానాథ్ కదిమ్

ఇక్కడి నుంచి చుట్టూరా చూపులు సారించు
ఇంకా మంచు కురుస్తున్నట్టే లేదూ ?
గబగబా చుట్టుముట్టే పొగల మధ్య
చిన్నారి సూర్యకాంతికి భద్రత లేదు !
కాలం గాని కాలాన ఈ పుష్పాల వికాసం
గాలి నిండా నిండిపోయే మింగేసే పరిమళం
సిగ్గుపడుతున్నట్టు లొంగిపోయే వేర్వేరు రంగులు
వసంత పవనంలో తాజాదనం
మొలకెత్తుతున్న ఉజ్వల భావాలు !
కాని ఈ కుట్రదారు సమూహాల మంచు ఏమిటి ?
నాగరిక, మానవీయ విషయాలన్నిటి మీదా నిషేధమేమిటి ?
సత్యద్వారాలు మూసి కటకటాలు బిగించడమేమిటి ?
బిగ్గరగా, గర్వంగా
గాంధీ, జవహర్‌లాల్‌ల పేర్లు జపిస్తూనే
సత్యాన్ని ఉరికంబాల మీదికెక్కించడమేమిటి ?
నిజాయితీని సూటిదనాన్ని పాతి పెట్టడమేమిటి ?

మహా భవనం

మోతీలాల్ సాఖీ

ఈ మహాభవనం పునాది నుంచి పై కప్పుదాకా
ఎలుకలే ఎలుకలు. తరతరాలుగా ఈ ఎలుకలు
పట్టు వదలకుండా, ఎడతెగకుండా
లోపలి ప్రతిభాగాన్నీ తొలుస్తున్నాయి

పై పూత ఊడి వచ్చేస్తోంది
పై కప్పు సందిగ్ధంగా ఊగులాడుతోంది
దారిన పోయేవాళ్ళు
ఒక్కొక్క రాయీ మోసుకుపోతున్నారు
వాసాల శక్తిసారమూ నశ్యంలా ఉన్నాయి
దూలాలు విరిగిపోయి అసహ్యంగా కనబడుతున్నాయి
తలుపులకూ కిటికీలకూ అలంకారం పొగచూరిన తెరలు
పెళుసైన ద్వారబంధాల నుంచి వేలాడుతున్న తలుపులు –
పరమాశ్చర్యంగా చూస్తావు,
ఈ మహాభవనం ఎట్లా నిలిచి ఉందో
చెప్పే కారణమొక్కటీ లేదు !
భవనం లోపల కొత్తగా పుట్టుకొచ్చిన ముంగిస జాతి
అమర్యాదగా నివాసుల కళ్ళు పెరికేస్తుంది
ఒకే ఒక్క నిర్దాక్షిణ్యమైన దెబ్బతో
భవనంలో నెత్తుర్లు పారిస్తుంది
తర్వాతి కాలాల్లో బాధితుల్లో
వీలయిన వాళ్ళు భవనం వదిలేశారు -
మరికొందరు కొండల్లోకి వెళ్ళిపోయారు
మరికొందరు దీవుల మీద మిగిలిపోయారు
ఇంకా కొందరు సముద్రాలు దాటి దారి చూసుకున్నారు
అందరికీ ఒకే ఒక్క ఆదిమ కోరిక -
ప్రాణాల్ని రక్షించుకోవాలి
వాళ్ళ వేర్లు తెగిపోయాయి
పోగొట్టుకున్న వ్యక్తిత్వమూ
వ్యక్తిత్వం పోయిన తీరు గురించి స్మృతీ
క్రమక్రమంగా విస్మృతిలో పడిపోయాయి
భవనంలో మిగిలిపోయిన వాళ్ళిప్పుడు
కన్నీళ్ళతో తమ రోజుల్ని లెక్కపెట్టుకుంటారు

కూలిపోతున్న గోడలు
ఏదో ఒక సమయాన తమను సమాధి చేస్తాయని
వాళ్ళకు తెలుసు
తమ నిస్సహాయ వేదనా వాస్తవం కూడ వాళ్ళకు తెలుసు.
ఈ మహాభవనాన్ని ఇన్నాళ్ళూ కాపాడింది గనుక
దీని పునాది గట్టిదేమోనని
నిరుత్సాహపు ఆశలో ఊరట పొందుతారు
ఇది వాళ్ళ జీవికకాలంలో
కూలిపోక పోవచ్చు
ఐనా వాళ్ళ కళ్ళముందే
తగలబడిపోతున్న ఘాట్
నోరు తెరిచి వాళ్ళకోసం ఎదురు చూస్తుంటుంది

మా ఊరు

రహమాన్ రాహి

మా ఊరిని పట్నమని పిలవకండి
దాన్ని పల్లెటూరి లాగనే ఉండిపోనివ్వండి
మతం నుంచీ ధర్మం నుంచీ శక్తిని పొందనివ్వండి
దాన్నిఎండిపోనివ్వకండి
ఇక్కడి పావురం కూడ భగవంతుణ్నెట్లా ప్రార్థిస్తుందో చూడండి
మా పిచుక ఖురాన్‌ను మాత్రమే ఉచ్చరిస్తుంది, అపూర్వం కదూ....
మా జీలం నది మా హృదయాల్ని శోధన చేసే పవిత్రనది ;
మరి నానాటికీ మురికిదవుతున్న పవిత్ర ఊట
విహార్ నాగ్ కనిపెట్టామని ఉత్సాహమెందుకు ?
ఆడపులిని చూసినప్పుడే
జింక గెంతడమూ పరుగెత్తడమూ నేర్చుకుంటుంది

పక్షి వానపామును తిన్నప్పుడల్లా
అమ్మయ్య, దానికివాళ తిండి దొరికింది అనుకుంటాం మేం
ట్రాఫిక్ పవిత్ర స్థలంలో నేను తప్పనిసరిగా పువ్వులు కడతాను !
మీరు అక్కడికి వెళ్ళారు గదా ?
ఇప్పటికీ అక్కడ ఆకాశం లోంచి బంగారం మెరుస్తూనే ఉంటుంది !
వేలాడే బల్లల మీద కనబడుతున్న ఆ పోస్టర్లు
మేం దేన్ని ప్రేమించాలో తెలియజెప్తాయి !
ఎవరి చేతుల్లోంచి విషం ప్రవహిస్తోందనే
నిరర్థక ఆలోచనతో మా బుర్రలెందుకు చెడగొట్టుకోవాలి ?
వాళ్ళు కచ్చితంగా మా పిల్లలే.
వాళ్ళకు సలహా ఇవ్వు: బంగారంగా మారుతారు !
ఈ దేశం మాది కాదా ?
వాళ్ళను కూడళ్ళలో నిలబడి గర్జించనివ్వు !
మా గౌరవనీయ పినతండ్రి రహీమ్ కకాను
తుపాకితో కాపలా నిలబెట్టాల్సిందేనా ?
మరి మా సోదరుడు మఖన్ - సరే, అతణ్ణి, కొంతకాలం పాటు
ఢిల్లీలో సూర్యకాంతి అనుభవించనీ !
నువు నీ భార్యతో రహస్యాలు పంచుకోవనే సంగతి
నువ్వెంత దృఢచిత్తుడివో చూపుతోంది.
నువు నాలో నమ్మకం పోగొట్టావంటే,
ఏవో బలవంతాల ఫలితమని నాకర్థమవుతుంది !
నువు నిజంగానే అసూయాపరులైన పౌరులవాళ్ళ వల్ల పిచ్చెత్తిపోయావు
ఎవరిని కొల్లగొట్టి నా లాభాలు పెంచుకున్నానో
వాళ్ళు నా సహచరులు కారు
నేను పొదుపు పాటిస్తే దేశపు వాణిజ్యం విస్తరించింది
నువు వివరాలు సేకరిస్తే
సైన్యం కొత్త ఆయుధాలు సమకూర్చుకుంటోందని నాకు తెలుసు
నేను తప్పకుండా ఖురాన్ చదువుతాను

కాని ఇప్పటికిప్పుడు నా కూతురి పెళ్ళిపనులు చూడాలి
దైవం అనుకూలించి నా చరస్ వ్యాపారం సక్రమంగా సాగితే
దేవతలకు కూడ విందు చేస్తాను
మా ఊరు స్వేచ్ఛాభూమిః
మా ఊరి వాళ్ళందరూ చాల తెలివైన వాళ్ళు !
అవసరంలో ఉన్న వాళ్ళకెప్పుడూ నేను అప్పివ్వలేదు
అప్పుల మీదే బతుకుతుంటావు నువ్వు
ఊరి పెద్దలంతా చూస్తుండగా నేను వోటెట్లా వెయ్యను ?
ఎన్నికల్లో ఆ ముడుతలు పడిన వృద్ధురాలి మాట
విస్తృతంగా ప్రచారమైందని విన్నప్పుడు
నువ్వు ఉద్వేగపడవూ ?
ఈ మిత్రుడు, ఒక రైతు, ఊరి కొలువను
తన అవసరం కోసం దారి మళ్ళిస్తాడు
మా జాతికే చెందిన ఈ వ్యాపారి
నకిలీ ఉలన్‌లను అచ్చమైన పష్మినా శాలువాల్లాగ అమ్మజూపుతాడు
మేమిక్కడ చావూ బతుకూ చూశాం
కలిసి మెలిసి తిన్నాం తాగాం
మా ఆటపాటలిక్కడే సాగాయి
కన్నీళ్ళు కేరింతలూ ఇక్కడే కురిశాయి
ఇక్కడే తోటలో
శివుడూ శక్తీ ఆలింగనం చేసుకుంటుండగా చూశాను
నువు ఇక్కడే మూసిన తలుపుల వెనుక
నగ్న చిత్రాలు చూస్తుంటావు ?
రంపం అడవిలోపలికి మరింత వెళ్ళగలిగితే
ఇప్పుడిక్కడ యాత్రికుల శిబిరం ఉండేది !
నీకో అద్భుత దృశ్యం కనబడుతున్నప్పుడల్లా
నేను డీజిల్ తగులబెడుతున్నానని తెలుసుకో !
నా గదిలోంచే ప్రపంచాన్ని చుట్టి రాగలిగేట్టు చేస్తుంది టీ వి

నదీ తీరాన చల్లని గాలి అనుభవించేవేళ
వేడి వార్తలు మోసుకొస్తుంది బిబిసి
గల్ఫ్‌లో బాంబులు పేలిపోతే
ఇక్కడ బస్సు ఛార్జీ లెందుకు పెరగాలి ?
జర్మన్లు తమ శివబుల్ని పంపించినప్పుడు
మనం మన పడవల్ని నిషాత్‌లో లంగరు వేస్తాం !
ఇది ఋషులు తిరుగాడిన నేల !
ప్రతివైపు నుంచీ సహజంగా కానుకలొస్తాయని ఆశిస్తాం
దర్వీష్ పొగలు వ్యాపింపజేసినప్పుడల్లా
ఉన్మాదమిక్కడ విచ్చలవిడి అవుతుంది -
పెద్దవాళ్ళు ఎడతెగకుండా ఉదాత్త ఆదర్శాల్ని ప్రకటిస్తుంటారు
యువకులేమో తమ చైతన్యానికి కట్టుబడతామంటారు
ఎలుకల మీద దూకడానికి పొంచి కూచున్న
పిల్లుల్లాంటి చురుకైన వాళ్ళు సిద్ధంగా ఉంటారు —
ఇంద్రధనుస్సూ పామూ ఒకచేనని ఒట్టు పెట్టుకోవడానికి !
ఈ గుంపును వ్యక్తిత్వం ఎప్పుడూ బాధించలేదు
ఇక్కడి పక్షులకు స్థిర అభిప్రాయాలంటే తెలియదు
మనం వాళ్ళను నమ్మితే, వాళ్ళు మనను
మూర్ఖుల దేశం నుంచి అతిథుల్లా ఆహ్వానిస్తారు
వాళ్ళను మనం బైటపెడితే, మన ప్రేమ వ్యవహారాలు కూడ
అచ్చుకెక్కుతాయి !

మేం నమ్ముతాం, సూర్యోదయం కాగానే పూజిస్తాం
నీకు ధనాకాంక్ష ఉంది గనుక నువు నాయకుడివవుతావు.
మా పర్వతాలు కాలమంత పురాతనం
మా స్వభావం ఋషుల లాంటి శాంతస్వభావం
మా అత్యుత్తమ తత్వశాస్త్రం త్రికం
జాగ్రత్త, ఇది మా ప్రార్థనా స్థలం,
చూడు, ఊరంతా ఇక్కడెట్లా గుమిగూడిందో !

కథ :

“తాగుడొద్దు - తన్నులాటలొద్దు”

గోపాలు

గుడుంబా వాసనతో ఊరంత గుప్పుమంటోంది. సగంమంది నవ్వులు కేరింతలతో ఉంటే సగంమంది అడివిలో పొద్దుగూకినట్లుగా అగం అగంగా చిరాకుగా ఉన్నారు.

ఊళ్ళో కరంటు బుగ్గలెలిగాయి. దోమలు గుంపులకు గుంపులుగా మోల్ పెడుతూ తిరుగుతున్నాయి. సాయంత్రం వంటపనిలో ఆడవాళ్ళు, ఏడిచే పిల్లల కసురుతూ, తాగుబోతు భర్తలను తిడుతూ వడ్లు దంచుతూనో, బియ్యం చెరుగుతూనో, విసుర్రాళ్ళ విసురుతూనో ఉన్నారు. పురుషులు చాలామంది స్నానాలు చేసి పొడి బట్టలు కట్టుకొని బజార్లల్లో అక్కడికక్కడికి తిరుగుతున్నారు. చిమ్మెట్లు అదే పనిగా పలుకుతున్నాయి.

అలాంటి మునిమాపు సమయంలో దాసరి ముత్యాలు వాకిట్లో పీకిపోయిన పూరుకింద పదిమంది కూర్చున్నారు. వాళ్ళ ముందు సీసాలల్లో గుడుంబ ఉన్నది. గాజుగ్లాసులున్నాయి. అప్పుడే పెంటమ్మ తాళం వేసిన పెనగ గుడాలు తెచ్చి తలో కొన్ని కొలిచిపెట్టి డబ్బు తీసుకొని వెళ్ళిపోయింది.

“ఓ పెద్దనాయిన ఇగో పాపేసుకోవే” గాజె పాపయ్య బలవంతంగా చిన్న గ్లాసులో గుడుంబ తెచ్చియిచ్చాడు.

“పోరా! తెల్లందాకా పొద్దందాకా గిదే తాక్కుంట దిగ్గదేనా? కాస్తేత ఇద్దరు పొల్లగండ్లు కోడలును తీసుకవచ్చుకోవునా?” పెద్దనాయిన బొక్కి నోటితో బొసుగూపి నట్టుగా అన్నాడు.

ఇక్కడ అర్థంలేని పద్యాలెందుకు చదువుతావు ?
ఇది నినాదాలివ్వవలసిన వేళ !
నువు ఇప్పుడు కాశ్మీర్‌లో ఉన్నావు.
ఇంకా అమెరికా గురించి మాట్లాడతావా ?
పాతకాలపు రుద్రాక్షమాల ధరించిన నువ్వు
ఆధునికుణ్ణని చెప్పుకోవడం ఎంత చిత్రం !

వాళ్ళకు కొంచెం దూరంలో చింతకింద కూర్చున్న పాపయ్య మిత్రబృందంలో నుండి ఒకడు, "మావ మనిషిబల్మ శాశ్వతం గాదు" అన్నాడు.

అతని పక్కవాళ్ళు అకారణంగా నవ్వారు.

"పోనియ్యే. మూడెకరాల పొలంబోయింది. రెండెకరాల పెరడిబోయింది. పేట సేసికోదెవ్వడు బాగుపడ్డడు" పాపయ్య.

"అన్నలేమో బొట్టు పెట్టి చెప్పవట్టిరి. మనూళ్లె ఎనుబై ఎకరాలు దున్నితిరి." సుక్కపోశాలు ....

"గిప్పుడే మాటకు మాట దొరుత్తలేదు. అయింక గుద్దుకునుడే-అనెముత్తాలు" పల్లె గోపాలు కేకేసిండు.

"ఇగో నాకాతల ఇంకో సీస పట్టుకరా!" పాపయ్య.

"ఇప్పటికే ఎనుబై రూపాలయినయ్." ముత్యాలు.

"బ్రాత్తెరి. నా ఇల్లు నీకు రాసిత్త - పెండ్లాందెంక పోయింది. పెండ్లాం లేంది ఇల్లెందుకు?" పాపయ్య.

"నరుని బతుకు నట్టేటమునుగంగ
ఇల్లేమి, తల్లేమి సిలుకా!" గుత్తి రాయమల్లు దీర్ఘం తీసిండు.

అక్కడ అన్ని వయసుల వాళ్ళున్నారు. అన్నికులాల వాళ్ళు మాత్రం లేరు ఆ పూల్లో. కులాలవారిగా, హోదాలవారిగా దాదాపు అలాంటిది మరో ఏడెనిమిది చోట్ల గుడుంబా వ్యాపారం జోరుగా సాగుతోంది.

"నీ యింట్ల పీనిగెల్ల ఈడ సచ్చినవా? కోమటింటికి బోయినూనె తెమ్మంటె గౌంతిలకచ్చె దన్క తాక్కుంట కూసున్నవా? నోరు తిరుగకుంట తాగి మున్తెల్లెలుక లేత్తే పోరగండ్లకేం పెట్టాలె - నీ కూడు గలదియ్య నీకేం పెట్టాలె - మానంలేదు సెత్తకు, సెరంలేదు - అన్నలింట్ల పీనుగులెల్ల సార బందని పెట్టిరి. అవ్వాల్ల మీ కడుపులు సల్లగుండనంట - రాయరాయేసునికి తక్కెడబెల్లం పంచి పెడ్తననుకుంటి సక్కారు సార అమ్ముడు బందాయె-ఇంటికోపొయ్యి లేసె. సుట్ట దాగేదాన్ని ఇడిసి పెడితె పొవాను నమిలేది దొరికినట్టయ్యింది. ఈ ఊరుపాడుగాను - కాలికూలిపోను. చిక్కన సీకటయ్యిందంటే-" గోపాలు భార్య వీరలక్ష్మి తను వచ్చినపని మరిచి పోయి కంతపడి అవల రిస్తోంది. ఆమె చంకలో కసురు కసురుగా ఉన్న పిల్లొకతి ఓదర ఓదరగా ఏడుస్తోంది.

ఆమె నెలల కడుపుతో నున్నది.

"పోరా గోపాలు." ఎవరో అన్నారు.

"నువ్వెవతివే నేను లాకలాంతాగుత." గోపాలు అంతమంది ముందు భార్య తిట్టడంతో రోషంగా.

"ఎవతినా? అన్నలత్తె నేనెవతినో తెలుత్తది. సానొద్దులామెరాక మీ గొంతి కెల దాక పోత్తన్న మత్తన్న బొక్క మీ బొక్కలిరుగుతయ్" అవలి నుండి వీరలక్ష్మి.

"దెహెఁ పోయే. నీ అన్నలు నువ్వు ఏం జేసుకుంటరో? పాతగాని సినాలి లం....టు కండ్లల్ల కారం బోసుకుంటండ్లు. రానియ్యి అన్నలనే అడుగుత. అన్నలు మేం ఉపాస ముప్పిడుంటె పెట్టిండ్లా? మాల మాదుగుల తుప్పేసి భూములు పంచిండ్లు అయినా ఈ ఊళ్ళె నేనొక్కదాన్నే పెడ్తునేను. నీ మొగడే దొరికిండా?" ముత్తయ్య పెండ్లాం ఆగమ్మ బయటకొచ్చి చేతులారుస్తూ నిలబడ్డది.

అగమ్మ పొట్టిగా ఎర్రగా ఉంటుంది. ముంగీస మూతి అప్పటికే తాగున్నదేమొ ఆమె శరీరం యావత్తూ ఉస్కెకొక్కులాగ ఎగిరిపడుతోంది.

వీరలక్ష్మి దగ్గరి కాన్పుతో, చేసే దిక్కులేక ముప్పయి నిండకుండానే ముసలిదై పోయింది. ఆమె చెంపలు ఏ మాత్రం మాంసం లేక ఎముకలు తేలి ఉన్నాయి.

ఆమెకు అగమ్మను ఎదుర్కొనే శక్తి లేదు. పైగా అగమ్మ పొద్దంతా గుడుంబ కాస్తూ ఇంట్లోనే ఉన్నది. వీరలక్ష్మి నాటేయబోయి వచ్చింది.

"మన బంగారం మంచిది గానిది మంది నంజేమున్నది ?.... ఏమాయె తాగింది సాల్లేదా ? రావు" వీరలక్ష్మి మొగన్ని ఉద్దేశించి పిలిచింది. ఎందుకో ఆగమ్మ గొంతు గురగురలాడింది.

చింతచెట్టు మొదట్లో ముసిమాపుగిసేసుకున్న మేఘంలాగా కూర్చున్న ఆగమ్మ మీది రమేశ్‌కు యమ కోపంగా ఉన్నది. వదినను తిట్టకుండా వీరలక్ష్మి ఓడిపోవడం అతనికి బాగనిపించలేదు. అతనికి వదినెమీద, అన్నమీద - అక్కడ కూర్చుండి తాగుతున్న వాళ్ళందరి మీద చెప్పరానంత కోపంగా ఉన్నది.

రమేశ్‌ను అన్నా వదినెలిద్దరు నిండా ముంచారు. రమేశ్ ఆరు సంవత్సరాల వయస్సప్పుడు తల్లి చనిపోయింది. మరో రెండేండ్లకు తండ్రి చనిపోయాడు. అప్పుడు అన్నావదినెలు అతన్ని ఇంట్లో నుంచి వెళ్ళగొట్టారు. రమేశ్‌కి ఏ పనివడితే ఆ పని

చేస్తూ ఇంటికింత తింటూ బతికాడు. పదునాలుగేండ్ల వయస్సప్పుడు అట్లా బతకడం ఏలుకాక ఊరెల్లిపోయి నాలుగేండ్లు తిరిగి తిరిగి ఎక్కడున్నాడో ఏం తిన్నాడో తెలువకుంటా రెండుసంవత్సరాల క్రితమే ఊర్లోకొచ్చాడు. అప్పుడు ఎవలు రమేశ్‌ను పట్టించుకోలేదు. మూడునెలల కింద పక్కూరి బాలయ్య రమేశ్‌ను చేరదీసి తన వదిన బిడ్డను తూరుపు నుంచి తెచ్చి చేశాడు.

పెండ్లప్పుడు అన్నా వదినెతో సంబంధం కలిసింది. పెండ్లి అప్పు నాలుగు వేలు మీదెత్తారు. సరే ఇద్దరు కలిసి కలోగంజో తాక్కుంట బతుకుదామంటే పెండ్లాంకు ఏం రుచి దొరికిందో గాని ఆ ఇంట్లో నుంచి రానంటది.

ఆ ఇంటిముందు తాగుడుమేళం జమకావడం అదంతా రమేశ్‌కు పరమరోతగా అసహ్యంగా ఉన్నది. ఆ వాతావరణం నుండి భార్య రానంటున్నది. రోజూ ఎడంగా కూర్చుండి ఆ తతంగమంతా భరించడం గలీజుగా ఉన్నది.

"అన్నలు గరీబోన్నితంతరా ? పెద్ద పెద్ద ముస్తైదార్లను తంతరు గని" అన్నారెవరో ?

"అన్నలత్తె అందరికన్న ముంగటనే ముత్తయ్య తయారుగదా !"

"ఓ నాయిన ఇంటికి రావానే." బజారులో ఒకాయన ఎవరినో పిలుస్తున్నాడు.

"రానుపోరా?" అంటున్నాడు మందిలో నుండి ఎవరో-

రమేశ్ వదిన ముఖం చూడలేక నిలుచున్నాడు.

"నాయిన్నను పిలుస్తన్నవ్-నువ్వు నుకరారాదు పిలవా?" అగమ్మ కృత్రిమంగా నవ్వింది.

రమేశ్‌కు ఆ నవ్వు కారం పూసినట్టుగా తోచింది. అయిపోయింది. పైసల కోసం వదిన ఏదంటే అది చేసేటట్టే ఉన్నది. మూడు నెల్లల్ల ఎంత మారిపోయింది. గిక్కన్నే ఉండే రాయేశ్వరి గంతే అయితది. తాగినోల్ల గోసులూసిపోగా కిందా మీద పడడం, ఒకరి నొకరు కొట్టుకోవడం రమేశ్ చూస్తూనే ఉన్నాడు.

రమేశ్ అక్కడ ఉండలేక బజారులో నడుస్తున్నాడు.

కరంటు బుగ్గల వెలుతురులో పిల్లలు ఆడుతున్నారు:

"ఎన్నెలరాత్రుల్లో అన్నలొచ్చారూ!

నేనేమిసేతునె నేనెందుపోదూ !" పదహారు సంవత్సరాల సుగుణ ఒంటిగా రాగం తీస్తూ తనెదురైంది. ఆ కంఠం హాయిగా కమ్మగా ఉన్నది. ఎందుకో

రమేశ్‌కు జలజల కన్నీళ్ళు తిప్పొంగాయి. అంతదాక కోకిల్లా పాడిన సుగుణ నోరు మూసుకొని పరుగెత్తింది.

రమేశ్ గబగబ నడిచాడు. కాపుల సుబయ్య ఇంటి ముందు పొట్టి దుర్గయ్య గోడమీద నుండి బజార్లోకి దునికాడు. అతని జుట్టు చెదిరి ఉన్నది.

"ఎవలు నా సెంబం దీకచేరు" అంటున్నాడు.

లోపలినుండి దుర్గైకాళ్ళ మొగలి ఇకిలిస్తూ ఏదో అన్నాడు.

ఊరంతా దేకాన్నై పోయింది. ఎనుకటి పెద్దమనుసులు పండగలకు పబ్బాలకు తాగేటోల్లు. వాళ్ళు తాగినారంటే ఊళ్ళోవాళ్ళు వాళ్ళెదురుబోయే వాళ్ళుకాదు. సర్కారు సారావచ్చి దుకాణం పెట్టేసరికి— ఒక్కనే సారా దొరకబట్టి అందరు అల-వాటయ్యింన్లు—సగం సంపాదన సారకే పోతుంది. అన్నలు యేటా సారాకొట్లన్ల పలుగ్గొడుతనే ఉన్నరు. ఇయ్యేడు దొత్తులకు బంద్ చేసిండ్లు—అన్నెల్లు మందులకు సార దొరుకలే—తెనుగోల్లు, నాతకానోల్లు దొంగతనంగ తెచ్చి కల్లమీద అమ్ముకునే టోల్లు—వాళ్ళనుపోయి ఊరోల్లు కొట్టిండ్లు—ఇద్దరి కాల్రెక్కలు విరిగిపోయినయ్. పంచాదులు—కేసులు—అన్నలచ్చే దీనోల్లు దీనోల్లు కొట్టుక సావద్దు అంటు తీర్మానం చేసిండ్లు—పదిరోజులు ఎవరు సారాకొట్లకి పోలేదు. పదిహేనోనాడు మూడు కోమటి దుకాన్లల్ల నల్లబెల్లం బస్తలు దిగినవి. ఒక్కొక్కనకు ఫైను వేసిండ్లు మూడు నెల్లల్ల రెండుసార్లు అన్నలచ్చిండ్లు—మొదటి సారచ్చినపుడు భూములు దున్నిన పంచాదులబడి సార వెనుకబడిపోయింది.

అయింక భూములు దున్నినంక పోలీసులచ్చి—దెబ్బలు, కొట్లు ఆగాయిలుండంగనే రెండోసారి గడిచిపోయింది తను ఎల్లనైన చెప్పవాములకు చేలాల్లకే వీరంసాయిలు బిస్తె పంచాయతు అడ్డమచ్చింది. ఇగనూసక్కే—ఊరు ఊరంత అద్దు పిరాదు లేకుంట తాగి తలకు పోసుకుంటండ్లు.

రమేశ్ ఇట్లా ఆలోచిస్తూ ఊరు చివరకొచ్చాడు. మర్రిచెట్టుకింద మాదుగులు కూర్చుండి తాగుతున్నారు. ఎటుబోయినా లాభం లేదనుకుంట వెనుదిరిగేసరికే కంబె లింగయ్య ఎదుకొచ్చిండు.

"రమేసు, నువ్వేనా? నువుసుత తాగినవా?" లింగయ్య.

"ఏహేఁ లేదన్న. మాయింటికాడ సిందిమాదిగి భాగోతం నడుస్తంది. ఊళ్లె ఉండవశం అయితలేదన్న".

"గిదేం మంచిగలేదు రమేసు. మంచిపనికిరాదు. అరె భూషులు దున్నదాం రాండ్లిర్రా అంటే ఒకడు పేర్గత్తందని అటుదబోతడు. మరొకనికి కడుపు నొప్పి లేత్తది. ఫుల్లహుర్రాసుల తన్నయ్. మొన్నకిట్టపురం, బొబ్బెరపెల్క, అటుమొఖాన నీల్‌వాయిల కాయిదాలేసిండ్లట–ఈపారి అమ్మినోనితోటట్టు తాగినోన్ని తన్నాలె". లింగయ్య.

"ఇంటికో దుకానం బెడితెనే ఏమంటలేరుగద అన్నలు".

"అంటరువయ్య! ఒకదానెనుక ఓటిసేసుకత్తలేరా? అయినా ఆళ్ళు ఎవలే–మనమే....అందరు తాగుతంటె మనసొంటోల్లు ఆడికీడికి తిరుగుతండ్లుగని—"

"తెనుగోల్లను, సాతకానోల్లను మనం బొయ్యి కుండలు పలుగ్గొడితె అన్నలు కోప్పడలేదా? గదే అలుసైంది". రమేశ్–

కంటులింగయ్య సబ్బుకోసం కోమటింటికి వస్తున్నాడు. వాళ్ళ నాయిన తాగుబోతే–ఇంకా పెండ్లి కాలేదు. రమేశ్‌కన్నా రెండేండ్లు పెద్ద. ఇద్దరు నడుస్తున్నారు.

"ఇంకా తానం జెయ్యలేదా?" రమేశ్.

"ఏడ–ఇయ్యేడు ఎనుకయ్యింది పొలం....ఊళ్ళె పొలాలన్ని పది దినాలకింద నాట్లయితే– ఇయ్యాల్లయ్యింది మా పొలం. జంబుకొట్టిన. ఔనువ్వన్నమాట నిజమే. మనూల్లె అసలోడెవ్వడు లేకపాయె. ఉన్నసాలోల్ల మధునయ్య ఒక్కదెబ్బకే బొగ్గుబాయిల కాడికి దెంకపాయె–చీపురుసెట్టి మల్లయ్య మనందరిని విడిచి జంగల్లకుబాయె. సెన్నారెడ్డి జమానల ఎగిరి నోల్లంత ఎల్లెలుకలబడిరి. ఎవల నడుగాలె...." లింగయ్య.

"మారె గల్లెట్లయితది–ఎవలు లేందే గియ్యన్ని జర్గుతన్నయా? అడుగును నోళ్ళు అడుగున ఉంటరుగద–"

ఇద్దరు మాట్లాడుకుంటూ వచ్చేసరికి వేపచెట్లకింద షావుకారింటిముందు పదిపదిహేను మందున్నారు. అందులో చాలామంది పక్కపల్లెలోల్లె.

లింగయ్యను విడిచి రమేశ్ ముందుకు నడిచాడు.

బాలుమామతో సెప్పాలె. రాయేసివత్తెదోరాదో? ఏడనన్న పొరుకలు సాటుగట్టుకొని బతుకుత–నా పాలు నాకు పంచుమనాలె–రేపు ఏదో ఒకటి తేల్సుకోవాలె.

ఇంటి ముంగటికి వచ్చేసరికి అందరు వెళ్ళిపోయారు. పందిరికింద పాపయ్య పండి బొర్లుతండు. వంగి చూశాడు. అసహ్యంగా గుడుంబా వాసన గుప్పుమన్నది.

"నే....ను చంపుకున్నానా? మనిషి– బతుకులేనిచేత్తడు. చేతగాక అమ్ము కున్ననా? నా కొడుకు– నా బిడ్డ". పాపయ్య ఎందుకో ఏడుస్తున్నాడు.

రమేశ్‌కు అసహ్యం స్థానంలో నాభిలో కలుక్కుమన్నది. దాదాపు తనలాగే పాపయ్య కూడు కుమ్ములేక నా అన్నవాళ్ళులేక తిరుగుతున్నాడు. రమేశ్ పాపయ్యను లేవనెత్తి వాకిట్లోని గడంచలో పడుకోబెట్టాడు. పంపుల దగ్గరి నీళ్ళు తెచ్చి ముఖం మీద కొన్ని చిలకరించాడు.

"ఇది నాయిల్లు– ఆడిబిడ్ల గాడ్దికొడుక–" అగమ్మ తలుపు దరువాజకేసి బాదుతోంది.

"పీ యిల్లా– గొడ్డటనరుకుత". ముత్యాలు ఉన్నకాడనే ఎగురుతున్నాడు.

దీపం ముందు బిక్కు బిక్కుమంటూ కూర్చున్న పిల్లల మధ్య రాయేశ్వరి తెల్లమొఖం వేసుకొని కూర్చున్నది ...

రమేశ్‌కు ఆకలి కరకరలాడుతోంది. ఆ కొట్లాట తెగకుండా తనకు తిండి దొరికే యోగం లేదు.

మళ్ళీ చింతకై నీడలో వచ్చి తల పట్టుకొని కూర్చున్నాడు.

పన్నెండేళ్ళ శ్రీనివాస్ "అన్నలచ్చిండ్రు" అనుకుంటూ పరుగెత్తాడు.

అన్నలపేరు వినగానే రమేశ్ ముఖం కలకలలాడింది. "ఎక్కడికొచ్చారో" తెలుసుకుందామనుకునే సరికే శ్రీను వెళ్ళిపోయాడు.

రమేశ్ ఆదరబాదరగా ఊరి స్కూలు బిల్డింగ్ దగ్గరికి పరుగెత్తాడు.

అప్పటికే స్కూలు బిల్డింగ్ దగ్గర ఎట్లా తెలిసిందోగాని మాదిగ, మాల, గొల్ల, కుర్మ, కాపు అందరు వచ్చి కూర్చున్నారు. ఇంకా వచ్చేవాళ్ళు వస్తున్నారు. కరంటు బుగ్గ వెలుతుర్లో ముదురు ఆకుపచ్చ బట్టలేసుకున్న దళపోళ్ల జబ్బలకు తుపాకి లేసుకొని అందరిని కూర్చుండ బెడుతున్నారు.

లింగయ్యను వెంటబెట్టుకొని ఒక అన్న చెరువు పక్కనుంచి వచ్చే బండ్ల బాటకేసి సెంట్రీకోసం పోయాడు.

రమేశ్‌కు పోవాలనే ఉన్నది. ఆ తుపాకి ముట్టి చూడాలని, వీలైతే తన అన్నతో తన ఆస్థి పంపకాల గురించి మాట్లాడాలని– భార్యను విడిగా తీసుకపోవ డానికి అన్నలతో ఒక మాట చెప్పించాలని యమ ఉబలాటంగా ఉన్నది. కాని ఇక్కడ అందట్లో అన్నలు చెప్పే ముచ్చట్లు విననేమొనని ఆ ప్రయత్నం మాను కున్నాడు.

తూలుతూనే మంగలి ఇత్తారి అన్నల దృష్టిలో పడాలని అందరిని కూర్చుండ బెడుతున్నాడు....భార్యమాట వినకుండా తమ ఇంట్లో తాగిన గోపాలు ముందే ఉన్నాడు. విచిత్రం తన అన్న అందరికన్నా ఎక్కువ బుద్ధిమంతునిలాగా చేతు లూపుతూ తిరుగుతున్నాడు.

భార్య రాయేశ్వరి వచ్చిందేమోనని చూశాడు. రాయేశ్వరి జ్యోతక్క సుశీలక్క పక్క సిగ్గుపడుతూ నిలుచున్నది.

కమాండర్ పెద్దన్న కన్పించలేదు.

భిక్షపతి నడిమందిలో నిలుచుండి అలవాటైన గొల్లబోయిడి శైలికాల నవ్వు నవ్వి— "అన్నలు అక్కలు అందరచ్చిండ్లు సంతోషం. ఖుర్సతుగ మాట్లాడుకుందాం గని తిరిగి తిరగచ్చినం మాకు తిండి తిప్పలు చూసేదున్నదా? లేదా?" అన్నాడు. భిక్షపతి తీరేగంత ఎప్పుడు ఆవలినుంచి నరుక్కచ్చేరకం.

"బస్ గంతేగద—అన్నలు సెలవియ్యాలెగని కోళ్లు గోసిసిడిపెల పెట్టము" ముత్తయ్య.

నోట్లో నీళ్ళూరినట్టు పెదిమలు నాక్కొని— "సీదేంది మా పెడుతవు నీయింటి కాడ తింటె మరి ఊళ్ళోల్లు నారాజుకారా?" భిక్షపతి

ఉపసర్పంచ్ జనార్దన్ తెల్లటి ధోవతి సింగులు పైకి పట్టుకొని "మనింటి కాడ ఇంతె జాములు సేపిచ్చేదా?" అన్నాడు.

"వారెవాహ్వా ఇయ్యాల్ల నక్కను తొక్కివచ్చినట్టే ఉన్నది....ఒకలింట్ల దిని మరొకలింట్ల తినకపోతే కోపమత్తది. మా కామ్రేడ్స్ వస్తారు తలాకొంత పెట్టండి. ఈలోగా మన కార్యక్రమాలు కొనసాగిస్తాము. ఏమంటారు కామ్రేడ్స్" అన్నాడు భిక్షపతి.

భిక్షపతి పొట్టిగా వామనఛాయగా ఉంటాడు. నోట్లోకంటా వంగిన మీసాలు— దళంలో అందరికన్నా ఎక్కువ వయసుగలవాడు భిక్షపతే—అతను గతంలో గొల్ల బోయిడు. మంచిమాటకారి.

ఇద్దరు దళసభ్యులు తిండి వ్యవహారాలు చూడడానికి వెళ్ళారు. మరో యిద్దరు అప్పటికే ఊళ్ళో రోగులకు మందులిచ్చి అప్పటికే అన్ని ఇండ్లు కలెదిరిగి వచ్చారు. అందులో ప్రభాకర్ ఈ ఊళ్ళో వివరాలు నోటు చేసుకుంటున్నాడు.

మహిళా సభ్యులిద్దరు విడిగా స్త్రీలల్లో కూర్చున్నారు.

అప్పటికే నలుగురు సభ్యులు అంతకు ముందే ఆయుధ శిక్షణ యిచ్చిన గ్రామస్తులను తీసుకొని సెంట్రీకోసం పోయారు. కమాండర్ పెద్దన్న—అనేక కారణాల రీత్యా చిన్నాభిన్నమైన పాతగ్రామ కమిటీ స్థానంలో కొత్త కమిటీ నిర్మాణం గురించి తమ అంచనాలలో ఉన్నవాళ్ళతో విడిగా సమావేశంలో కూర్చు న్నాడు.

ఆనాటి మీటింగు నిర్వహణ, తక్షణ కార్యక్రమం, ఉపకమాండర్ భిక్షపతి నిర్వహించాల్సి ఉన్నది.

శ్రీను మిగతాపిల్లలు అందరికన్నా ముందే భిక్షపతి పక్క నిలబడ్డారు.

సమావేశం మొదలౌతుందనే సూచనగా సుగుణ అమరవీరుల పాట పాడుతూ వుంటే రాయేశ్వరిని ఎవరో కోరస్ కోసం తోశారు. రమేశ్ గుండె గుబగుబలాడింది రాయేశ్వరి బెదిరిపోయి తలవేళ్ళాడేసుకొని నిలుచున్నది.

సుగుణ యమ ఉత్సాహంతో పాడింది.

ఎవరో మందిలోనుండి అమరవీరులకు అన్నారు. అందరుజై కొట్టారు. తుపాకి పట్టుకొని ఆరాముగా నిల్చుండి తన్మయత్వంతో వింటున్న భిక్షపతి ఉల్కిపడి తేరుకొని

"మంచిగ పాడినవ్ సెల్లె నా కండ్లల్ల నీళ్ళచ్చినయ్" మెచ్చుకున్నాడు. భిక్షపతి సరాయించి "ఇవాళ అసలు సంగతేందంటే"—అప్పుడే పసిబట్టినట్టు వాసన పీల్చి "ఇయ్యాల్లేందో అత్తరు వాసన జమాంచి కొడుతంది?" అన్నాడు.

ఆ మాటకు అందరు నవ్వారు.

"అత్తరువాసన కాదు. గుడుంబవాసన" అన్నది మాలోల్ల గుంపులోనుంచి సుక్కపోసు.

"అదా సంగతి—అయితే మన మీటింగు మాంచి జోరుమీద సాగుతదన్న మాట—అప్పుడే అనుకున్న—అన్నలు మాంచి హుషారు మీద తిరుగుతండ్లేంది అని"

ఎప్పటి నుంచో ముంగాళ్ళ మీద కూర్చుండి అడుగుదామనుకున్న కాపు లసుమయ్యలేచి ఎవరిదో కాలు దొక్కాడు.

"అన్నన్న సంపుతివి గదా!" అన్నదెవరో?

"సైసుసైసు" అనుకుంట కాపు లసుమయ్య భిక్షపతి దగ్గరికొచ్చి భిక్షపతికి సొలుగుతూనే షేక్‌హాండిచ్చాడు.... గుడుంబవాసన గుప్పుమన్నది.

"నలుగురికి పెళనా ర్తి, పెండ్లి గావాల్సిన నా బిడ్డను ఏనుగుల కిష్టయ్య రెట్ట బట్టిండు. ఊళ్లె పంచాతు పెడితే కిష్టని అయ్యకు పదెకరాలున్నదని ఆళ్ళపక్షే మాట్లాడిండ్లు—నా బిడ్డను గిప్పుడు ఎవలు జేసుకోవలె—దేవుళ్ళ కెదిరి సూసినట్టు సూ త్తన్న" లసుమయ్య అప్పటికప్పుడు దుఃఖం తెచ్చుకొని ఏడువబోయిండు.

భిక్షపతి ముఖంలో నవ్వు మాయమయ్యింది. అతను చెప్పదలుచుకున్న విషయాలన్నీ మరిచిపోయాడు. ఆ పిల్లను రెక్కపట్టిందో, మరేదన్న చేశాడో అడుగుదామంటే భావ్యంకాదు. అక్కడ కూర్చున్న వాళ్లెవరు కాసేపు చప్పుడు చెయ్యలేదు అంటే గొడవ బాగనే జరిగిందన్నమాట.

"ఏమంటరు లసుమయ్య సంగతి?" భిక్షపతి.

"కిష్టయ్యను పిలిచి అడగండి" అన్నారెవరో?

"కాదు ఉన్నదంత వాళ్ళ నాయిన్న దగ్గర్నే ఉన్నది" అన్నారింకెవరో?

వాళ్ళనాయిన రామచంద్రం చేతులెత్తి "నాదేమిలేదు వాడు సేసుకుంటనంటె గిడనే పెండ్లి చేస్త"నన్నడు.

కిష్టయ్య నెవరో ముందుకు తోశారు. కిష్టయ్య నిలువెల్లా చెమటలు పోశాయి. మనిషి గజగజ వనుకుతున్నాడు.

"భయంలేదు తమ్మీ నీమనసులోమాట చెప్పు" భిక్షపతి.

కిష్టయ్య ముఖం వాల్చుకొని "చూసుకుంట చూసుకుంట బురద నీళ్ళు తాగు మంటె నావశంగాదు" అన్నాడు.

"బురదనీళ్ళా—నీకు సిగ్గులేదు. అసొంటోనివి ఆ పిల్ల చెయ్యి పట్టుకోంగ పడబోయింది. నువ్వు సొక్కం పూసవేన" సుశీలక్క పట్టలాని కోపంతో పరుగెత్తు కొచ్చి కిష్టయ్య గల్లాపట్టుకునేదల్లా భిక్షపతిని చూసి ఆగిపోయింది.

"కోపమద్దు కామ్రేడ్" భిక్షపతి.

అంటే కిష్టయ్య ఆ అమ్మాయిని చేసుకోవడానికి సిద్ధంగాలేదు. వీళ్ళు లసు మయ్య కన్నా స్థితిమంతులు. రామచంద్రం కొడుకు కట్నం గురించి ఆశపెట్టు కున్నట్టున్నది.

ఇలాంటి పంచాయిదుల్లో ఎటుపోయినా ఎంతో కొంత బదునాం పార్టీకి అంటుకుంటున్నది. బహుశా లసుమయ్య తరపున కూడా కిష్టయ్యను ఇరికిద్దామనే ఆలోచన ఉండి ఉంటుంది....

కాసేపటికి మందిలో గొనుగుడు ప్రారంభమయ్యింది.

"ఆడపిల్లను బరదనీళ్ళన్నందుకు కిట్టయ్య ముక్కు బూమికి రాకవల్సిందే" అన్నది హరిజన బాసమ్మ.

అసలు గొడవపోయి ఇదో గొడువయ్యింది. మొగోళ్ళల్లకొందరు "ఆ పిల్ల నొక్కపూస" అన్నారు. ఎక్కువ కులాల ఆడవాళ్ళు ఏదో అరిచారు.

పునాసలప్పుడు మందోట మీది గొడ్లలాగా అయ్యింది పనివరుస — ఇదిట్లా సాగుతుండగానే కిట్టయ్య ఎవలు చెప్పకుండానే ముక్కు భూమికి రాశాడు.

లసుమయ్య నిలబడలేక మందిలో కూర్చున్నాడు.

భిక్షపతి పక్క నిలబడగానే ప్రభాకర్ వచ్చి పెళ్ళికి సంబంధించి దళం ఏమనుకుంటుందో చెప్పిండు.

ఆఖరున భిక్షపతి "కిష్టయ్య, ఆ అమ్మాయి కోపంతో కాకుండా దోస్తానితో ఒకరినొకరు అర్థం చేసుకోవాలని, కిష్టయ్య బుద్ధితక్కువై ఆ పిల్ల చెయ్యిపట్టుకుంటే ఆ పిల్ల తగిన జవాబు చెప్పగలుగాలని అప్పుడే గిసొంటి సంగతులు జరుగవని — ఊళ్ళో మహిళా సంగం లేదనుకోండ్లి. గందుకనే పెట్టుకోండ్లని చెపులిల్లు గట్టుకొని చెప్పుతండ్లు మన అక్కలు" — ఇలాగా చెప్పుకొచ్చాడు.

"అసలు నన్నడుగుతె లసుమయ్య ఇంటికాడ గుడుంబ అమ్ముతాంటెనె గట్ల జర్గింది" అన్నది సుక్కపోసు.

భిక్షపతి సుక్కపోసుకు మనసులోనే దండం బెట్టుకొని అసలు విషయం ప్రారంభించ బోయాడు.

అంతట్లనే ఎవలో పెద్దేలున తుమ్మారు.

"ఓర్నీ అసలే సార సంగతి" — భిక్షపతి పెకపెక నవ్వుతూ, అందరు నవ్వారు.

పొట్టి పెద్దులు లేసి కంచు కంఠంతో ఏదో చెప్పబోయాడు. అతనికే చెప్పరాక నిషా ఎక్కువై కూర్చున్నాడు.

ఇలాంటి లక్ష తొంబై పంచాదులతో కాలంగడుస్తుంది. ఆఖరుకు వచ్చిన పని ఆగిపోతుంది.

భిక్షపతి మళ్ళీ మొదలుపెట్టాడు.

"ఏటా ఇచ్చినట్టుగనే ఇయ్యేడు సారా బందు పిలుపి త్తన్నమ్. ఇయ్యేడు మన రాష్ట్రం మొత్తంల సర్కారు సారా అమ్మద్దు. ఈ నెలాఖరుకు హర్తాళులున్నయి.

....హ్రాజులకెవలు పోవద్దని మనం పిలుపిత్తన్నమ్." భిక్షపతి మాట పూర్తి కాక ముందే.

"సారా హ్రాజులు పట్టినోన్ని కాల్రెక్క విరువాలె" నన్నాడు దాసరి ముత్యాలు. ఇంకా పదిపది హేనుమంది ఇరువాలెనన్నారు. అప్పటిదాకా అనాసక్తిగా ఉన్నవాళ్లు కూడా ముందుకు జరిగారు. సారా అమ్మకాలతో ఈమధ్య బాగుపడ్డ ముత్యాలులాంటి వాళ్ళమీద తాగుబోతులకు కోపంగా ఉన్నది. ఆడోళ్ళకు మొగోళ్ళందరి మీద కోపంగా ఉన్నది. ఊళ్ళో సర్కారు దుకాణం లేకపోతే తమ దందా బాగా జరుగగలదని యమ సంతోషంగా ఉన్నది. బడి గోడ కానుకొని కునికిపాట్లు పడుతున్న కోమటి రామయ్యకు ఈమాట నాగసరం ఊదినట్లుగానే ఉన్నది.

భిక్షపతి ప్రభాకర్‌ను టైమెంత అని అడిగాడు. బాగా చీకటైనట్లే అన్పిస్తున్నా అప్పటికి పావుతక్కువ తొమ్మిదే—అంటే బాగనే టైమున్నది.

"ఇయ్యేడు ఏంజర్గింది. సర్కారు సారా సాలు పొడుగుత అన్ని ఊళ్ళల్ల తీర్గనే బందు పెట్టిచ్చినందుకు మన ఊరును మెచ్చుకోవాలె ఈ పాటికే సానమంది సార తాగడం మానేసిండ్లనుకుంట"— కావాలనే అన్నాడు భిక్షపతి.

ఆ మాటకు మొగోళ్లు నవ్వారు. ఆడోల్లు మూతులు తిప్పారు.

"ఈ ఊళ్లెకు రాంగనేను గట్లనే అనుకుంటచ్చిన. కని ఊరు సొంత్రంగనే గుడుంబ వాసన జమాంచి కొట్టింది. గీ సభల సుత ఇంకా వాసన అత్తనే ఉన్నది". అన్నాడు.

"ఔ....ఔ...." అన్నారు ఆడోల్లు.

"మొదట సారా బందనేటాల్లకు ఊళ్ళోల్లు ఏమనుకున్నరో జెరచెప్పు" మంగలి ఇత్తారిని పిలిచి అడిగాడు....

"ఓహోఁ మారాజా అన్నలు మా మాంచిపని చేసిండ్లనుకున్నం" అన్నాడు బుడ్డరకాం లాగా చేతులు తిప్పుతూ.

"అంటే ఇత్తారన్న తీర్గనే అన్నలను తాగెటోల్లు తిట్టిండ్లు—అక్కలు కడుపు నిండ తిని కంటినిండ నిదురబోయిండ్లు——ఖైర్—గుడుంబ అమ్మిన తెనుగోల్లను కొట్టిండ్లు. ఇగ అప్పుడు పేదోల్లను కొట్టద్దు అన్నం అప్పటినుండి ఊరంతా గుడుంబ పారుతుంది" భిక్షపతి.

వీరలక్ష్మి లేచి "అన్నలూ—పూర్తిగా అద్దు ఫిర్యాదు లేకుంటయ్యింది. ఇగో గీడ ఇపసారి పిట్ట తీర తిప్పుతనోళ్లంత—మాపటేల్లయ్యిందంటే ఊరంత—సార

దుకాణమైపోతుంది. సర్కారింట్ల పీనిగెల్ల ఆళ్ళప్పుడే ఏడనో ఓ దుకాణముండేది. అది ఫిరముండేది. గిప్పుడు ఇంటికో దుకాణమైపోయింది". అన్నది ఏడుపు గొంతుతో.

భిక్షపతి "వారేవాహ్వా మనోళ్ళు ఎండ్లనైన ఒక్కడుగు ముందుకు పదడుగులు ఎనుకకుండేటోల్లు-గిండ్ల మాత్రం పదడుగులు ముందున్నరు. సరే మంచిది. కని ఇట్ల మంచిగలేదు. ఊరంత సార తయారుచేస్తే నాగండ్లెవలు దున్నాలె.... కసుక గుడుంబ మంచిగ చేసేటోల్లుంటె ఇగో ఇక్కడికి రాండ్లి. మన ప్రభాకరన్న పేర్లు రాసుకుంటడు" భిక్షపతి.

ఆ మాటలు నాగసరం నాదంలాగనే తోచాయిగాని పుట్టలోనుంచి ఎవలు బయటకు వెళ్ళాలో తెలియలేదు.

"ఇంకా మేం బువ్వ తినలేదు. వాళ్ళు వస్తే పేర్లు రాసుకుంటం. ఇకనుంచి వాళ్ళే ఊళ్లె గుడుంబ తయారుచేసి అమ్మాలె-" భిక్షపతి.

ఆడోళ్ళంత భిక్షపతి మీద కుతకుత ఉరుకుతున్నారు.

అప్పుడు ముత్తయ్య, లసుమయ్యతోపాటు మరో పద్దెనిమిదిమంది ముందుకు వచ్చారు. వాళ్ళందరిని స్కూలు బిల్డింగ్ గోడ పక్క నిలబెట్టి ప్రభాకర్‌తో పేర్లు రాసుకొమ్మన్నాడు భిక్షపతి.

మరో పదిహేనుమంది లేచారు. అందులో గోపాలు కూడా ఉన్నాడు. గోడవార నిల్చున్నవాళ్ళు గొల్లున లేచారు.

"అసలు వీళ్ళకు గుడుంబ తయారు చేసుడురాదు. ఉత్తగనే పేర్లు రాయించు కుంటండ్లు-" అన్నాడు ముత్తయ్య.

భిక్షపతి కాసేపు దీర్ఘాలోచనలో పడ్డట్టు నటించి, "అయితే చెప్పుండ్లి ఒక్కొక్కలు గుడుంబ ఎట్ల తయారుచేస్తరో ?" అడిగాడు.

"నల్ల బెల్లం, ఇప్పపువ్వు, మురికి తుమ్మ సెక్క" లసుమయ్య.

"అమోనియా, ఊరియా-" గోపాలు.

"ఇంత ఉచ్చ, ఇంత పియ్య-మీ యింట్ల పీనుగులెల్ల సిగ్గులేదు." కొండమ్మ అంతెత్తు లేచింది.

"అగు సెల్లె-నువ్వాగు అహఁ" భిక్షపతి.

"నాగసరం" అన్నాడు ముత్తయ్య.

అందరు తలా కొన్ని పేర్లు చెప్పారు. నీకు తయారు చెయ్యరాదంటే నీకు తయారు చెయ్యరాదని వాదులాడుకున్నారు. ఎన్ని రోజులు నానబెట్టాలి? ఎట్ల 'బట్టి' పెట్టాలి? అని ప్రశ్నలు వేసుకున్నారు.

"అయితే ఇది తెగేట్టు లేదు. ఇప్పటికి ఎవరెవరు తయారుచేస్తున్నరో ? వాళ్ళ కుండలతో సహా ఇక్కడికి రావాలె - తయారుచేసే సామానులు బెల్లం-అన్నీ తేవాలె-దాన్నిబట్టి తేలుద్దాం. పనిలో పని బెల్లమమ్మే షావుకార్ల పేర్లు సుత రాసుకోవాలె-వాళ్ళ ఇక్కడే ఉంటే వచ్చి గోడపక్క నిలబడాలె. మన గుడుంబ తయారు చేసే అన్నలకు సాయంగ మనిషికి నలుగురు సొప్పున బొయ్యి అన్ని పట్టుకరాండ్లి" భిక్షపతి.

ఏం జరుగుతుందో ఎవరికి అర్థం కాలేదు. ఆ కోలు అన్నలను తిట్టుకుంటున్నారు. అన్నలు ఇంటికింత తెచ్చుకున్న అన్నం రకరకాల కూరలు కలిపి తిన్నారు. సెంట్రీ దగ్గరికి కొత్తవాళ్ళ పోగా సెంట్రీవాళ్ళ వచ్చి తిన్నారు.

నానబెట్టిన విప్పపూవు, బెల్లం కుండలు స్కూలు దగ్గరికి చేరుతున్నాయి. బెల్లపు ముద్దలు, సంచులు, సీసలు-అన్ని గుడుంబ సామానులు ఒకరిమీద పోటీతో మరొకరు తెస్తున్నారు. గోవాలు బతిమిలాడి అప్పటికప్పుడు కారుతున్న నల్లబెల్లం రెండు పాతకుండలు మాత్రమే తేగలిగారు.

అక్కడ భయంకరమైన వాసన నిండిపోయింది.

అన్నలు తిని రెండవసారి సమావేశానికి సిద్ధమయ్యారు.

ఈసారి ఆ కోళ్లు చాలా ఎక్కువమంది వచ్చారు. ఈ ఉపద్రవం ఎట్లాగైనా ఆపాలని, అన్నలు సరిగ అర్థం చేసుకుంటలేరని-తమ కాపురాలు సర్వనాశనం అయిపోతున్నాయని, ఊళ్ళో అసలు గుడుంబ అమ్మేదే ఉండవద్దని చెప్పాలని ఉవ్విళ్ళూరుతున్నారు.

అప్పటికే కమాండర్ పెద్దన్న చేరుకున్నాడు. భిక్షపతి ఎప్పుడు నవ్వు పరాచికాల పనే చేస్తడని-పెద్దన్నకు చెప్పుకోవాలని వాళ్ళ అనుకున్నారు.

"సారాబందు పోరాటం బాగనే జరుగుతున్నట్టున్నదే." పెద్దన్న విస్తుపోతూ ...

"సారబందా మన్నా ! ఊళ్ళనే తయారుచేసి అమ్ముకోండ్లని భిక్షపతన్న చెప్పుతండు." అన్నారు స్త్రీలు కలిసికట్టుగా రోషంగా.

"అట్లనా? చిత్రంగా ఉన్నదే" అన్నాడు పెద్దన్న భిక్షపతికేసి చూస్తూ.

భిక్షపతి "ఊరి మొగోళ్ళంతా మనం సారాబందు పిలిపిస్తే ఊరు ఊరంత సార తయారుచేస్తండ్లు. అది మంచిదిగాదు- తయరుచేసేటోల్లు ముందుకు రాండ్లంటె అగో వాళ్ళంత వచ్చిండ్లు. ఊళ్ళె తాగెటోళ్ళు, తయారుచేసేటోళ్ళు అంతా పాపుల మందున్నరు. అగో వాళ్ళు అక్కడ నిలుసున్నారు. మిగతా మూడు పాపులాలమంది ఏమంటరో నేనింక అడుగలేదు."

"విన్నరు గదా! అదీ సంగతి. గిది గుర్రం గిది మైదానం. ముసుగుల గుద్దు లాటేంది. వాళ్లు లాకలాం తయారు చేస్తమంటున్నరు. అగో వాళ్ళు తాగుతమంటు న్నరు. సర్కారు సారా మేం బందుపెడితె అదేదో మా పనే అనుకున్నరు. దానికి తూట్లు పొడిస్తిరి. ఇక మీరేం చేస్తరో చెప్పుండ్లి ? గవర్నమెంటు సింగరేణిల పోలీసుల పెట్టి అమ్మిత్తంది. ఇక్కడ మీ దాంట్ల మీరే తయారయ్యిండ్లు గదా! అగో సూసిండ్లా అన్నల సారా పోరాటం ఎట్లయ్యిందోనంట నవ్వుతండ్లు మీ దాంట్ల తాగి కుటుంబాలు సర్వనాశనం జేసుకోవడం మీరు చూస్తనే ఉన్నరు గదా!" పెద్దన్న చిన్న పాటి ఉపన్యాసం చేశాడు.

అప్పుడు ఆడోల్లకు ధైర్యమొచ్చింది. గుడుంబ సరంజామాతో నిలబడ్డవాళ్ళు షావుకార్లు బిత్తిరిపోయారు.

"బందంటె బందే. మావాళ్లే తాగుడద్దు తన్నులాటలొద్దు" ఎవరో మందిలో నుండి.

"మరి వాళ్ళెమొ తయారు చేస్తమనవట్టిరి. వాళ్ళు మీవోళ్ళెగాదు" భిక్షపతి ఎడ్డితనం నటిస్తూ.

"వాళ్లు అట్లనే అంటరు" కొండమ్మ.

"అయితే ఏం చేద్దాం?" పెద్దన్న.

"ముద్దిబొక్కలిరిస్తే సక్కగైతరు." వీరలక్ష్మి.

"మళ్ళ మా భర్తలను అన్నలు కొట్టిండ్లనరా?" భిక్షపతి.

"వాళ్ళకుండలు వాళ్ళ నెత్తులమీద పెట్టి ఊరేగించితే బుద్ధత్తది." సుక్కపోసు పెద్దన్న నవ్వాడు. ఆ నవ్వు కానియ్యమన్నట్లు తీసుకున్నారు.

అప్పటికప్పుడు దప్పులు వచ్చాయి. దప్పులు లాల్చాపు దరువులో జెనజెన మంటున్నాయి. తలోకుండ నెత్తి మీదెత్తారు. కుండలకు చిన్న చిన్న రంధ్రాలు చేశారు. అ గబ్బు నీళ్ళు ఒళ్ళంతా అసహ్యంగా కారుతున్నాయి. షావుకార్లకు బెల్లప్పు వంచులు దుట్టారు.

అలాంటి విచిత్రమైన ఊరేగింపు దాదాపు గంటకు పైగా నడిచింది.

"కల్లావద్దు లొల్లి వద్దు"

"భూమి కావాలి బువ్వకావాలి"

"సారా కాసేవాళ్ళ మెడలకు సెప్పులదండలు"

"సారా తాగేవాళ్ళ మీసాలకు సీపుర్లు కట్టండి"

మొదలగు చిత్ర విచిత్రమైన నినాదాలతో ఊరేగింపు సాగింది. ఆ ఊరేగింపుకు మహిళా సభ్యులు జ్యోతక్క, సుశీల నాయకత్వం వహించారు.

చివరకు ఆ కుండలు వాళ్ళ నెత్తులమీదనే పగులగొట్టారు. అందరికి నిషా దిగిపోయింది.

చివరగా పెద్దన్న "ఈ సంవత్సరపు మన రాష్ట్రంలో సారాచుక్క అమ్మ నిషేధం. పొలాలకేసే యూరియా, అమోనియా-ఇంకా నాగసరం లాంటివి విషాలు - మనిషిని కొద్ది కొద్దిగా చంపుతాయి. సారా తాగి కుటుంబాలు సర్వనాశనమౌతున్నాయి. కుటుంబం మొత్తం సంపాదన ఒక్కడు ఖర్చు పెట్టుకోవడానికి హక్కులేదు. ఇలాంటి చెడ్డ పనుల వలన కుటుంబాలు ఎట్లా కూలిపోతున్నాయో గారె పాపయ్య కుటుంబమే నిదర్శనం. అతను సారాతోనే సర్వనాశనమై పోయాడు. పైగా సర్కారు మనలను సారా మత్తులో ముంచి మనలను హక్కులకోసం పోరాడకుండా నీరు కారుస్తున్నది. ఈ రోజే చూడండి మన ఊళ్ళో ఎనభై ఎకరాల భూమి రైతు కూలి సంఘం ఆక్రమించింది. పోలీసులు కేసు పెట్టారు. ఇటు భయపడి మనం దున్నుకోలేదు. అటు భూములు వాళ్ళు దున్నుకోలేదు. నడుమ అవి బీడుగానే ఉన్నాయి. మనం ఎంతో ముఖ్యమైన కేసులు, భూముల గురించి మాట్లాడుకోవాలి. అవసరమైతే సాయుధంగానే మనం భూములు దక్కించుకోవాలి. దానికన్నా సార పోరాటం ఇవాళ్ళ రోజంతా తినేసింది. కాపున క్రాప్రేమేడ్స్-సారాను మనం బహిష్కరించాలి. మత్తును మనం దూరం గొట్టాలి. తయారుచేసేవాళ్ళు, తాగేవాళ్ళు, తాగని వాళ్ళమధ్య కాదు మన పోరాటం.

మత్తుకు వ్యతిరేకం. దాన్ని తెచ్చి పెడుతున్న సర్కారుతోని మన పోరాటం.... ....

ఇక అసలు విషయం. మనం ఎవరెవరి మిగులు భూములు ఆక్రమించామో వాళ్ళంతా దాదాపు తాలూకాలో ఉన్నారు. వాళ్ళు సర్కారుకు భూములమ్ముకొని అట్లి

బెంగాలీ కథ :

"ప్రాథమిక హక్కులే... హక్కులు"

మహాశ్వేతాదేవి

నవాగఢ్ చిన్న సంస్థానం. బస్సు పొయ్యే మార్గంలోనే నవాగఢ్ పొలిమేరల్లో వుందా ప్రాంతం. అక్కడి భూములపై ఆస్తి హక్కు పొందినాయనే, ఆ సంస్థానం 'రాజా' అయ్యారు. రాజాసాహెబ్ చిరుతప్రాయంలో అంటే వారికి ఏనాది వయ సప్పుడు దేశం 'స్వరాజ్యం' సంపాదించుకొంది. ఆస్థానాలు రద్దయి, జమీందారీ వ్యవస్థ పోయిందన్నాక కూడా, రాజాసాహెబ్ 'హోదా' అలానే మిగిలిపోయింది. ఇవ్వాల్టికీ ఆయన్ని రాజాసాహెబ్ అనే పిలుస్తారు. సర్కారువారు అదనపు భూములు స్వాధీనపరుచుకొనేంతలోనే, దాదాపు మిగులు భూమిలో చాలా భాగాన్ని శతకోటి చిల్లర దేవుళ్ళ పేర దఖలు పరిచారు రాజావారు. అది ఆనవాయితీగా వున్న పద్ధతి.

అయినా రాజావారికి దారుణమైన అన్యాయం జరగనే జరిగింది. అక్కడి ప్రభుత్వం పాపపు పనికొడిగట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కయి రైలు మార్గం, రహదారుల నిర్మాణాల కోసమని రాజావారి ఆలయ భూములని ఆక్రమించాయి.... ఇదంతా రాజావారు యవ్వన ప్రాంగణంలో అడుగెడుతున్నప్పటి మాటను కోండి.

డబ్బు సంపాయించాలని చూస్తున్నారు. గిరిజన కార్పొరేషన్ హరిజన కార్పొరేషన్ పేర సర్కారు ప్రజలసొమ్ము వాళ్ళకివ్వ జూస్తోంది. మనం భూములను ఆక్రమించు కోవాలి. భూములవాళ్ళ ఆ భూములను సకల హక్కులు మనకు ధారాదత్తం చేయాలి. మన ఊళ్ళకు భూములు కొంటామని సర్కారోదెవడచ్చినా తరిమి కొడుదాం........

ఇకనుండి ఎవరైనా ఈ ఊళ్ళో గుడుంబ తయారుచేసినా ఏ షావుకారి బెల్లం తెచ్చి అమ్మినా అక్కలు ఊకుంటరా?" పెద్దన్న........

"ఊకోము....ఊకోము...." అన్నారు స్త్రీలు....

"ఇప్పుడు ఊరేగింపారు. ఆ తరువాత ఇట్లనే చేస్తే ఊరేగింపుడు గాదు. ఊళ్ళనే ఉంచద్దు" విశపతి

అప్పటికి పదకొండు దాటిపోయింది. దళం ప్రయాణానికి సిద్ధమౌతోంది....

రాజావారి పెంపుడు తల్లిగారు, వారి సంస్థాన వకీలుగారు రాజావారి పట్ల జరిగిన దారుణమైన అన్యాయానికి సిగ్గుతో చచ్చిపోయారు. ఒక వంక రాంచీ, పాట్నా నగరాల్లోని కొమ్ములు తిరిగిన వకీళ్ళతో సలహా, సంప్రతింపులు కొనసాగిస్తూనే, మరొక వంక రాజావారి 'జీవిక'కి ఏ యిబ్బంది రాని పద్ధతుల్లో ఏర్పాట్లు-వెంట వెంట హడావుడిగా జరిగిపోయాయి.

చెట్లు 'నరికే' కాంట్రాక్టులు సంపాదించటం.... కలప, కోత వ్యవహారాల కోసం రంపపుమిల్లు.... అపై రవాణా ఏర్పాట్లకోసం ట్రాన్స్‌పోర్టు రంగం నిర్వహణ ... ఇలా యివన్నీ అమర్చుకొన్నాక, రాజావారు న్యాయం కోసం పరుగులు తీశారు.

ఆరేళ్ళ తర్వాత రవంత న్యాయం రాజావారు పొందారు. ఇక నవాగర్‌లో పండుగే పండుగ. ప్రాథమిక పాఠశాలకి ఆవాళ సెలవు. వంద వాహనాలతో కళకళలాడే 'రాజమాత ట్రాన్స్‌పోర్టు'కి ఆవాళ సెలవే. రాజావారి నివాసం- 'శ్రీనివాసం'- నుంచి తోప్రీహిల్‌లోని న్యాయస్థానానికి, తెహాష్‌లోని శివాలయానికి రంగు రంగుల అట్టపెట్టెల్లో మిఠాయిలు పంపారు.

చాలాకాలంగా నవాగర్‌లో ప్రజలు ప్రశాంతంగానూ, సంతోషంగానూ లేరు. వాళ్ళు ఇప్పటికి కొంచెం ఊపిరి పీల్చుకొన్నట్లయింది. 'దీపాలు వెలిగించి, పండగ చేసుకోండి' అన్నారు ప్రజలతో రాజావారు. అయితే ఎవరికున్నంతలో అంతే సంబరం అనుకోండి. ఆ మాత్రం లేనివాళ్ళు చిన్నబోయి, దిగాలుపడ్డారు.

పదినెలల క్రితం, రాజావారి పొలాలు దున్నే కౌలుదారీ రైతులకి ఎదురు తిరగాలన్న బుద్ధి పుట్టింది. ఎనిమిదేళ్ళుగా రైతుల మనసుల్లో యీ ఆలోచన రాజుకొంటూనే వుంది. అయితే ఎన్నడూ ముందుగా పోలీసులు వూళ్ళోకి రావటం కాంప్ పెట్టటం జరగలా. ముందుగా రాజావారి సొంత మనుషులు యీ రైతులని చితక్కొట్టేవారు. ఆ తర్వాత పోలీసులు రంగప్రవేశం చేసి, రైతు పెద్దలనే వాళ్ళని అరెస్టుచేసి తీసుకుపొయ్యేవాళ్ళు.

నమూనా ఎప్పుడూ యిదే. ఈ నమూనా నవాగర్ నేలకన్నా పురాతనమనుకోండి.

రాను, రాను రైతుల సంఖ్య పెరిగింది. తగ్గట్టే పంటలో తమకు రావాల్సిన వాటాపట్ల, ఆ హక్కుపట్ల చైతన్యం పెరిగింది. దీంతో వీళ్ళ వెనక యింకెవరో వున్నట్లు పోలీసులకి అనుమానం రావచ్చింది.

వీళ్ళ వెనక ఎవరో ఒకరే కాదని వాళ్ళ అనుమానం.

"వీళ్ళ వెనక ఆ కమ్యూనిస్టోళ్ళుండచ్చు.... గిరిజన, హరిజనల హక్కులంటూ అరిచే వాళ్ళుండచ్చు.... ఆ.... తీవ్రవాదులుండవచ్చు.... లేదా యీ వెధవలంతా చేరి ఆ రైతులని ఎక్కేస్తుండచ్చు" అని పోలీసువారు అభిప్రాయాని కొచ్చేశారు.

ఈసారి 'సమస్య' స్పష్టంగా తెలియడంలేదు. మూడునెలల క్రితం- రైతులు తమ హక్కుల కోసం పోరాటం ప్రారంభించిన వేళ- పొడుగాటి గుడ్డమీద ఒక నినాదం రాసుంది—

'పంటలో సగం మా ప్రాథమిక హక్కు'. రెండు కర్రలకి యీ గుడ్డకట్టి రైతులు ఊళ్ళో ఊరేగారు. ఆ అక్షరాలు చికాకు కలిగిస్తున్నాయి. రాజాగారి పొలాల్లో పనిచేసే రైతులు యిన్నాళ్టికి న్యాయంగా తమకి రావాల్సిన వాటా కోరుతున్నారా? ఇదేమన్నా న్యాయంగా వుందా? అసలు వీళ్ళలో ఎవరికైనా అక్షర జ్ఞానం వుందా? ఆ నినాదాలు మరి ఎవరు రాసుంటారు?

రాజావారికి తనెవరో ద్రోహంచేసినట్లనిపించింది. ఇది అన్యాయం. దారుణమైన అన్యాయం. తన్నెవరో అగాధపాతాళానికి తొక్కేస్తున్నట్లు, చిత్రహింసలు పెడ్తున్నట్లు బాధపడ్తారు. ప్రభుత్వం వాళ్ళేమో రోడ్లకీ, రైళ్ళకీ తన భూములు లాగేసుకున్నారు. ఈ రోడ్ల మీంచే రాజమాత ట్రాన్స్‌పోర్టు పంటని, రైతు కూలీలని చేరవేసే దనుకోండి. ఇక ఆ రైలుబళ్ళు తనే కోసిన కలప రవాణా అయ్యేది. అయితే యివన్నీ అంత చెప్పుకో దగ్గ విషయాలేం కావు. తనకి ప్రభుత్వం చేసిన 'అన్యాయం'కి పూర్తి నష్టపరిహారం పొందేలోపునే రైతులు తన నెత్తికెక్కుతున్నారు. కార్మికశాఖ వాళ్ళతో చెప్పి ఏ విధంగానైనా తమ వాటా తమకు రావాలని రైతులంటున్నారు.

ఎప్పటిలా పంటని రాజావారి సొంతమనుషులు కోసుకుపోవడాన్ని యీసారి రైతులు సాగనీయలా. రాజావారి మనుషులైన మధురాసింగ్‌ని బాదేశారు. చందన్ మల్ చేతుల్లోని తుపాకీ గుంజుకొన్నారు. చివరికి రాజావారే స్వయంగా తుపాకీ పేల్చాల్సి వచ్చింది. కొందరు రైతులు అందుమూలంగా చనిపోయారు.

ఇది యిలా జరిగింది. ఉహూ.... ఎప్పుడూ యిలానే జరుగుతూ వస్తోంది.... ఈ ఘటనలు నవాగర్ నేలంత పురాతనం.

రాత్రి పడుకోనేప్పుడు అవ్వలు పిల్లలకి యిలాంటి కథలే చెబుతుండేవాళ్లు.

".. అప్పుడు చిన్నా, ... రాజావారు వచ్చార్రా. ఆయనన్నారు... 'ఒరే, దుకియా.... ఏందిరా యిగో ఇదంత....' అప్పుడు మీ తాతల్నాడు ...' గొడవేం లేదు. పంటలో మా వాటా మా కివ్వండి. మీ గుంతాలని వెనక్కి పొమ్మని చెప్పండి' అప్పుడు రాజావారు ధాం అని తుపాకీ పేల్చారు. మీ తాతకి గుండు దెబ్బ తగిలింది. తాత గుండె బద్దలయి రక్తం వరదలై ప్రవహించి గంగమ్మ తల్లిలో కలగలసి పొర్లి ప్రవహించింది."

ఇలాగే, యిద్దిలాగే జరుగుతుండేది ఎప్పుడూ. భూమున్న భూస్వాములు, రెక్కాడినా డొక్కనిండని రైతు కూలీలు.... వీళ్ళ కథ ఎప్పుడూ యిలానే ముగుస్తుండేది.

ఈ కథ దారి మలుపు తిప్పే నాథుడే కరువయ్యాడు. అయితే యిప్పటికి కథ అడ్డం తిరిగింది. రైతులు పిడి గుద్దులు గుద్దారు. తిరగబడి తమని బాదిన వాళ్ళని చితక్కొట్టేశారు. వాళ్ళు గొంతెత్తి ఆకాశంఅంచులు తాకేలా అరిచారు....

"మేమడిగిన పంటలో సగభాగం
మా ప్రాథమిక హక్కు."

నవాగర్ జన జీవితంలో కనీ వినీ ఎరుగని ఘటన యిది. ఆ వెంటనే, పోలీసులు వూళ్ళొకొచ్చి 'క్యాంపు' పెట్టారు. దూకియా శవాన్ని స్వాధీనం చేసుకొన్నారు. గాయపడ్డవాళ్ళు ఆస్పత్రి పాలయ్యారు. వూళ్లో శాంతి భద్రతలు లేకుండా విధ్వంసానికి పాల్పడ్డ 'నేరా'నికి రైతులపై కేసులు పెట్టారు. అటువంటి పరిస్థితిలో ఒక కొత్త పరిణామం చోటుచేసుకొందీసారి. రైతు సంఘం కూడా కోర్టులో మరో కేసు దాఖలు చేసింది. ఏమైనా వాళ్ళు పోరాడాలనుకొన్నారు.

పోలీసు క్యాంపుతో ప్రతి వొక్కరు నిరుత్సాహపడ్డారు. మూడునెలలు ఎక్కడా కదలిక లేదు. ఈ కాలంలో రాజావారు ఏం బాగుపడ్డారో? సడీ, సవ్వడి లేకుండా వూరు ప్రశాంతంగానే వుంది. ప్రతి ఒక్కరూ విషయాలు చర్చిస్తున్నారు.

దుసాదు తెగకి చెందిన 'బికారి' అతీ గతీ వూళ్ళో ఎవరూ పట్టించుకోలా. పికి పికిగా నిరపాయకారిగా వుండే వాణ్ణి పట్టించుకోవాలనేం లేదు. బికారి మేకలని మేపుకొంటూ ఏదో అలా బతుకు వెళ్ళదీస్తుంటాడు. మేకలు కాయటం చాలా సులభమేమరి. అడ్డమైన గడ్డి తింటుంటాయి. సంవత్సరంలో ఒకటికన్నా ఎక్కువ సార్లే యీనుతాయి.

ఇంకెవరన్నా అయితే మేకలని పిండి డబ్బు దస్కం బాగా చేసుకొనుండే వాళ్ళే. ఆపేం ఖర్మోగాని, బికారి ఒక్కడి పనేం బాగోలేదు. బికారి మేకలు వ్రతం పట్టినట్లు కుటుంబనియంత్రణ పాటిస్తున్నాయి. రెండు ఆడమేకలు ఒక మగ మేక లేదా రెండు మగ మేకలు ఒక ఆడమేక వున్నాయి. అంతకన్నా అవి ఎన్నడూ ఎక్కువ కావు. తక్కువా కావు. పాపం! బికారి రోజులు బాగాలేవు.

"ఇంకోరు యింకోరు అయితే మస్తు సంపాదించి వుండేవాళ్ళు. నీ ఖర్మకిట్లా కాలింపేందిరా" అన్నాడు సెట్టి.

"ఏం చేయమంటావు షావుకారా! నేనా అడవిలో వుంటుంటిని. ఏ పులో గిలో నా మేకలని ఎత్తుకు పోతూనే వుండె. సరే. షావుకారా! కాసింత మక్క (జొన్న) పిండి, కాసింత పచ్చడి యియ్యి. ఆ! మర్చినా ... కాసింత వుప్పుకూడా పెట్టు".

"అంతే, యిక చాలా?"

"చాల్చాలు, షావుకారా".

"అది కాదురా, సంతకుపోయి నీ మేకలని ఎందుకు అమ్మవురా? మంచిరేటు పలుకుతుందిగా ..."

"ఆ! ఏం చెయ్యమంటావు షావుకారా? నా మొహంజూస్తే ఎవరూ సరిగా డబ్బు కట్టియ్యనే కట్టియ్యరాయె".... అంటూ సిగ్గుతో చచ్చిపోయాడు బికారి. మొహం వేలాడేసుకొని తిరుగు ముఖం పట్టాడు.

చిన్న మేకపిల్లలని ఎత్తుకొని, పెద్ద మేకలని తోలుకొంటూ అడవిలో తిరుగుతుంటాడు. వాటి కళ్ళలో భయాందోళనలు గూడు కట్టుకొన్నట్లుంటాయి. పైగా నోటి చివర్ల నుంచి ఎప్పుడూ సొల్లు కారుతుంటుంది.

"ఒరే, బికారీ! ఏందిరా విషయం?" అన్నారెవరో.

"పోలీసులే .. పోలీసులొచ్చారు"

"నీకేమవుతుంది వాళ్ళొస్తే ..."

"నా మేకలన్ని పొతం పెట్టుకపోతారు వాళ్ల."

బికారి ఆ మాటలంటూనే ఒక్క వుదుటున అడవిలోకి పరిగెత్తాడు. మేకలకి బద్ధ శత్రువులైన దొంగనక్కలు, తోడేళ్ళు వుండే అడివే ఊపూరికన్నా నయం. బికారికి ఒకే ఒక్క శత్రువున్నాడు— వాడు పోలీసు.

అదీ సంగతి. అందుకనే పురుకులు పరుగులతో అడివికేసి, నాలుగు కొమ్మలు విరిచి మేకలకింత గూడు చేశాడు. మేకలని దాన్లోకి తోలి ముడుచుకు వణుక్కుంటూ కూచున్నాడు.

ఈ మేకలు తప్ప భికారికి యీ ప్రపంచంలో మరే సిరి సంపదలు లేవు. కుంట నేల చెక్క లేదు ... పెళ్ళాం లేదు.... పిల్లల్లేరు. ఇంత నౌకరీ అనేదీ లేదు. మిగిలిందల్లా పీలికలు పీలికలైన వంటిమీది బట్టలు, మిగిలిన జీవాలు (మేకలమంద)

అసలు మేకలమంద సవ్యంగా వుంటే బాగానే వుంటుంది. తన మంద పదో పదిహేనో అయితే, కడుపుతో వున్న మేకలని తనే వుంచుకొని, మిగతా వాటిని 'సుమది' లో వారంవారం జరిగే సంతకి తోలుకెళ్ళి మంచి లాభానికి వాటినమ్మేయొచ్చు.

డబ్బు చేతిలో పడంగానే మోకాళ్ళ కిందవరకూ వుండే ధోవతి కొనుక్కోవాలి. ఇప్పటివరకూ తను కట్టేది గజ్జల కిందికి, మోకాళ్ళ మీదికి వుంటోంది. ధోవతితో పాటు కొత్త తువ్వాల కూడా కొనుక్కోవాలి. ఆ తర్వాత 'సుమది' గ్రామానికి గాని, తన దుసాదు తండాకి గాని పోయి ఎవరైనా పిల్లనిస్తారేమో వాకబు చేయాలి. పిల్ల పెద్దదయినా ఫర్వాలా. విధవరాలు అయినా ఫర్వాలే. ఊళ్ళో మంగలోళ్ళకి విషయం బాగా తెలుసుంటుంది. పెళ్ళంటూ కాగానే తమిద్దరికీ మంచి గుడిసె వేసుకోవాలి. ఇద్దరూ కల్సి మేకమందని యింతకు అంత చేయాలి.

ఐతే భికారీ కలలు ఎన్నడూ నిజంకాలేదు. బదీగ్రామం దుసాదులు సాగు భూమిలో గుడిసెలేసుకొనుంటున్నారు. వాళ్ళతో చేరి శాస్త్రనయంగానే వుంటున్నాడీ మధ్య భికారీ. కానీ, యింతలోనే వుపద్రవం వచ్చి పడింది. బదా గ్రామం యజమాని గణేష్ సింగ్, దుసాదులతో గొడవపడటంతో వాళ్లు సింగ్‌ని చంపేశారు. పోలీసులొచ్చి దుసాదుల మేకలమందలని తోలుకుపోయారు. పనిలో పనిగా భికారీ మేకలని కూడా తోలుకు పోయారు.

ఉన్నవే మేకలాయె. అవి పోయేసరికి భికారీ పొర్లి పొర్లి ఏడ్చాడు. వాని ఏడుపు పోలీసులకేం పట్టె. కడుపుతో ఒక మేక మిగిలుంటే, దాన్ని తీసుకొని నాదా గ్రామానికి పొమ్మని భికారికి సలహా చెప్పాడు రంకా దుసాదు.

"నాదాలో అయితే బోలెడంత మేత దొరుకుద్ది. నీ మటుకు నువ్వు మర్రి చెట్టు కింద పడుకోవచ్చు"....

వేరే దారిలేక భికారీ అదే పని చేశాడు. మర్రినీడలో వెదురు గడ్డితో గుడిసె

వేసుకొన్నాడు. అదీ వాని పాలిటి పర్ణశాల. ఆడమేక పిల్లమేకని యీనింది. రోజులు గడిచే కొద్దీ పిల్లమేక కండబట్టింది. నాదా గ్రామ భూస్వాములు 'రాజపుత్రు'లు. మాంసమంటే పడిచస్తారు. బాగా కొవ్వెక్కి, బలిసారు. వాళ్ళకి బికారి ఎవరో తెలియదు. వాళ్ళకి మాంసం కావాల్సినపుడల్లా బికారి దగ్గరకొచ్చి జేరం చేస్తుంటారు. ఒక్కో మేకకి పదో పరకో విదిల్చి, పది పదిహేను కిలోల బరువున్న మేకని చంక బెట్టుకు పోతుంటారు. పాపం తనేం చేయగలడు వాళ్ళని కాదని. కొందరి పుట్టుకే అంతేనేమో.... అగర్భ దరిద్రులు.

హోలీ పండగలప్పుడు గానా బజానా చేస్తున్న బృందంలోని ఒక పిల్లని నాదా భూస్వామి కాల్చి చంపాడు. ఎప్పటిలా పోలీసులు రానే వచ్చారు. పోలీసుల పంటికిందకి మేక నెత్తుకు రమ్మని భూస్వామి తన గుండాలని బికారి వద్దకి పంపాడు. వరుసగా మూడు రోజులు రోజుకొక మేకని సమర్పించుకొని, బికారి నెత్తిన చేతులు పెట్టుకొని ఆ వూరు వదిలాడు.

కొందరికి యీ ప్రపంచం విశాలమైందే కావచ్చు.... కాని బికారిలాంటి వాళ్ళకి మాత్రం కాదు. గుండె బండ చేసుకొని నాదా వదిలి బికారి తెహాద్ చేరాడు. అక్కడి శివాలయంకి పోయి పూజారి హనుమాన్ మిశ్రా కాళ్ళు మొక్కాడు.

మిశ్రా మొహంలో మిల మిలా ధగ ధగా తేజస్సు పుట్టిపడుతుంటుంది. రోజూ పాల స్నానం చేస్తూ, కడుపునిండా తాగుతూ, పరమేశ్వరుడితో యిష్టాగోష్ఠి జరుపుతుంటే మెరవకేం చేస్తాదెవరైనా ?

అడవి అంచున గుడిసె వేసుకొన్న దుసాదు తండాకి చేరాడు బికారి. వాళ్ళు బికారిని సాదరంగా అహ్వానించారు.

ఆ తండాలో ఒక ముసిల్ది వుంది. ఆమె కడుపుతోవున్న మేకలని కాస్తూ, గంజికాసి పోస్తుంటుంది. వాళ్ళతో కలిసి వుండమన్నారు బికారిని.

"మాతో వుండవయ్యా. మాలో మనొకడు పెరిగినట్లుంటుంది. కాస్త వెనకా ముందుగా నీకు పెళ్ళి కూడా జరిపించేస్తాం".

వాళ్ళతో చేరి, అక్కడ బికారి సంతోషంగానే వున్నాడు. ఆ మున్నాళ్ళ ముచ్చట - దరోగా [పోలీస్ స్టేషన్ యిన్-చార్జి ఆఫీసరు] మిశ్రాని పలుకరించటానికి వచ్చేసరికి - చట్టుబండలయింది. దరోగా గారు వారంపాటు విడిదిచేశారు. దేవుడి అవతారమైన మిశ్రా బికారిని పిలిచి మేకలని సిద్ధం చెయ్యమన్నారు.

"స్వామీ! నేను వాటిని అమ్ముకోవాలయ్యా"....

"ఏం కూశావురా ? అమ్మితావ్....దేవుళ్ళు, బ్రహ్మల తర్వాత వాళ్ళంతటి వాడు దరోగా అంటే. ఆ మాత్రం యింగితం లేదురా నీకు. ఆయన మాంసం తినా లనుకొంటుంటే, నువ్వు దణ్ణాలడుగుతావా ?"....మిశ్రాగారు కళ్ళెర్ర చేశారు.

బికారి తన మేకని సమర్పించుకొని, తెహాడ్‌ని వదిలిపెట్టాడు. బికారి పోతుంటే, అక్కడి దుసాద్‌లకి బాధ కలిగింది.

ఏం చేస్తాడు మరి?....బికారీ జీవనాధారం మేకలే. మిగతా వాళ్ళలా పొలాల్లో పనిచేయడం, కట్టెలేరుకు బతకడం తనవల్ల కాదు. మాటిమాటికి పోలీసులు బికారీ జీవికని దెబ్బతీస్తూనే వున్నారు.

తెహాడ్‌లోని దుసాద్ తండా బికారికి బాగా నచ్చింది. అక్కడెవరూ యితన్ని చిన్నచూపు చూడలేదు. ఆ పేదవాళ్ళ మధ్య నిరుపేదలా వున్నాడు. అక్కడి ముసిల్ది ఏదో ఒక కూర వండిపెట్టేది. 'ఛహట్' పండుగప్పుడు హరో భార్య కొడుకుతో పచ్చళ్ళు పంపుతుండేది. హరో ఒకసారి ఏదుపందిని కొట్టి తెచ్చాడు. వాటా వేసినపుడు బికారీ వంతు మాంసం బికారికి యిచ్చారు.

తిరిగి తిరిగి బికారి నవాగర్ చేరాడు మళ్ళీ. అక్కడి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సుఖచంద్ స్వతహాగా మంచిమనిషి. మర్రిచెట్టు నీడలో కూచొని ఆయన బికారితో పిచ్చాపాటి మాట్లాడేవాడు. ఆయన యువకుడు కావటంవల్ల అక్కడి ఆచార వ్యవహారాలు, పద్ధతులు యింకా తెలిసిరాలా.

"బికారీ! రాత్రిపూట వయోజన విద్య పాఠాలు చెపుతుంటాను. నువ్వు కూడా రారాదా" అనడిగాడు.

"నాకు....చదువా ? నేను చదవటం.... రాయటం నేర్చాలా....బాగుందయ్యా. అట్లాగైతే, నేనూరొదిలిపోవాలి. లేకుంటే రాజావారు పెడబెట్టి నూకిస్తారు. అంతే కాదయ్యా....పోలీసొచ్చి జైల్లో నూకుతాడు. సెట్టి సరుకులివ్వడు. వూరోళ్ళ బావి నుంచి నీళ్ళు తోడుకోనివ్వరు...."

"ఎందుకని...."

"ఎందుకేంటయ్యా! ఒకసారి సెట్టిని టార్చిలైటు ఎంతని అడిగా.... యిను కుంటున్నావా.... సెట్టికి నిండా కోపం వచ్చింది. ఏమన్నాడో తెలుసా.... ఒరే దుసాదు.... చిన్నాచితకా పనులు చేసుకు బతికే వెధవ్వి, నీకు టార్చి కావాల్రా అని గుర్రుమన్నాడు".

భికారి చెడిపోయి మూలనపడ్డ విరిగిన బస్సులో పొద్దు పుచ్చేవాడు. రాజావారి వకీలు ఎక్కడెక్కడి మూలనపడి చెడిపోయిన బస్సులని కొని, పెద్దగుట్టగా అయ్యాక పాత తుక్కుగా దాన్ని లాభసాటిగా అమ్మేవాడు. భికారిలానే కొందరు బిచ్చగాళ్ళు ఆ బస్సులో రాత్రులు గడిపేవారు. ఆ యినుప తుక్కు గుట్టల నడుమ మొలిచే పచ్చగడ్డి మేకలు మేస్తుండేవి. మేతకి వేరే జాగాలున్నా భికారి మేకల మందకి ఆ గడ్డే సరిపోతుండేది.

అడవిలో కూచొని ఏవేవో ఆలోచనలు చేస్తుండేవాడు భికారి. సెట్టి దుకాణం ఎన్నడూ లూటీ చెయ్యని పోలీసులు, పాలవాళ్ళ పశువుల మంద జోలికిపోని పోలీసులు....ఎందుకని ఎప్పుడూ తన మేకల మీదే పడతారు ? మేకలు తప్ప తనకున్న దేందని ?

ఆ అడవిలో మేకల గూడులోకి మేకల్ని తోలి, వాటిని చల్లగా చూసుకోమని రెండు చేతులెత్తి రాముడ్ని వేడుకొని, తడబడే అడుగులతో, అదిరే గుండెతో రాత్రికి తన గూడు చేరేవాడు. ఇక అక్కడ భికారికి తోడూనీడగా లంగ్రా, కని లతోపాటు కుష్టువ్యాధి వచ్చిన దోరా వుంటుండేవాళ్ళు.

“వెళ్ళిపో....వెళ్ళిపో....పోలీసులొచ్చారు” అన్నారు ఒక్కసారిగా లంగ్రా, కని, దోరాలు.

మట్టిముంతలో నీళ్ళు పట్టుకొని, బెల్లం, మక్క (జొన్న) పిండి ముద్ద పట్టు కొని అడవిలోకి పరుగుతీసాడు.

‘రాముల’వారు అప్పుడప్పుడు భికారిని దయగా చూసేవారు. అప్పుడు మేకలమంద సురక్షితంగా వుంటుండేవి. అప్పుడప్పుడు రాములోరి సీతకన్ను పడి, అడవి జంతువులు మేకలని ఎత్తుకుపోతుండేవి.

భికారి మేకల కిన్ని నీళ్ళు తాపాక, తన వెంట తెచ్చుకొన్నది తినేవాడు. మక్కపిండిలో యిన్ని నీళ్ళు పోసి, పిసికి ముద్దచేసి తిన్నది తినగా మిగతాది ధోతి అంచుల్లో మూటకట్టి బొడ్లో దోపుకునేవాడు. రెండు మూడు రోజులలా గడిచి పోయేది. పోలీసులు వూరు విడిచి పోయారని తెలియగానే, భికారి నవాగర్‌కి పొయ్యే వాడు.

అయితే యీసారి పోలీసులు నవాగర్‌లో మూడు నెలలు తిష్టవేసారు. భికారి యీ దెబ్బకి అడవి పురుగులా మారాడు. ఇక యిలా లాభం లేదని అడవిలోగుంటా

బాదా గ్రామం చేరి రంకా దుసాధ్‌ని కలిశాడు. రంకా తోడ్పాటు లేకుంటా యీ అడవిలో బికారి బతికి బట్ట కట్టలేడు. రంకా బికారి సమస్య సావధానంగా విన్నాడు.

'సరే. వుండు' అన్నాడు రంకా.

రంకా దుసాధు పిల్లలని పిలిచి అడవిలోకి తీసుకుపోయాడు. అక్కడ చెట్ల కొమ్మలు రెమ్మలతో బికారికి చక్కటి గుడిసె వేసి వుండిపొమ్మన్నాడు. పక్కనే కాలవలో మంచినీళ్ళు పారతాయన్నాడు.

"అవ్వారే! మరి తింటానికి...."

"నీ దగ్గరేమన్నా డబ్బు వుంటే యియ్యి. పోయి సరుకులు తెచ్చిపెడతా".

"ఇగో తీసుకో" అన్నాడు బికారి.

కొద్ది రోజులలా గడిచాక రంకా ఒకరోజన్నాడు—

"బికారీ. నువ్వెన్నాళ్ళు యిక్కడుంటావో ఆ భగవంతుడికెరుక. ఆ మేకని అమ్మేయరాదూ"

"ఎక్కడమ్మమంటావు?"

"సంతలో"

"అంటే తోడ్రీ పోయా"

"మరింకెక్కడమ్ముతావు ?"

"నిజమే. నేనక్కడికి పోనుగా...."

"నా మీద నమ్మకముంటే చెప్పు .. నే పోయొస్తా"

"వార్నాయనా! నిన్ను నమ్మకేం చేసేది. పోయిరా పో"

"మంచిది"

రంకా మేకని అమ్ముకొచ్చాడు. బికారికి అరవై రూపాయలు పుట్టాయి. తనో రాజాననిపించింది. అక్కడున్న మూడు నెలల్లో మరో మేక పుట్టింది. దాంతో యింకో మేకని అమ్మి, ఆ డబ్బులు తనకి కూడు పెట్టినందుకుంచమని రంకా కిచ్చాడు.

'బికారీ. మీ వూరినుంచి పోలీసులు వెళ్ళి పోతున్నారట మీ వూరు పొయ్యాక అప్పుడప్పుడు యిటువచ్చి పోతుండు' అన్నాడు రంకా

కొనుదుసాదు ఒక రోజు వచ్చి "మీ వూరు నుంచి పోలీసులు పోయారు" అని చెప్పాడు.

బికారి దగ్గర యిప్పుడు రెండు పోతు, రెండు ఆడ మేకలు, నాలుగు

మేక పిల్లలు....కలిసి ఎనిమిది మేకల మంద వుంది. రంగా సలహా ప్రకారం పోలీసులు పోగానే బికారి నవాగఢ్‌కి పోయ్యాడు. బిచ్చగాళ్ళు బికారి రాకతో చాలా సంతోష పడ్డారు.

బెట్టుకొమ్మ విరిచి కని ఆవాగా శుభ్రంచేసి, అంతా సవ్యంగా వుందో లేదో నని ఒంటికన్నుతో పరిశీలించింది.

"బికారి ... యీ మాట విన్నావా? దొరా వెళ్ళిపోయాడు". అంది కని ఎక్కడి కన్నాడు బికారి.

"సుమందికి. అక్కడ సంతలో అడుక్కుంటే పైసలెక్కువస్తాయంట. సరే లంగ్రా గాడేంచేసాడో తెలుసా....దాలీని వెళ్ళగొట్టి, యింకోదాన్ని వెంటబెట్టు కొచ్చాడు".

"సరే....మరి నీ సంగతేంది" అన్నాడు బికారి.

"సరేసరే! నన్నా ఈ ఒంటికన్ను దాన్ని ఎవడేలుకుంటాడు. రెండు కళ్ళు పోయుంటే నేనూ చాలా పైసలు అడుక్కునేదాన్నే....పైగా ముసల్దాన్ని కాదు. ఎవరు చూసినా బాగానే వున్నావుగా, పనిచేసుకు బతకరాదూ....అననేవారే. ఇక్కడి నుంచి తోహ్రాదాకా నడిచి పోయొస్తుంటా. అదీ పనికాదా...." అంది కని. బికారి అవునన్నాడు.

"ఇదిగో బికారి....నీ దగ్గర మేకలమంద కాన వుంది".

"అవును. రేపు వాటి నమ్మేస్తున్నా".

"ఆహా! వూళ్లో కొత్త విశేషం యిన్నావా?"

"ఏందంటా?"

"మరేమో....రాజావారికి సర్కారు నుంచి ఏదో పుట్టిందంట. వూరంతా హడావుడదావుడిగా వుంది. మంచి విందు భోజనాలుంటాయంట. సాయంకాలం బాణా సంచా కాలుస్తారంట—"

"అయితే నీకు మంచి అవకాశమే" అన్నాడు బికారి.

"ఆ నా బొంద....అక్కడ కొచ్చిన పెద్దోళ్ల కంచాలన్నీ నాకేస్తారు. మెతుకు కూడా మనకి మిగల్చరు. అప్పుడెప్పుడో బైజనాథ్ తల్లి చనిపోయినప్పుడు మాత్రం కడుపు పగిలేలా తిన్నాం".

బికారి కని మాటలు వింటూ తలూపాడు.

"అవును....బికారి ఇప్పుడెటుపోతున్నావు?" అడిగింది కని.

"సుఖచంద్ సారు దగ్గరికి".

నవాగఢ్‌లో భికారిని సుఖచంద్ తప్ప ఎవరూ పట్టించుకోరు. పాలు, మాంసం అడిగినవాడికి యివ్వటమే వాడిపని. కాదంటే వాడి గతి యింతంతే. నవాగఢ్ నేలంత పాత వాత కథలవి.

సుఖచంద్ స్కూలుకి వెళ్ళేరోజు. మర్రిచెట్టు కింద కూచోని, పాలు పెరుగు అమ్మి బాగా డబ్బు గడించి పైకెదిగిన మోతిహార్, భక్తులకి సుఖచంద్ ఏవో వివరిస్తున్నాడు.

"రా....రా....భికారి....ఎప్పుడొచ్చావు" అంటూ సాదరంగా పిలిచాడు.

"పొద్దుగాల వచ్చాసారు".

"ఇన్నాళ్ళు ఎట్లున్నావ్? బాగున్నావా".

"ఆ....ఏదో ఆ రాముడి దయ. మీరు బాగున్నారా సారు".

"ఆ....మంచే. రా.... కూచో".

భయం భయంగా నవ్వుతూ, కొద్ది దూరంగా జరిగి మోకాళ్ళ మీద కూచున్నాడు. లావు లావు చెప్పులు, చెవులకి బరువైన యిత్తడి రింగులు, నెత్తికి టోపీలు, చేతిలో నిడుపాటి కర్రతో కూచున్న ఆపాల ఆసాములని చూస్తుంటేనే వణుకు పుట్టుకొస్తోంది.

మోతిహార్ భికారిని గమనించనట్లే సుఖచంద్‌తో ఇందాకటి నుంచి చెబుతున్న విషయం కొనసాగించమన్నాడు.

"ప్రారంభం నుంచి...."

"ఆ...."

"నేను వివరించినట్లు...."

"ఏం చెప్పినవో ఏమో! రోడ్లు, రైలు పట్టాలు రాణావారి భూములు గుండా వేసారు. అది మామూలేనాయె. వాటికేం గాలిలో వేస్తారా? ఏం? ఏమంటావు భక్తా" అన్నాడు మోతిహార్. భక్తా తలూపాడు.

"మరి రాణావారు కోర్టుకెందుకు పోయినట్లు? ఇదర్థమై చావటంలే" దన్నాడు మోతిహార్.

"ఏం? ఆయనెందుకెళ్ళకూడదు? ఆ భూములు ఎవరివని? రాజావారివేగా...." అన్నాడు సుఖచంద్ కావన్ను! అవునన్నారు వాళ్ళిద్దరూ.

"ఆయన ఆ భూములు సొంతదారు....అవునా?"

"అవునయ్యా....అయితే ఏంటి?"

"భారత రాజ్యాంగం ప్రకారం స్వంత ఆస్తిపై హక్కు కలిగివుండటం ప్రాథమిక హక్కు. మనకి ఏడు విధాలైన ప్రాథమిక హక్కులున్నాయి. రాజ్యాంగం పౌరుడి యీ ప్రాథమిక హక్కులను కాపాడేందుకే వున్నది..." అన్నాడు సుఖచంద్.

"ఎంత విచిత్రంగా వుందయ్యా! ప్రాథమిక హక్కులు అనేవి అసలు మంచివే నంటావా? అసలు సవ్యంగా వున్నట్లేనాని" అన్నాడు మోతీహార్.

"ఏం ఎందుకు సవ్యంగా లేనట్లు ? ఎందుకనుకొంటున్నావట్లా నువ్వు ?"

"మరి రైతులు ప్రాథమిక హక్కులంటూ అరవంగానే పోలీసులెందుకొచ్చినట్లు ?" మోతీహార్ అడిగాడు.

"అబ్బే...అది వేరే. అదిప్పుడు శాంతిభద్రతల సమస్య. అందుకనే పోలీసులొచ్చారు".

"ఆహా! సంతులా....అస్సలీ ప్రాథమిక హక్కులంటే అవేందయ్యా?"....

సుఖచంద్‌కి తన జ్ఞానం ప్రదర్శించుకొనే అవకాశం దొరికినందుకు సంబర పడ్డాడు. అన్ని హక్కులన్నీ లెక్క పెట్టుకొన్నాడు. "మొదటిది 'సమానత్వం' హక్కు. జాతి మత కుల వర్ణ భేదాలతో నిమిత్తం లేకుండానే మనుషులందరూ సమానులు".

"అలా అని ఎక్కడైనా రాసుందా"

"కావచ్చు"....అన్నాడు సుఖచంద్.

"ఇదేదో యింగ్లీషోడి నిర్వాకం అయ్యుంటుంది".

మోతీహార్ తను నమ్మిన విషయాలపట్ల ధీమాగా వుంటాడు.

"జాతి, మత, కుల, వర్ణ తేడాలేం లేవా? మరి భక్తా నేనూ సమానులమేనా ?

"ఆహా ! రాజ్యాంగం ప్రకారం అదంతే".

"అదంతా అబద్ధం. తేడాలనేవి ఎప్పుడుంటూనే వచ్చినయి. వాడికులం వల్లేగా భక్తాగాడిని ఏ పెద్దింటోడు గడపలోకి రానివ్వంది ? అనుకుంటున్న నీళ్ళు మనం ఎవరమైనా తాగుతామా ? మన శత్రువులెవరో యీ అబద్ధాలల్లారు. ప్రధాన మంత్రులనే చూడు. జవహర్‌లాల్ నెహ్రూ అయ్యాడు ఇందిరాగాంధీ అయింది. బ్రాహ్మలని, దుసామలని ఒక తీరుగా చూసి, సమానంగా గౌరవించటం అనేది మన మెన్నడైనా విన్నామా ? కన్నామా ?"....

ఇక ఆ తేనె తుట్టె కదలించబోయాడు సుఖచంద్. చాలా తేలిగ్గా ఒకటి రెండు మాటల్లో ప్రాథమిక హక్కుల గురించి చెప్పేశాడు.

"అన్నీ అబద్ధాలే" అన్నాడు భక్త.

"ఎందుకు" అన్నాడు సుఖచంద్.

"మనిషికి తన యిష్టమైన వృత్తి చేసుకొనే స్వేచ్ఛ వుందా?"

"అహా...."

"సాయిబులు తినేదాన్ని ఎవరైనా అమ్మే స్వేచ్ఛ నవాగర్‌లో వుందా? అలా అహ్వానిస్తారా...."

సుఖచంద్ యీ మాటలకి నవ్వాడు.

"చెప్పేదంతా వినవ్వుగా. మీరంతా రాత్రి పాఠశాల కెందుకురారు? మీరు, మీతోపాటు మిగతావారిని తీసుకురావచ్చుగా.... చదవడం, రాయడం వస్తే మీరే రాజ్యాంగం చదువుకోవచ్చు".

"ఈ వయస్సులోనా...."

"జ్ఞానాన్వేషణకి వయస్సంటూ లేదు"

"అలా కాదు. దానికీ వుంది...."

"మీరలా అంటే నేనేం చెప్పేది? సరే, వినండి...."

సుఖచంద్ చెప్పే ప్రతి మాటా మోతీహార్, భక్తలు శ్రద్ధగా విన్నారు. ఠాకూరి నిశ్శబ్దంగా కూచుండిపోయాడు. ప్రాథమిక హక్కుల గురించి సుఖచంద్ వివరిస్తుంటే ఆయన వంక గౌరవపూర్వకంగా చూస్తూ శ్రద్ధగా ఆలకించాడు.

"ఇక ఆఖరిది...ఆస్తి హక్కు.. వినటానికి చాలా బావుందది"....అన్నాడు మోతీహార్.

"దానివల్లేగా మన రాజావారికి నష్టపరిహారంగా ఆరులక్షలు లభించింది' అన్నాడు సుఖచంద్.

ఆ....రు... ల....క్ష....లు

పెద్ద కోర్కెలంటూ లేని ఠాకూరికి ఆరు లక్షలు ఏం కదిలించలేదు గాని, మోతీహార్, భక్తలు మాత్రం వివశులై పోయారు. నిర్ఘాంతమైన చేతనం పొందే సుఖచంద్‌కి ఏమనిపించక తన ధోరణిలో ప్రాథమిక హక్కుల గురించి పూదరగొడుతున్నాడు.

"నా ప్రయత్నమంత ఆ విషయం చెబుదామనే. ఆ భూమికి చెందిన ప్రాథమిక హక్కు రాజావారికుంది. ప్రభుత్వం ఆ భూము లాక్రమించి, తద్వారా రాజావారి ప్రాథమిక హక్కులపై దాడి చేసింది".

"ఎలా...."

"సర్కారు రాజావారి అనుమతి పొందలా. అది ప్రభుత్వం జాగా అన్నప్పటికీ, ఎక్కడో ఏదో తేడా వుంది".

"ఆ తర్వాతేమైంది?"

"రాజావారు పెద్దవారు అయ్యాక కేసు పెట్టారు".

"ఎవరిపైన కేసు?"

"రైల్వేల మీద, అభివృద్ధిశాఖల పైన".

"కేసువేసి గెలిచారా?"

"అవును"

"మంచిదే. ఆస్తి హక్కు....బాగానే వుంది. కాని దాన్ని సాధించాలి కదా".

"కాదయ్యా భక్తా. చూడు....నీకు నీ ఆస్తి వున్నది—పశువులు, యిల్లు, వంట గిన్నెలు, యితర సామాగ్రి అలాగే మోతీహార్‌కి. నాకు నా బట్టలు, పుస్తకాలు, పక్కబట్టలు. బికారీకి మేకలు. వీటిని ఎవరు ఎత్తుకెళ్ళినా, నష్టపరిహారం చెల్లించాల్సిందే" అని సుఖచంద్ అన్నాడు.

"బావుంది....నువ్వుచెప్పేది వినేందుకు మాబావుంది".

"సరే. మీరు మళ్ళారండి".

పోతూ పోతూ మోతీహార్ అన్నాడు—

"పెళ్ళి చేసుకోవయ్యా పంతులూ. నవాగర్‌లో మీ కులపోళ్ళ పిల్లె ఒకతుంది. పిల్లతోపాటు భూములొస్తాయి....యింకా గేదెలు, నాగలి....నీకో సైకిలూ....".

అయిష్టంగా వద్దన్నాడు సుఖచంద్. పోయిరమ్మని వాళ్ళకి వీడ్కోలు పలికాడు.

బికారీ మాత్రం అక్కడే నిలబడిపోయాడు. కొత్త కొత్త మాటలు విషయాలు అర్థంకాక తికమక పడిపోయాడు.

"అయ్యా సుఖచంద్ గారూ"

"ఏం....బికారీ"

"నిజమేనాయ్యా....మీరు చెప్పిందంతా"

"ఆ"

"అవే....ఏవో ప్రాథమిక హక్కులన్నారు....అవి"....ఆ మాట పలుకరాక అవస్థపడి ఎట్లనో అన్నాడు.

"ఆ! ఆ! ప్రాథమిక హక్కులా...."

"అవ్వే అయితే....మన రైతులు వాటిగురించే అడుగుతున్నట్టుంది. వాళ్ళు అనేది మీరు చెప్పేదేగా...."

"ఊ...."

"అయ్యా రాజావారికి ఆస్తి హక్కులున్నాయి".

"అవును...."

"మరి నా మేకలు నావే....అవునా".

"ఆ....ఆ....అన్నట్టే"

"రాజావారికి వారికి పోయిందానికి ఎంతొచ్చిందో ఆ భగవంతుడి కెరుక...."

"ఊ...."

"కానయ్యా! పోలీసోళ్ళు నా మేకలని ఎత్తుకెళ్ళారు. అందుకే నేను అడవిలోకి పారిపోయా. నాకెన్నడు ఎర్రని ఏగానీ దక్కలా. మరైతే యీ ప్రాథమిక హక్కుల గురించి పోలీసోళ్ళకు చెప్పటం ప్రభుత్వం మర్చిపోయిందా?

"నీ విషయంలో జరిగింది దోపిడి భికారి".

"మరైతే రాజావారికే అంత డబ్బు ఎట్లా దక్కింది? అంటే రాజాలకి గొప్పోళ్ళకి నష్టపరిహారాలుంటాయా సారూ?" అడిగాడు భికారి.

సుభచంద్ ఏడ్వలేక నవ్వాడు.

"వాస్తవానికి నువ్వన్నట్లే జరుగుంటుంది. కాని ఏమైనా మన రాజ్యాంగం మాత్రం చాలా మంచిది".

"అందులో ఏం రాసుందో మీకేం తెలుసు?"

"భికారి....నీ హక్కులని కూడా ఎవరైన హరిస్తే, రాజావారికి లభించిన చట్టపరమైన రక్షణే నీకు లభిస్తుంది...."

"అంటే నన్ను కోర్టుకి పొమ్మంటారా? చట్టం గురించి నాకేంతెలుస్తుంది? పోలీసోడు మేకలని ఎత్తుకెళ్ళినా ఏ దుసాదోడు కోర్టు కెక్కవచ్చు".

"అలాకాదు....వాళ్ళు వెళ్ళొచ్చు".

"ఎలా...."

"నా వుద్దేశం, వాళ్ళకా హక్కుందని".

"మరి డబ్బో....దానికి తగ్గట్టు దమ్ముండాల. నాకి హక్కులేం అర్థం కావటం లేదయ్యా. హక్కులనేవి అన్నీ హుళక్కే...."

"సరే....కానియి. ఇంతకన్నా నేనేం చెప్పేది?"

"అదే మీరంతా దిగాలు పడకండి. మీరేంచేస్తారు. ఇప్పటిదాకా చెల్లుబాటయినదే యిక ముందూ వుంటాయి. అవునా...."

"అద్పో....అలాకాదు. వీద్దైతే రాసివుందో అదే సరైంది. రాసివుంది అమలు లోకి రావడంలేదు అది మన ఖర్మంతే".

"ఏమోనయ్యా.... మోతీహార్ ....భక్తాలు....ఒక్కొక్కరికి ఎంతెంత పెద్ద గొడ్ల మందలున్నాయో తెలిసిందేగా....మరి వాళ్ళ చెప్పిందే సరైందనిపిస్తోంది. మనుషులందరూ 'సమానులు' కానేకారు".

బికారి చేయితాకితే ఆ మెతుకులు కూడా ముట్టని సుఖచంద్ తనకు మాత్రం అలాంటి అభిప్రాయాల్లేవని అనుకొంటుంటాడు. ఆయన చదివిన పుస్తకాల్లో ఎక్కడా అంటరాని తనం గురించిన ప్రసక్తే రాలా. పైగా రాసిన మాటలమీద ప్రగాఢమైన నమ్మకం....

అందుకే పుస్తకాల ద్వారా వంటబట్టిన విశ్వాసంతో బికారి మాటని ఖండించాడు. "పూర్వోళ్ళ అనుకోవాల్సింపే యిట్లా. అదే మన నెహ్రూగారు, ఇందిరమ్మలు అసలలా ఆలోచించనే చించరు".

"అదేమైన కానీండి....కులం అయితే వుంది. పెద్దోళ్ళ....చిన్నోళ్ళ. రాములోరు బాపనోళ్ళని చేసిండు, దుసాదు లోళ్ళని చేసిండు. అద్గదీ....అందుకే యిలాంటి ఆచారాలన్నీ వున్నాయి. ఇంక అంతకన్నా పెద్ద విషయాలు నాకు తెల్వావు. తెహోడ్‌లోని పూజారి మిశ్రగారు దుసాదోని నీడపడేచోట అడుగైనా పెట్టరు. ఆయన మళ్ళ రోజూ శివునితో ముచ్చటిస్తాడంట. మరాయనకు తెలుసు....భగవంతుడికేటి కావాలో, వద్దో...."

సుఖచంద్ తన ప్రయత్నం విరమించుకొన్నాడు. మామూలుగా "ఎలా వున్నావు బికారి యిన్నాళ్ళు" అన్నాడు.

"బాగానే వున్నా....నా పని యింత మంచిగుంటుందని ఎన్నడనుకోలే. నా కాడ పది మేకలున్నాయి".

"పది మేకలే....బాగుంది నీ పని"

"బలిసిన రెండు పోతులున్నాయి. ఒక్కొక్కటి పదిహేను కిలోలు తూగుతుంది. ఇప్పుడు మాంసం కిలో ఎనిమిది రూపాయలు పలుకుతోంది. కిలోకి అరన్నా ఒక్కో మేకకి ఎంత స్తదంటావ్ ?

"రెంటికి కలిపి సుమారు రెండు వందల దాకా పుట్టచ్చు."

"రెండు వందలే"

"ఆ"

బికారి కళ్ళలో నీళ్ళు నిండాయి.

"దయ చూడు అయ్యా.... మీరన్నట్లు రెండు వందలు దొరికితే, నా కష్టాలన్నీ కడతేరిపోతయి"

"అవునా.... ఎలానోయ్"

"ఎలా ఏందయ్యా.... అన్ని పైసలు వస్తాక, పెళ్ళి చేసుకోవచ్చు.... నాకూ ఓ కుటుంబం వుంటుంది. మా దుసాముల్లో పిల్లలు బలంగుంటారు. కష్టపడి పనిచేస్తారు. మేమిద్దరం కల్సి మేకలు మేపుకుంటూ కాలం వెళ్ళదీస్తాం. పైగా ఓ గుడిసె వేసుకొని, బోళ్లు, గట్రా కొనుక్కోవచ్చు...."

"అసలు మీ వూరేది బికారి"

"బిద్రపార అవతల"

"నీ కయినోళ్లు ఎవరైనా వున్నారా"

"లేరు"

"నీకు అంతా మంచే జరగాలని కోరుకుంటున్నా" అన్నాడు సుఖచంద్. బికారి తనకు బాగా సన్నిహితుడైనట్లు తోచింది. అందుకే ఆ మాటలు గుండె లోతుల్లోంచి వచ్చాయి.

"అన్నట్లు యీ రాత్రి బాకాసంబా కాలుస్తారటగా" అంటూ బికారి సంతోషంగా యింటి ముఖం పట్టాడు. ఒక విధంగా తను పోలీసులకి రుణపడ్డానను కొన్నాడు. వాళ్ళే గనక వాగర్‌లో క్యాంపు పెట్టకుంటే, తను బాదాకి పారిపోయి వుండేవాడే కాదు. రంగాని కలుసుండేవాడే కాదు. తన మేకలమంద యింతయ్యేదీ కాదు. మధ్య దారిలో కొట్టు ముందాగి జొన్నపిండి, పప్పు, మిరియాలు, కూరగాయలు కొనుక్కొన్నాడు. పనిలో పనిగా సెట్టిని ఎలా వున్నారని పలకరించాడు.

కంట్రాక్టరు రామధారి మాటల్లో పడి బిఖారిని పెట్టి పట్టించుకోలా. 'శ్రీనివాసం' మహల్ ముందే బాణాసంచా కాలుస్తారని వాళ్లు మాట్లాడుకోంగా బిఖారి విన్నాడు. అయిదువేలవుతాయట బాణాసంచాకి. బిఖారి, బట్టలుతుక్కొను చిన్న సబ్బు బిళ్ళ కొనుకోన్నాడు. ఇంటికి పోయి వేడి వేడి రొట్టెలు చేసుకొని వేడి వేడి కూరలో పెట్టుకొని తిని ఆ రాత్రి సంబరం చూడాలనుకొన్నాడు.

రెండు వందల రూపాయలు. లంగ్రా గాడికి యింకో పిల్ల దొరకంగా లేనిది, తనకేనా దొరకంది ? తనకూ పెళ్ళాం దొరుకుతుంది.

అసలు ముందు ముందు మేకలే వుండి వుంటాయి. ఆ తర్వాతే యింత భూమి వచ్చింటుంది. పెళ్ళి పెటాకులు తర్వాత, చుట్టాలు పక్కాలు పెరిగుంటారు. వాళ్ళు సహాయపడుంగాలి. లేకుంటే ఎంతకని ఒక్కడూ చావగలడు ?

బాదా... తెహాద్....నాదా....అక్కడి పేదోళ్ళందరూ ఒక బక్కమనిషికి ఎంత అండగా వుండి బలమిచ్చారు?

ఆలోచనలతో బస్సుల దగ్గర గుడిసెకి చేరాడు. బట్టలుతుక్కొని వండుకొని తినేసరికి సాయంకాలమైంది. మేక మందని లెఖ్ఖపెట్టి లోపలికి తోలి తడిక పెడుతున్నాడు. అప్పుడొచ్చారు....

రాజావారి నలుగురి సిపాయులు

యిద్దరు పోలీసోళ్లు

బిఖారికి వెన్నులో చలి పాకి వణికి పోయాడు. తడిక నానుకొని నిలబడ్డాడు. సవాగర్‌లో పోలీసులు లేరనే గదా తను మళ్ళా యిక్కడకొచ్చింది.

"ఏందిరా బిఖారీ.... దేనికిరా భయపడుతున్నావ్" అనడిగాడు నవ్వుతూ సిపాయి గజానన్. కంటే సారాకంపు వాడి నోట్లోంచి.

"అరే రెండు పోతులని పట్రారా. రాజావారు పోలీసోళ్ళందరిని విందుకు పిలిచాడు. మాంసం కొద్దిగా తక్కువ పడింది."

"బాబ్బాబు ... నా దగ్గర పోతులేం లేవయ్యా."

"అయితే వేరే మేకలని పట్రారా పోయ్"

"బాబ్బాబు మీ కాళ్ళకి దండం పెడతా. సిపాయిబాబు. వాటిని వొదిలేయండి. అవ్వే నా బతుకు. వాటిని యీ సారి వొదిలేయండి బాబ్బాబు...." బతిమిలాడాడు.

"మతిగాని పోయిందిరే" అంటూ గజానన్ బిఖారిని యీడ్చికొట్టాడు. బిఖారి

నోటమ్మటి, ముక్కమ్మటి బొల బొలా రక్తం కారింది. అయినా బికారి మొత్తు కొంటూనే వున్నాడు.

"అయ్యా యీ బాధ పడలేకే బాదా పారిపోయినా. యీ పోలీసోళ్ళ వల్లే నాయనా....అయ్యా సిపాయిగారూ.... వాటిని వొదిలేయండి బాబు....అవి కనబడ్డప్పు డల్లా పోలీసోళ్లు ఎత్తుకెళ్ళి పోతూనే వున్నారయ్యా ఎప్పుడూ...."

"అయితేందిరా? రాజావారు రమ్మంటే ఎవ్వార్రా వాళ్ళు యీసారి. వాళ్ళని మాంసం కొనుక్కోమంటావురా.... రాజావారి భూములమీద బతికే నా కొడుకా.... పోరా.... పో"

బికారికి పిచ్చెక్కి పోయింది.

"రాజుగోరికి ఆరి భూములమీద ఆరికి హక్కున్నట్లే, నా మేకలమీద నాకే హక్కుంది. ఆరికి నష్టపరిషారం దక్కంగా లేంది నాకెందుకు దక్కద్దు" అంటూ బికారి అరుస్తున్నాడు.

"ఏందిరా నువ్వనేది?" అంటూ సిపాయిలు, పోలీసులు బికారిమీద ఎగబడి బాదేరు. వాళ్ళు బికారిని చెయ్యి తిరిగిన వస్తాదుల్లా, అధికారికంగా ఆమోదించ బడిన చట్టబద్ధమైన పద్ధతుల్లో వుతికేశారు. వాళ్ళ దెబ్బలకి తట్టుకోలేక బికారి నేల బడి పోయినా, వాళ్ళే మాత్రం అలవలా. అందుకే కొడుతూనే వాళ్ళు మాట్లాడు కొంటున్నారు....

"విన్నావా, గజానన్? వీడు ఆ రైతుల నుంచి విని నేర్చుకొనుంటాడు. హక్కులట.... హక్కులు.... నా కొడుకు. పోలీసులు మాంసం తినరేం? మరెవర్రా తినేది? అరే, గజానన్.... ఎవర్రా వీడు .. యీడో రాజాగాడా....?...."

అక్కడితో వాళ్ల బికారిని వదిలేసి, లోపలున్న నాలుగు మేకలని తోలుకు పోయారు. పిల్ల మేకలని వదిలేసి పోయారాసారికి.

బికారి ఏడ్చాడు. మొత్తుకొన్నాడు.... నేలమీదబడి పొర్లి పొర్లి.... జంతువులా ఏడ్చాడు. వళ్ళంతా కదుములు కట్టి కదల్లేక పోతున్నాడు. నమ్మకద్రోహం జరిగిందని వాపోతున్నాడు. అన్నీ అబద్ధాలే.... సుఖచంద్ అన్నీ అబద్ధాలే చెప్పాడు.

తన మేకలమీద తనకి హక్కుందా?

అదసలు ప్రాథమిక హక్కేనా?

ఆస్తి హక్కు అసలుందా ?

ఏదో ప్రాథమిక హక్కు....రాజ్యాంగ రక్షణ....అబద్ధాలు....అన్నీ అబద్ధాలు రాజాగారికి నష్టపరిహారం లభిస్తుంది.

మరి భికారిగాడికి ?

రాజాగారికి అయిలక్షలు సమర్పిస్తారు. భికారికి భారత ప్రభుత్వం నుంచి కనీస రక్షణ లభించదు.

అందుకే భికారికి నష్టపరిహారం దొరకదు. మంచులాంటి చల్లని స్పర్శ.... భికారి, కళ్ళు నులుముకు చూశాడు. కని, లంగ్రా వాని భార్య వాళ్ళ భికారిని ఎత్తుకొని వచ్చి పడుకోపెట్టారు. లంగ్రా భార్య తడిగుడ్డతో భికారి వళ్ళు తుడిచింది. కని మొహం తుడిచింది.

"యీ నీళ్ళు తాగు" అన్నాడు లంగ్రా.

"సరే....కొద్దిగా సున్నం పెట్టండి. దాంతో యీ నెత్తురు ఆగి నొప్పులు తగ్గుతాయి అన్నాడు భికారి.

ముగ్గురు బిచ్చగాళ్ళు భికారిని జాగ్రత్తగా చూసుకొన్నారు. భికారి పేరు లోనే బిచ్చపోడనీ మాయింది. వాళ్ళ ఆప్యాయత అనురాగాల నడుమ భికారి పది రోజులకి కోలుకున్నాడు.

"లంగ్రా.... ఎంతొస్తే అంతొచ్చేరా.... వున్న మేకలన్నీ అమ్మేద్దాం" అన్నాడు భికారి.

నాలుగు పిల్ల మేకలని యిరవై రూపాయలకి అమ్మేశాడు. భికారి నడుం వొంగిపోయింది.... మొహంమీద గాట్లు పడ్డాయి.

తన ప్రాథమిక హక్కులపై జరిగిన దాడికి తన మొదటి, చివరి నిరసన చిహ్నాలుగా అవి మిగిలిపోయాయి.

దెబ్బలన్నీ తగ్గగానే గుండు కొట్టించుకోవాలనుకున్నాడు భికారి.

"భికారీ....యిప్పుడేం చేస్తావ్ ?"

"అడుక్కుతింటా"

"అడుక్కుంటావా ?

"ఆ...."

"ఇక్కడే....!"

"కాదు..." బికారి తల అడ్డంగా వూపాడు. వాళ్ళ ముగ్గురికి తలో మూడు రూపాయలిచ్చాడు. సెట్టికి పాత బాకాయి కింద అర రూపాయ లిచ్చాడు. మేకలను కట్టేందుకు తాడు యిచ్చినందుకు మోతీషేర్ నౌకరికి రెండు రూపాయలిచ్చాడు.

మిగిలిన మూడు రూపాయలు రొంటిన దోపాడు. చెట్టుకొమ్మ విరిచి, చేతి కర్ర చేసుకొన్నాడు. తోవ్రాలో అడుక్కుతినే బొచ్చె కొనుక్కొని అడుక్కోవా లనుకున్నాడు.

బికారి తనవైపే రావడం చూసి సుఖచంద్ వరండా దిగి వచ్చాడు. జరిగిందంతా లోగడే విన్నాడు.

"బికారీ" పిలిచాడు సుఖచంద్.

"పోతున్నానయ్యా"

"ఎక్కడికి ?"

"అడుక్కుతినే దగ్గరికి"

"అడుక్కుం ..."

"ఆ ..."

"నువ్వు దానికింకా పనికిరావుగా"

"అట్లేం లేదు. నువ్వే నాకబద్దం చెప్పావు. నాలాంటోడికి ఎలాంటి ప్రాథమిక హక్కుల్లేవు. అవన్నీ రాజాసాబ్ లాంటోళ్ళకే...."

బికారి నెమ్మదిగా .. నెమ్మదిగా....చేతికర్ర మీదకి వొంగి.... నడుచుకొంటూ ....నిర్భయంగా వెళ్ళిపోయాడు ...వానికిప్పుడు పోలీసుల భయంలేదు. ఎంతోకొంత ఆస్తి అంటూ వున్నోళ్ళకి పోలీసులంటే భయం. పోలీసులు తన నుంచేమీ గుంజుకోలేరు ...గుంజుకోను మిగిలిందంటూ యింకేమీ లేదు....

ఈ పరిస్థితి యింతకుముందే ఎందుకు దొరకలా ? రాజా సాబ్.... సెట్టి ... హనుమాన్‌మిశ్రా ...పోలీసోళ్ళు ... వీళ్ళందరి దయానురాగాల ఆశీర్వాదాలతో తన లాంటి దుసాకోడు యీ నేలమీద బతుకాలంటే మిగిలినొకే మార్గం—అడుక్కుతినటం. ఎవడైనా దుసాకోడు తన స్థాయికి మించి ఎదగాలని చూస్తే వాళ్ళందరి ఆగ్రహానికి గురవుతాడు.

బికారికి తను వొంటరివాననిపించటంలా.... తనలాంటివాళ్ళ అనేకులు.... కని....లంగ్రా ...దోరా....ఎక్కడపడితే అక్కడే .... వేనవేలు. తానిప్పుడో పెద్ద కుటుంబంలో సభ్యుడు.

సుఖచంద్ నిర్విణ్ణుడై చూస్తుండిపోయాడు. ఆ చూపులని తోసేసుకొంటూ దూరంగా వెళ్ళిపోతున్నాడు బికారి. ఏదో ప్రాథమిక హక్కు అయిన – ఆస్తి హక్కు పోగొట్టుకొన్న బికారి, యిప్పుడు కనీసం మూడో ప్రాథమిక హక్కు.... స్వేచ్ఛ....దక్కుతుందనే హామీ పొందాడు.

ఏ వృత్తి చేపేందుకైనా పొందే స్వేచ్ఛ బికారి విషయంలో అది అడుక్కు తినటం. ఇప్పుడు తప్పనిసరిగా రాజ్యాంగం అతని జీవిక ఎంచుకొనే హక్కుకి రక్షణ కల్పిస్తుంది. కానీ యీ మధ్యలో ఎవరైనా బికారి 'స్థితి' బాగుచెయ్యాలని జోక్యం చేసుకున్నారో....

ఇటువంటి అనవసర జోక్యాలని రాజ్యాంగం సహించదు. భారతదేశంలో యిటువంటి జోక్యాలు ఎప్పుడు ఎక్కడ ఏ తీరున జరిగినా, వెన్వెంటనే శాంతిభద్రతల విభాగాలన్నీ, అలానే సైన్యం, యుద్ధటాంకులు....యుద్ధ విమానాలు రంగంలో ప్రవేశించి బికారిలాంటి వాళ్ళ హక్కులని కాపాడతాయి.

కాళ్ళీడ్చుకొంటూ పోతున్న బికారి రోడ్డు వంపు తిరిగే చోట కనుమరుగై పోయాడు.

ఇక యిప్పుడు
వానికి పొయ్యేదేంలేదు

(అనువాదం : శ్రీకాకుళరావు)

సవరణ

సెప్టెంబర్ సంచికలో త్రిపురనేని మధుసూదనరావుగారి సాహిత్య విమర్శ వ్యాస రచన కాలం 1-1-1990. ఆ వ్యాసంలో దొర్లిన తప్పులను ఈ విధంగా దిద్దుకొని చదవగలరు.

పేజి	తప్పు	ఒప్పు
15	సంచిత	సముచిత
18	పీడిత	పీడక
19	తమూక	మూక
20	వాత్స నిర్మాణ	వాక్య నిర్మాణ
24	విలాస వ్యతిరేకమైన	వికాస వ్యతిరేకమైన
25	మార్చటానికి	కూర్చటానికి
27	ఆదేశ ఉద్వేగాలు	ఆవేశ ఉద్వేగాలు
30	విశిత కవులూ	విశి కవులూ

ప్రణాళికా విధానం - రాజ్యాంగయంత్ర స్వభావం
కొన్ని ఆలోచనలు

ఆర్. ఎస్. రావు

భారత ఆర్థిక వ్యవస్థలో **1967** ఒక ముఖ్యమైన సంవత్సరం. దేశ ప్రణాళికాబద్ధ అభివృద్ధికి మధ్యంతర సంవత్సరం కావడం మాత్రమే దాని ప్రాముఖ్యత కాదు. ఆర్థిక వ్యవస్థను 'అభివృద్ధి' చేసేందుకు మూడు పంచవర్ష ప్రణాళికలు ప్రయత్నించిన తర్వాత ఆ సంవత్సరమే ప్రణాళికకు సెలవు ప్రకటించారు. అప్పటికి కొనసాగుతున్న ఆర్థిక వ్యవస్థా నిర్వహణను సవాలు చేసిన రైతాంగ ఉద్యమం ప్రారంభమైన సంవత్సరం కూడ అదే. నక్సల్బరీలో మొదలయిన ఈ ఉద్యమాన్ని నక్సలైట్ ఉద్యమమని పిలుస్తున్నారు. ఆ రైతాంగ ఉద్యమం, దానికి నాయకత్వం వహించిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) భారత సమాజ స్వభావాన్ని అర్ధ-భూస్వామ్య, అర్ధ-వలస స్వభావంగా నిర్వచించాయి. రాజ్యాంగ యంత్రాన్ని భూస్వామ్య, దళారీ, బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ రాజ్యాంగ యంత్రంగా నిర్వచించాయి. ఇటువంటి నిర్వచనానికి అర్థం ఏమంటే, ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధితో సహా, అభివృద్ధి అంతా దేశంలోకి బైటినుంచి వస్తున్న పెట్టుబడి ప్రవేశానికి ప్రతిస్పందనగానే మారిపోతుంది. అంటే బాహిర ఒత్తిడికి తగిన సవరణలు చేసుకునే ప్రక్రియకే ఈ క్రమం ప్రాతినిధ్యం వహిస్తుంది. అంతర్గత ప్రక్రియలకు ఫలితంగా, లోపలి ఒత్తిళ్ళకు ప్రతిఫలనంగా ఉండే అభివృద్ధికీ, అంతర్గత క్రమానికీ ఈ బాహిర క్రమం వ్యతిరేకంగా ఉంటుంది.

వెనుకబడిన తనపు రాజకీయార్థిక శాస్త్రం గురించిన తన కొత్త పుస్తకంలో మెక్సికో నుంచి భారతదేశం దాకా ఎన్నో దేశాలు అనుభవాలను క్రోడీకరిస్తూ అమియ కుమార్ బాగ్చి ఇటువంటి నిర్ధారణకే (సరిగ్గా ఇదే నిర్ధారణకు కాదు) వచ్చారని గుర్తించడం ఆసక్తికరంగా ఉంటుంది. 'ఇతరులపై ఆధారపడే పెట్టుబడిని అభివృద్ధి చేసేందుకు మూడో ప్రపంచ దేశాల్లో ప్రణాళికా విధానాన్ని వినియోగిస్తున్నారు. స్వావలంబనను సాధించడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పుకునే దేశాలు

సహాయం కోసం అర్రులు చాచడంలో ఈ క్రమాన్ని గుర్తించవచ్చు. 'సహాయం' అనేది సర్వ సాధారణంగా స్వతంత్ర ప్రతిపత్తి సాధించే ప్రయత్నాల్ని అడ్డగిస్తుంది. నిజానికి ప్రణాళికా ప్రయత్నాలన్నీ కూడ ప్రపంచ బ్యాంకు నుంచి, తక్కువ వడ్డీ రేట్లు అమలు చేసే ఐ డి ఎ సంస్థ, అమెరికన్ ప్రభుత్వం నుంచీ, ఇతర ఒకసిడీ దేశాల నుంచీ ఇతోధిక సహాయం పొందేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నాయి. పెట్టుబడిదారీ విధానాన్ని బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన ప్రణాళికా విధానంవల్ల పతన ధోరణులే బలపడతాయి" అన్నారు బాగ్చి.

పైన ఇచ్చిన నిర్వచనాల వెనుక ఉన్న తర్కాన్ని అర్థం చేసుకునే క్రమం లోనే ఈ కింది ఆలోచనలు వెలువడ్డాయి.

సమాజాన్ని అర్థ-భూస్వామ్య, అర్థ-వలస సమాజంగా నిర్వచించడమంటే, ఆ సమాజానికి ఒక జాతీయ పెట్టుబడిదారీ వర్గం నాయకత్వం వహించడం లేదని అర్థం. జాతీయ పెట్టుబడిదారీ వర్గం అనేది ఆర్థిక వ్యవస్థను తన అధీనంలో ఉంచు కుని, ఆ ఆధిపత్యం సామ్రాజ్యవాద పెట్టుబడి చేతుల్లోకి పోకుండా కాపలాకాస్తూ, సామ్రాజ్యవాద పెట్టుబడితో పోటీపడుతూ, దానితో వైరుధ్యం తెచ్చుకుంటుంది. అటువంటి వర్గం లేనప్పుడు, సమాజ నాయకత్వం భూస్వామ్య ప్రభువుల చేతిలో ఉంటుంది. వాళ్ళు సామ్రాజ్యవాద పెట్టుబడి తొత్తులతో పొత్తు పెట్టుకుంటారు. ఆ సామ్రాజ్యవాద పెట్టుబడి తొత్తులను దళారీ, బ్యూరాక్రటిక్ పెట్టుబడి దారు లంటారు. కనుక ఈ నిర్వచనం ప్రకారం గ్రామీణ ప్రాంతాలలో ఆధిపత్యం ఎక్కువగా భూస్వాముల చేతుల్లోనూ, పట్టణ ప్రాంతాలలో ఆధిపత్యం ఎక్కువగా దళారీ-బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారుల చేతుల్లోనూ ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల గురించి రాస్తూ వాళ్ళు ఒక డాక్యుమెంటులో "కొద్దిమంది భూస్వాముల చేతుల్లో అంతకంతకు ఎక్కువగా భూమి పోగు పడుతుండడం, రైతులు కష్టపడి పండించిన పంటలో మిగులు మొత్తాన్ని కౌలు రూపంలో దోపిడీ చేయడం, గ్రామీణ జనాభాలో దాదాపు 40 శాతం మంది భూమి లేని నిరుపేదలుగా ఉండడం, నడ్డి విరిగే వడ్డీ రేట్లతో దోపిడీ, రైతులను అంతకంతకు ఎక్కువగా భూమినుంచి వెళ్ళగొడుతుండ డం, పీటికి తోడు మధ్య యుగాలను, తలపింప చేసేలా దళితుల సజీవదహనాల వంటి సాంఘిక అణచివేత కొనసాగుతుండడం, సాంకేతిక విధానాలు పూర్తిగా వెనుకబడి ఉండడం సమాజపు అర్థ-భూస్వామ్య స్వభావాన్ని స్పష్టంగా చూపు

తున్నాయి." అని రాశారు. ఒక చివరన భూస్వాములవద్దన భూమి కేంద్రీకృతం కావడాన్ని, మరో చివరన పేద రైతులు భూములనుంచి వెళ్ళగొట్టబడటాన్ని ఈ నిర్వచనం ఎత్తి చూపుతుంది. గ్రామాల్లో అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న వ్యవసాయ కూలీల్లో ఈ పేదరైతులు చేరిపోతూ ఉంటారు. అదనపు శ్రమను దోచుకోవడంలో వేతన శ్రమతో పాటు కౌలు విధానం, వడ్డీ వ్యాపారంవంటివి ఉపయోగ పడు తుంటాయి. ఆర్థిక అధికారం ఇటువంటి వక్ర నిర్మాణంతో ఉన్నందువల్ల, వ్యవస్థను అదుపులో ఉంచేందుకు గ్రామీణ సమాజంలో తరతరాలుగా కొనసాగుతున్న కుల కోణాన్ని కూడ వాడుకునే సాంఘిక అణచివేత పునాదిగా ఉంటుంది.

పారిశ్రామిక రంగపు నిర్వచనం ఏం చెప్పిందంటే, దేశపు బడా పారిశ్రామిక వేత్తల అభివృద్ధికి అత్యవసరమైన సాంకేతిక విధానం కోసమూ, పెట్టుబడి కోసమూ ఆధారపడుతూ దళారీ- బ్యూరోక్రటిక్ పెట్టుబడిదారులుగా ఉంటారు. సామ్రాజ్యవాద వ్యవస్థకు, అమెరికన్ సామ్రాజ్యవాదానికి, సోవియట్ సామ్రాజ్యవాదానికి ప్రయోజనాలు కాపాడుతుంటారు. ఈ రెండు సామ్రాజ్యవాద దేశాలే దేశానికి సహాయం అందించే ప్రధాన వనరులు. చిన్న తరహా, మధ్యతరహా పెట్టుబడిదారులను గురించి వివరిస్తూ ఈ నిర్వచనం ఏమంటుందంటే, పెట్టుబడి కోసం, సాంకేతిక విధానాల కోసం, ముడిసరుకులకూ ఉత్పత్తికీ మార్కెట్లకోసం ఈ చిన్నతరహా, మధ్య తరహా పెట్టుబడిదారులు బడా పెట్టుబడిదారుల మీద, బహుళజాతి కంపెనీల మీద ఆధారపడవలసి వస్తుంది గనుక, ఈ క్రమంలో వాళ్ళు బలహీనమైన భాగస్వాములవుతారు. అందువల్ల తమను తాము రక్షించుకునేందుకు ఘర్షణకు సిద్ధపడరు. "చిన్న, మధ్యతరహా పెట్టుబడిదారులు మొదట పెట్టుబడి కోసం ఈ దళారీల నుంచి సహాయం పొందుతారు. తర్వాత, తమ పరిశ్రమల కోసం ముడి సరుకులను కూడ దళారీ పెట్టుబడిదారుల నుంచే కొనవలసి వస్తుంది. మూడు, తమ పరిశ్రమల అభివృద్ధికోసం వాళ్ల దళారీ పెట్టుబడిదారుల మీదనే ఆధారపడవలసి వస్తుంది. నాలుగు, వాళ్ల ఉత్పత్తి చేసిన దానిలో అత్యధిక భాగాన్ని దళారీ పెట్టుబడిదారులే కొంటారు. ఐదు, కార్మిక వర్గంతో వ్యతిరేకత వచ్చినప్పుడు వాళ్ళు దళారీ పెట్టుబడిదారులతోనే ఐక్యమవుతారు. ఆరు, చిన్న, మధ్య తరహా పెట్టుబడిదారులు తమ లాభాలలో నుంచి నిజద్రవ్యరూపంగా ఉంచుకున్న దానిలోనుంచే దళారీ పెట్టుబడిదారులు బడా పరిశ్రమలలో వాటాలు కొనుక్కుంటారు. ఈ ఆరు కారణాల వల్ల జాతీయ బూర్జువా వర్గం

అనేది అతి బలహీనమైన వర్గంగా ఉంది. అందువల్లనే వాళ్ల పెద్దైన ఒక నిర్ణయాన్ని స్వతంత్రంగా తీసుకోవడం గాని, అమలు చేయడం గాని అసాధ్యం' అని ఆ విశ్లేషణ ప్రకటించింది.

జాతీయ పెట్టుబడిదారీ వర్గపు ఈ బలహీనత అది మౌలికమైన ఉత్పత్తి నిర్మాణాలయిన పెట్టుబడి కోసమూ, సాంకేతిక విధానం కోసమూ మరొకరి మీద ఆధారపడడం వల్ల వచ్చింది. కనుక ఒక వర్గంగా ఈ వర్గం బాహిర క్రమాల ఫలితమే తప్ప అంతర్గత వ్యవస్థకు ప్రాతినిధ్యం వహించదు.

పారిశ్రామిక రంగాన్నీ, వ్యవసాయ రంగాన్నీ క్రోడీకరిస్తూ పై నిర్వచనం భారత సమాజంలో నాలుగు ప్రధాన వైరుధ్యాలను సూచించింది. ఆ వైరుధ్యాలు : 1) సామ్రాజ్యవాదానికీ సోషల్ సామ్రాజ్య వాదానికీ ప్రజలకూ మధ్య, 2) భూస్వామ్యానికీ అశేష ప్రజానీకానికీ మధ్య. 3) పెట్టుబడికీ శ్రమకూ మధ్య, 4) పాలక వర్గాలలో వివిధ ముఠాల మధ్య. పై నిర్వచనం ప్రకారం, ఈ అన్ని వైరుధ్యాల లోనూ భూస్వామ్యానికీ విశాల ప్రజారాసులకు మధ్యన ఉన్న వైరుధ్యమే ప్రధాన వైరుధ్యం. అంటే ఈ వైరుధ్య పరిష్కారం మిగిలిన ముఖ్యమైన వైరుధ్యాలను పరిష్కరిస్తుందన్నమాట. ఈ విశ్లేషణ అంతటిలోకీ కేంద్ర బిందువైన అంశమేమంటే, అధికారంలో భూస్వామ్య వర్గంతో శక్తిలోగాని, ఉనికిలో గాని పోటీ పడగలిగిన జాతీయ పెట్టుబడిదారీ వర్గం లేదనేదే.

సమాజ స్వభావం గురించీ, రాజ్యాంగ యంత్ర స్వభావం గురించీ పైన ఇచ్చిన క్లుప్తమైన వివరణ వెలుగులో, ఇటువంటి నిర్వచనానికి ఏయే అర్థాలుంటాయో చూడడం ఆసక్తికరంగా ఉంటుంది. ఆర్థిక, రాజకీయ రంగాలలో పరిణామాలను ఇక్కడ పరిశీలిద్దాం.

పెట్టుబడికోసం, సాంకేతిక పరిజ్ఞానం కోసం సామ్రాజ్యవాద శక్తుల మీద ఆధారపడటం, వచ్చే సహాయ నిధి విధించే పరిమితులు కలగలిసి పారిశ్రామిక రంగంలోకి శ్రమశక్తిని ఎంత పరిమాణంలో, ఎటువంటి నైపుణ్యంతో చేర్చుకోవాలనే విషయంలో పరిమితులు విధిస్తాయి. అదే సమయంలో భూకేంద్రీకరణ, వ్యవసాయ కూలీల పెరుగుదల కలిసి ఉపాధి కోరుకుంటున్న శ్రామికుల సంఖ్య పెరుగుతూ పోతుంది. రక్షిత నీటి పారుదల సౌకర్యాలున్న ప్రాంతాల్లో మినహా మిగిలిన చోట్ల, వ్యవసాయంలోకి శ్రామికుల్ని చేర్చుకునే అవకాశం చాల పరిమితం. ఇందువల్ల

నిరుద్యోగ స్థితి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక లౌకిక అంశం అయిపోతుంది.

వ్యవసాయ రంగం దాదాపు స్తబ్దంగా ఉన్న నేపథ్యంలో ఈ నిరుద్యోగం వల్ల వేతనాలు తగ్గుతాయి. భూమి మీద భూస్వామ్య పెత్తనం ఉండడం వల్ల. ఆ పెత్తనం వ్యవసాయ మిగులు ఉత్పత్తిని వ్యవసాయ రంగంలోనే మళ్ళీ మదుపు పెట్టడానికి అంగీకరించనందువల్ల ఈ దాదాపు స్తబ్దత స్థితినెలకొని ఉంది. మిగులును అనుత్పాదక అవసరాల కోసమైనా ఖర్చుపెడుతున్నారు. లేదా వ్యాపారంలోకో, వడ్డీ వ్యాపారంలోకో మళ్ళిస్తున్నారు. ఇటువంటి మళ్ళీ మదుపు లేనందువల్ల మొత్తం ఫలితంగా వ్యవసాయ రంగంలో శ్రామికులను ఆకర్షించే శక్తి దాదాపు స్థిరంగా నిలిచిపోతుంది. అందువల్ల నిజ వేతనాలు తగ్గడమో, యథాతథంగా ఉండిపోవడమో జరిగింది.

నిజవేతనాలు యథాతథంగా ఉండడం, నిరుద్యోగం కలిసినందువల్ల ఫలితంగా ఆదాయ స్థాయి పడిపోయింది. మనుషులు జీవశాస్త్రపరంగా మనుగడ సాగించడానికి ఎంత తక్కువ ఆదాయం అవసరమో అంతకన్న కిందికి ఆదాయం పడిపోయింది. దీన్నే దారిద్ర్య రేఖకు దిగువన ఉండడం అని పిలుస్తున్నారు. ఈ ప్రజా సమూహాల అవసరాలు చాల ఎక్కువ. అవి వాళ్ళ మనుగడకు సంబంధించిన అవసరాలు. ఉత్పత్తి విధానంలో పూర్తిగా పాల్గొనడానికి సంబంధించిన అవసరాలు. కాని ఈ అవసరాలను డిమాండ్‌తో, మార్కెట్‌తో అనుసంధానించడానికి గాని, మార్చడానికి గాని వీలు లేదు. ఎందుకంటే ఈ ప్రజలు ఉత్పత్తి విధానంలో అంచుల్లో మాత్రమే పాల్గొంటున్నారు. లేదా వాళ్ళ ఉత్పత్తి భాగస్వామ్యానికి ప్రతిఫలం స్వల్పంగా ఉంటోంది. మరో మాటల్లో చెప్పాలంటే వీళ్ళు సరుకులు అక్రమించ గలిగిన మార్కెట్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు.

దారిద్ర్యానికీ, దారిద్ర్యం బారిన పడిన అశేషప్రజానీకానికీ సంబంధించిన మరొక ముఖం ఏమంటే ఇంకా వినియోగంలోకి రాని, రాదగిన జాతీయ మార్కెట్ అది. ఈ శక్తిని ఇంకా గుర్తించకపోవడం వల్ల, భారతీయ మార్కెట్ తీవ్ర స్థాయిలో పెరుగుతుంది గాని విస్తృత స్థాయిలో పెరగదు. తీవ్ర స్థాయి అంటే ఏమిటంటే, ఉన్న వినియోగదారులకే ఇంకా ఇంకా కొత్త ఉత్పత్తులు అమ్మబడతాయి గాని కొత్త వినియోగదారులను తయారుచేయడం జరగదు. ఆ మేరకు,

సంకుచిత జాతీయ మార్కెట్ పారిశ్రామిక విస్తరణ పైన పరిమితి విధిస్తుంది. తలసరి లెక్కల్లో చూస్తే, ఏ సరుకుకైనా విశాలమైన మార్కెట్ ఉన్నట్టు కనబడుతుంది గాని, వాస్తవ మార్కెట్ చాల సంకుచితంగా తయారైపోతుంది. దాదాపు సగం జనాభా ఈ మార్కెట్‌కు బైటనే జీవిస్తుంటుంది.

జాతీయ మార్కెట్‌కు ఉన్న సంకుచిత పరిమితి వ్యక్తీకరణ పొందే రూపమేమంటే స్వల్పకాలికంగా చూస్తే ఆహారధాన్యాల మిగులు నిలువలు పెరుగుతూ ఉండగా, దీర్ఘకాలికంగా చూస్తే శక్తి సామర్థ్యాలను తక్కువగా వినియోగించుకోవడం జరుగుతుంది. దిగుమతి చేసుకున్న సాంకేతిక పరిజ్ఞానం అనుసరిస్తున్న పద్ధతుల ప్రకారం ఈ శక్తి సామర్థ్యాల అల్ప వినియోగం ఒకవైపున పెట్టుబడి—ఉత్పత్తి నిష్పత్తి పెరిగిపోవడానికీ, మరోవైపున వ్యవస్థాత్మకంగా అల్పసంఖ్యాక బృందపు ఆధిపత్యానికీ దారితీస్తుంది.

అల్పసంఖ్యాక బృందపు ఆధిపత్యం ఉన్నప్పుడు, మరొక సంస్థ ప్రవేశించాలంటే ఉత్పత్తి వ్యయంలోనూ, సామర్థ్యంలోనూ అధిక్యత ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. మళ్ళీ ఇది సాధ్యం కావాలంటే, ఆ సంస్థ తన స్వంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తయారుచేసుకోవడమో, ప్రపంచ సాంకేతిక పరిజ్ఞాన నాయకులతో సంబంధంలో ఉండడమో జరగాలి. స్వంతంగా పరిశోధన, అభివృద్ధి విభాగాన్ని నడపడం సుదీర్ఘ కాలక్రమం గనుక, తగినంత శ్రమతో కూడుకున్నది గనుక, ఏదో ఒక బహుళజాతి సంస్థతో సంబంధం పెట్టుకోవడమే సులభంగా సాధించగల ఆధిక్యత అవుతుంది. దీనితో వృత్తం పూర్తవుతుంది.

సాంకేతిక పరిజ్ఞానాన్నీ, పెట్టుబడినీ అరువు తెచ్చుకొని అభివృద్ధి సాధించదలచినప్పుడు స్వతంత్ర యాజమాన్య నైపుణ్యం ఏమీ అవసరం లేదు. అది భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, వ్యాపారస్తులు లాంటి మిగులు సంపాదనా పరులను తన ఏజెంట్లుగా, మిలాఖత్ దారులుగా ఉపయోగించుకోవచ్చు. ఇందువల్ల రెండు లక్ష్యాలు నెరవేరుతాయి. ఒకటి, స్థానిక ఏజెంటు స్వతంత్ర యజమాని అయి, స్వంత సాంకేతిక పరిజ్ఞానం సంపాదించుకుంటే రూపొందగల భవిష్యత్ పోటీదారును ఈ క్రమం తొలగిస్తుంది. రెండో లక్ష్యం, రాజ్యాంగ యంత్రం మీద తనకు ఉన్న పట్టు ద్వారా భూస్వామి సాఫీ నిర్వహణకు, సాఫీగా మిగులు సేకరించడానికి ఉపయోగపడతాడు. అందువల్ల కొంత మిగులును ఏజెంట్లతో పంచుకోవలసి వస్తే రావచ్చు.

ఈ రకంగా, సామ్రాజ్యవాద పెట్టుబడికీ, స్థానిక భూస్వామ్య ఏజెంట్లకూ మధ్య మిలాఖత్తు రాజ్యాంగ యంత్రంలో భూస్వామ్యాన్ని సుస్థిరం చేస్తుంది.

నైపుణ్యం గల మానవ శక్తిని సరఫరా చేయడం, స్థానిక వనరులను సమకూర్చి పెట్టడం, రాజ్యాంగ యంత్రాన్ని నియంత్రించడం ద్వారా రక్షణను, సుస్థిరతను సాధించడం ప్రధానంగా భూస్వామ్య బాధ్యతలు.

రాజ్యాంగ యంత్రం మీద భూస్వామ్య అధికారం ఉండడం వల్ల, సామాజిక అవసరాల్ని తీర్చే వ్యవస్థలు, అవి ఎంతగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన ఫలితాలయినప్పటికీ, భూస్వామిక వ్యవస్థలుగా మారిపోతాయి. ఇది అభివృద్ధికి వ్యతిరేకం. ఇటువంటి భూస్వామికీకరణ వల్ల శాస్త్ర పరిశోధనా సంస్థకూ, ఉత్పత్తి కార్యకలాపాలకూ సంబంధం ఏమీ ఉండదని ఊహించవచ్చు. (ఆ మేరకు ఉత్పత్తి కార్యకలాపాలలో వ్యయ-లాభ నిష్పత్తి ప్రతికూలంగానే ఉండి పోతుంది). ఆ మేరకు స్వతంత్రంగా ఒక శాస్త్ర-సాంకేతిక పునాదిని రూపొందించే అవకాశం మీద కూడ పరిమితులు ఏర్పడతాయి.

ఇక్కడి నుంచి మన వృత్తం మళ్ళీ పూర్తవుతుంది. అంటే, 'అభివృద్ధి' కావాలనుకుంటే, పరాధీనత కొనసాగక తప్పదు, భూస్వాములు రాజ్యాధికారంలో ఉండక తప్పదు.

పైన రెండు వలయాలను కాస్త సులభంగా వివరించాను. కాని వీటికి, గత దశాబ్దంలో భారత సమాజపు ఆర్థిక, రాజకీయ కోణాలమీద జరిగిన విస్తృత పరిశోధనలు అందజేసిన సమాచారపు ఆధారం ఉంది.

ఏది ఏమైనా, ఈ వాదన నుంచి రూపొందే ప్రధాన ఇతివృత్తం 'జాతీయ పెట్టుబడిదారీ వర్గం' అనేది లేకపోవడం లేదా రాజ్యాధికార వ్యవస్థలో లేకపోవడం. అందువల్ల ఈ ప్రభుత్వపు సామ్రాజ్యవాద వ్యతిరేకత శుష్కనినాదమైపోతుంది. భూస్వామ్య వ్యతిరేకత అసలు ఉండనే ఉండదు. అంటే, మార్పుకు చోదకశక్తి ఈ వ్యవస్థ బైటే ఉంటుందన్నమాట. అభివృద్ధికి పరిమితులను విదేశీ మారకద్రవ్య నిలువలు విధిస్తున్నాయనే పరిచిత ప్రకటనలు ఈ అవకాశానికే ప్రతీక.

ఈ బాహ్య స్వభావం అభివృద్ధి మీద పరిమితులు విధించడం మాత్రమే కాదు, మదుపు ఎంత ఉండాలి, ఏ రూపంలో ఉండాలి అనే అంశాలమీద కూడ పరిమితులు విధిస్తుంది.

ప్రణాళికా విధానం అనేది మదుపు పరిమాణాన్నీ, దిశనూ నిర్ణయించే క్రమం అయితే, అది ఒక రాజకీయ క్రమం అయినప్పుడు, కొన్ని ప్రాంతాలు, కొన్ని సెక్షన్లు మార్పు వల్ల లాభాలు పొందడం జరుగుతుంది. మార్పు వల్ల లాభాలు పొందని వర్గాలు గ్రామీణ ప్రాంతాల్లోని అశేష ప్రజానీకం, పేద రైతాంగానికీ, వ్యవసాయ కూలీ కుటుంబాలకూ చెందినవాళ్ళు. వాళ్ళ ప్రణాళికా విధానం ఫలితంగా పుట్టుకొచ్చారా, బ్రిటిష్ పాలనాకాలం నుంచి మిగిలిపోయారా, వాళ్ళ సంఖ్య పెరిగిపోతోందా, తగ్గుతోందా అనే చర్చ విస్తృతంగా జరుగుతోంది గాని వాస్తవమేమంటే, వాళ్ళ అత్యధిక సంఖ్యాకులు కాకపోయినా, గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. ఒరిస్సా లాంటి రాష్ట్రంలో దాదాపుగా అంచనా వేస్తే వాళ్ళ 60 శాతం. అందులో సగం వ్యవసాయ కూలీ కుటుంబాలకు చెందినవాళ్ళు. మరొక సగం పేదరైతు కుటుంబాలకు చెందినవాళ్ళు. ఈ అంకెలకు సంబంధించిన ఆసక్తికరమైన విషయమేమంటే, కొనసాగుతున్న చారిత్రక-స్థల నేపథ్యంలో ఈ అంకెలకూ, అభివృద్ధికీ ఏమీ సంబంధం లేదు. ఉదాహరణకు సంబల్‌పూర్ జిల్లాలోని రెండు గ్రామాల్లో ఈ అంకెలు 45 శాతం నుంచి 55 శాతంగా ఉన్నాయి. ఈ గ్రామాల్లో ఒక గ్రామం, ఒక నదీలోయ ప్రాజెక్టు నిర్మాణం వల్ల నిర్వాసితులయిన వారి పునరావాస గ్రామం. మరొక గ్రామం గత ఇరవై సంవత్సరాలుగా నదీలోయ ప్రాజెక్టు వల్ల లాభాలు పొందుతున్న గ్రామం. ఈ రెండు గ్రామాలు తులామానానికి రెండు చివరల్లో ఉంటాయి. అంటే ఒకటి 'అభివృద్ధి' వైపు, మరొకటి 'అభివృద్ధి రాహిత్యం' వైపు-ఉన్నప్పటికీ ఇటువంటి జనాభాను ఉత్పత్తి చేస్తున్నాయి. నిర్దిష్ట చారిత్రక పూర్వరంగాన్ని బట్టి ఈ అంకెలు రూపొందే తీరు మారవచ్చు.

ఈ సంఖ్యను అలా ఉంచి, ఈ కుటుంబాలకు సంబంధించిన ఆసక్తికరమైన అంశం ఏమంటే, ఈ కుటుంబాల రుణభారం, ఆ రుణభారం పెరుగుతూ ఉండడం. 1975 జాతీయ సాంపిల్ సర్వే అంచనాల ప్రకారం, సగటున, ఒక్కొక్క కూలీ కుటుంబం 210 రూపాయల అప్పు పడుతోందని తేలింది. హర్యానాలో మినహా మిగిలిన చోట్ల రుణభారం కాలక్రమేణా పెరుగుతోందనీ తేలింది. ఈ పెరుగుదల పంజాబ్‌లో ఆ సంవత్సరం 233 రూపాయలుగా అత్యధికంగా ఉండింది. పశ్చిమ బెంగాల్‌లో 30 రూపాయలుగా అతి స్వల్పంగా ఉండింది. ఇంకా, వాళ్ళ నైపుణ్యాలను, విద్యను బట్టి ఈ సెక్షన్ ప్రజలు ఆధునిక పరిశ్రమల్లో ఉద్యోగం పొందలేని

వాళ్ళు మాత్రమే కాదు, వాళ్ళు స్వయంగా కూడ గ్రామాన్ని వదలలేమని అంటూ ఉంటారు. ఇందుకు సూచనగా, ఈ ప్రజానీకంలో 7 శాతం మంది మాత్రమే వలస వెళ్ళడానికి ఇష్టపడ్డారు. ఈ గ్రామాల సర్వే ప్రకారం, ఈ ప్రజల్లో భూదాహం ఉంది.

ప్రణాళికా విధానం ప్రారంభమైనప్పుడు, భూసంస్కరణల గురించి ప్రస్తావించినప్పుడు సమాజంలోని ఈ సెక్షన్‌ల ప్రజల రాజకీయ ఆకాంక్షలను ప్రతిఫలించింది. కాని రాజకీయాధికారాన్ని నియంత్రిస్తూ వచ్చిన వర్గాలు, రాజకీయ క్రమాలు భూసంస్కరణల అమలుకోసం ప్రయత్నించలేదు. మూడు ప్రణాళికల వరకు పాడిందే పాటగా భూ సంస్కరణలను ప్రస్తావిస్తూ వచ్చి, ఆ తర్వాత దాన్ని ఒక ముఖ్యమైన విధానంగా ప్రస్తావించడం మానేశారు. ఆర్థికంగా గిట్టుబాటు కాదనే కారణం మీదనే భూ సంస్కరణలను అమలుచేయలేదని ఇప్పుడు వాదించడం భూసంస్కరణల రాజకీయ కోణాల్ని విస్మరించే సమర్థన మాత్రమే. ఒక నూతన భారతదేశంలో అభివృద్ధి క్రమంలో అత్యధిక సంఖ్యాక ప్రజానీకాన్ని భాగస్వాములను చేసి ఉండవలసిన ప్రణాళికా విధానం సమాజంలో ఆ ప్రజానీకాన్ని అంచుల్లోకి తోసివేసి, వాళ్ళకు ఒక మేకనో, పందినో, పనికి ఆహారం పథకాన్నో వరప్రసాదంగా గ్రహించేవాళ్ళగా మార్చివేసింది. వాళ్ళు ఉత్పత్తి కార్యక్రమానికి చేసి ఉండగలిగిన దోహదం గురించి ఆలోచించినప్పుడు సమాజం ఎంత పెద్ద ఎత్తున నష్టపోయిందో తెలిసివస్తుంది. వాళ్ళు 'అభివృద్ధి'కి ఆటంకంగా మారిపోయారని కూడ కనబడుతుంది.

నక్సలైట్లు ఇంకా విజయం సాధించి ఉండకపోవచ్చు. కాని భారత ఆర్థిక వ్యవస్థలో పేదరైతులకు, వ్యవసాయ కూలీలకూ ప్రధాన స్థానం ఉంటుందని వాళ్ళు లేవనెత్తిన అంశాలు, పేదరికం గురించీ, మార్కెట్ సమస్య గురించీ లేవనెత్తిన అంశాలు ఒక వైపు, విదేశీ సాంకేతిక పరిజ్ఞానం మీద, సహాయం మీద ఆధారపడడం గురించిన ప్రశ్నలు మరొకవైపు ఒక చట్రాన్ని ప్రతిపాదించే ఇతివృత్తాలవుతాయి. ఆ చట్రం పకడ్బందీ చట్రం కాకపోయినప్పటికీ, భారత వాస్తవికతను అర్థం చేసుకునే చట్రం అదే.

[1984లో ఢిల్లీ, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ఏడో పంచవర్ష ప్రణాళికా నమూనాలపై ఏర్పాటు చేసిన సదస్సులో సమర్పించిన పత్రం.]

సీరియల్ నవల :

రాగో

సాధన

(గత సంచిక తరువాయి)

9

రుషి టైం చూసుకున్నడు. అప్పుడే రెండు దాటింది. ఇంకా డోలు, దోబి, లెబుడుతో మాట్లాడాల్సి ఉంది. ఉదయం నుండి ఇక్కడే ఉండి మీటింగ్ సైతం జరిగీ, జనాలు పోయాక అదే జాగలో ఉండడం సరియైంది గాదు. స్థలం మార్చాలి. పక్కూరుకు పోతే ఇక్కడ మాట, ముచ్చట పూర్తి గాకుండా పోతుంది. బాగా పొద్దుపోయి చేరితే ఆ ఊళ్ళో దళానికి రాత్రి భోజనం కూడ ఇబ్బంది కావచ్చు.

ముందుగా కొందర్ని పంపడమే మంచిదనే నిర్ణయానికొచ్చాడు రుషి. గాండోను కేకేసి పక్కకు తీసుకెళ్ళాడు. గిరిజ, కర్ప, ఫకీరాలను తీసుకొని మడి కొండ పోవాలని చెప్పాడు.

"కిట్లు తీసుకోండి కామ్రేడ్స్ పోదాం, గాండో దాదవాళ్ళ వేరే పని మీద పోతారు" అంటూ తన దళ సభ్యులందరిని పురమాయిస్తూనే వచ్చి డోలు భుజం మీద చేయి వేశాడు రుషి. తన జేబులో కుక్కుకున్న కరపత్రాలను తీసి చూడసాగాడు.

ఎదురుగా ఘామ్యల్ సన్నో వచ్చి నిలబడింది రుషి చూడనేలేదు.

"దాదా! అందులో ఏముంది? జెర చదివి చెప్పరాదా! నువు అవి జేబులో పెడితే అందర్లో అడగద్దనే మాళ్లి మర్లొచ్చినా" అంటూ కరపత్రాల్లోని అసలు విషయం తెలుసుకోవాలని ఆతృతగా అడిగాడు సన్నో.

"చూసిన దాదా! మనమంటే గిట్టని పోలీసోళ్లే వేసి ఉంటరు. ఇది చూడడం ఈ ఇరవై రోజుల్లోనూ యివాళ మూడోసారి. ఏం లేదు దాదా దీంట్లో. మనం లంగలం, దొంగలం అని ఉంది-ఊళ్ళో కొస్తే గెదమాలి. బువ్వ పెట్టవద్దు. ఇదే దాదా వాళ్ళ రాసింది" అంటూ క్లుప్తంగా ముగించి డోలును తీసుకుని పక్కకెళ్ళాడు.

"ఛూ! లంజకొడుకులు. దొంగే దొంగన్నట్టుంది" అంటూ తుపుక్కున ఉమ్మేశాడు సన్నో.

"డోలు దాదా! సన్నోను ఊరి దిక్కు పడగొట్టి మీరు ముగ్గురూ విడివిడిగా ఎవరికీ అనుమానం రాకుండా 'పేనుకస' (పీటితోగు) దిక్కు రాండ్రి. మేం ముందు పోతం.' అని చెప్పి, వచ్చి వెంటనే తన కిట్టు వేసుకున్నాడు. అప్పటికే కిట్లు వేసుకొని రడీగా వున్న గాండో వచ్చి రుషికి చేయి కలిపి 'లాల్‌సలాం' చెప్ప గానే మిగితా ఎనిమిదిమందీ వరుసగా లైన్లో నిలబడ్డారు. విడిపోతున్న నలుగురూ అందరికీ 'లాల్‌సలాం' చెప్పి బయల్దేరారు. రుషి సేచి కూడ వెంటనే కొత్త డెన్‌కు బయలుదేరారు.

వర్షాకాలం కనుక నడకకు ఇబ్బంది కావడంలేదు. మబ్బు తెరల చాటు వచ్చే పల్చటి ఎండ వెచ్చ వెచ్చగా ఉంది. పచ్చని అడవి నీడ చల్లగా నడిచే వారికి గొడుగు పట్టినట్టే ఉండి గాలి లేకున్నా హాయిగానే ఉంది. ఇగురు పెట్టని పొరక లేదు. పేనుకస వచ్చింది.

ఆ తోగులో నీళ్ళు ఎపుడూ పారుతూనే ఉంటయి. చినుకు పడేదాక ఆ తోగు బక్క (ఎండి) పోకుండా పారుతుంది. పూసుగు చెట్లు, కానుగు చెట్లు, బుడ్డదరిమి చెట్లు దగ్గర దగ్గరగా వుండి తీగదారి పొదలు ఒకదానికొకటి అల్లుకుని అక్కడ ఎపుడూ నీడ చిక్కగా ఉంటుంది. ఎండాకాలంలో అయితే బుడ్డదరిమి కాయలు తింటానికి జంతుపులు వస్తాయని షికారుకి వచ్చే వాళ్ళ బెడద ఉంటుంది. వర్షాకాలం అయితే ఆ తోగు ఊసు పట్టేవాళ్ళే ఉండరు. ఆ తోగు తలంపుకే ఉన్న పెద్ద మామిడి చెట్టుకు యెన్ని పెత్తెరీగా తేనె తుట్టెలుంటాయో లెక్కపెట్టలేము. వాటిని రెచ్చగొట్టె కొంటె పనులు చేస్తే నిలవనివ్వకుండా తరుముతాయి. అందుకే వాటి జోలికి పోకుండా యెవరి మానాన వారు అక్కడ ఆశ్రయం తీసుకుంటారు.

ముందు చేరిన డుంగ, జైనిలు పూసుగు చెట్టె కింద ఆగి కమాండర్ చేరే వరకు యెదురు చూస్తున్నారు.

"ఇక్కడే ఉందాం కామ్రేడ్స్. ఊరి దాదలు వస్తరు వారితో మాట్లాడినాంక మడికొండ పోదాం" అంటూ కిట్టు దించేసరికి డోలు దాదా రానే వచ్చాడు.

తొందరగా పని ముగించుకోవాలి. టైం చాలదు. అనుకుంటూ రుషి వెంటనే జైనిని సెంట్రీకి పంపి డోలును తీసుకొని వంద గజాల దూరంలో కూచున్నడు.

"డోలు దాదా. వాళ్ళెద్దరు ఏరి ?" -రుషి

"వస్తరు దాద. వాళ్ళకు జెర తిరుగుడైతది"— డోలు.

"మంచిదే దాద. వాళ్ళు వచ్చేవరకు మనం గ్రామరక్షక దళం సంగతి మాట్లాడుకుందాం. ఆ రిపోర్టు చెప్పు దాద" అంటూ మొదలుపెట్టాడు రుషి.

"ఇంగో"—అని డోలు గ్రామరక్షక దళం ఊసెత్తుకున్నాడు. "ఈ వాన కాలం మా పని ఎటమటమే అయితుంది దాద. అయినా వీలున్నపుడల్లా అడవిలో కలుస్తున్నాం. మాట్లాడుకుంటున్నాం డ్రిల్లు ఎక్సర్‌సైజులు చేస్తున్నాం దాదా. నేను కొనుక్కొచ్చిన మందు తడిసిపోయి ఎంత ఆరబెట్టి కొట్టినా బర్మార్లు పేలుడే లేదు దాద. మా దళం ఏడుగురం ఒకటు తీరోల్లమే ఉన్నం దాదా. ఊళ్లె పోరగాండ్లకు ఎగురుడు, దుసుకుడు, ఫైరింగ్ నేర్పుతనే ఉన్నం దాదా! మేం పోయే పను లన్నిటికీ ఎంటేసుకపోతున్నం దాదా" అంటూ డోలు చెప్పాడు.

"నువు పోంగ నేను తుపాకి మందిస్తా. ఇది మంచిది. తడవలేదు. మరువకుండా తీసుకో. మరి మీకు రెండే బర్మార్లు గదా. మిగతా అయిదుగురు ఏం పట్టుకుంటరు. బరిశలు అనుకున్నాం కదా! ఆ పనేమయ్యింది" రుషి.

"మాట్లాడిన దాదా. కానీ ఇంకా ఆలస్యమయితుంది దాదా!"

ఇంతలో లెబుడు, డోలు వచ్చి చేరారు.

సెల్ సమావేశం ప్రారంభించనున్నట్లు "ఇవాళ మనం చర్చించాల్సినవి ఏమిటి డోలు" అంటూ రుషి మొదలుపెట్టాడు.

"ఆకుల రిపోర్టు, రివాజుల గురించి పెద్దలు పట్టీ మొత్తం మీద పెట్టు కుంటున్న మీటింగ్, పూళ్ళొ సంగం పని. ఇవే ముఖ్యంగా మాట్లాడుకోవాలి. ఇంకేమున్నాయి లెబుడు" అంటూ ఎజండా వివరించాడు డోలు.

"మీ సెల్లు పని పద్ధతులు, విమర్శ ఆత్మవిమర్శ కూడా వుండాలి కదా" అని గుర్తుచేశాడు రుషి.

"ఔ, ఔ" అన్నారు లెబుడు, డోలి ఒకేసారి.

"ఆకుల రిపోర్టుతో మొదలెడదాం" అని రుషి అనగానే డోలు ప్రారంభిం చాడు.

ప్రభుత్వం లొంగివచ్చి ప్రజల డిమాండ్ మేరకు షేకడా ఇరవై రూపాయలు ఇవ్వడంతో ఊర్లో అందరూ తునికి ఆకులు కోశారంటూ, ఊరూరికి కళ్ళం కావా లనీ రెండేళ్ళగా ప్రజలు డిమాండ్ చేస్తున్నా, ప్రభుత్వం మొండిగా నిరాకరిస్తున్నం దుకు బుద్ధి చెప్పడంలో భాగంగా ఫారెస్టు వారి కలప, కళ్ళాలు ధ్వంసం చేసిన

వరకు డోలు ఉత్సాహంగా చెప్పాడు. పోలీసులతో దాగుడుమూతల వ్యవహారంగా సాగిన కళ్ళాల కాల్చివేత చెబుతుంటే, అందరి ముఖాల్లో తామెంతో గొప్ప పని చేశామన్న ఫీలింగ్ కనపడింది. అక్కడి నుండి డోలు వాళ్ళ ఊళ్ళోకి 'ఆదివాసీ ముక్తిమోర్చా' పేరుతో వచ్చిన నాయకుల ప్రస్తావన తెచ్చాడు. అల్లపెల్లిలో జూన్ ఒకటవ తేదీనాడు వి. పి. సింగ్, రామ్‌జెత్మలానీ, మృణాల్‌తాయి మొదలైన లీడర్లు మీటింగ్ పెట్టి, ఇక్కడి రైతాంగం నుండి ఆకు జమ చేసుకొని ప్రాణహిత దాటి ఆంధ్రలో ముప్పయి రూపాయలకు అమ్మిపెడుతామని ప్రచారం చేయడం, దాంతో ఆ రేటు మేమే ఇస్తామనీ ఆ వెంటనే ఫారెస్టువారు బొంకించే పద్ధతులు కూడ ఆగకుండా పూసగుచ్చినట్లు చెప్పసాగాడు. ఇవన్నీ ఆచరణలో కుదరని వేషాలే అంటూ సంఘం వారు ప్రచారం చేసి, ఇక్కడే ఈ ప్రభుత్వం మెడలు వంచి రేట్లు సాధిద్దాం అనే సంఘం పద్ధతి ప్రజలకు అర్థం చేయించి వారు తీసుకున్న కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున స్త్రీ-పురుషులను కదలించినవరకు రిపోర్టు చెప్పాడు డోలు.

'ఇంకేమైనా ఉన్నాయా దాదా!' అంటూ ఇతరులు కూడ చెప్పాలన్నట్టు డోబె, లెబుడు వైపు చూశాడు రుషి.

వెంటనే డోబె అందుకున్నాడు. "దాదా వచ్చే సోమారం ఈ పట్టీ (రాజుల కాలంలో వారి ప్రాంతాలను పట్టీలుగా వ్యవహరించేవారు. తహశీల్లు, బ్లాకులు లేవు అనాడు) పెద్దలు ఘామ్యదు, మాజేరు, సేనల్, షండదు (హోదాలు) మీటింగ్ చేస్తున్నట్టు మా అయ్య చెప్పిండు. పొమ్మంటావురా అని నన్నడిగితే వింటే తప్పేమి లేదు అని నేను అన్నా. మీరేమంటరు దాదా" అంటూ రుషి వంక చూచాడు.

"ఏ విషయాలపై ఆ పెద్దల మీటింగ్ ?" రుషి

పిల్లని స్తమని ఒప్పుకొని కల్లు తాగితే, ఆడదాన్ని వేరే ఎవరు పెళ్ళి చేసుకోవద్దు. పుట్టిన బిడ్డను మీ యింటికే ఇస్తామని ఒప్పందం చేసుకునే వేళల్లో తల్లి తండ్రులు వియ్యంకుల నుండి కల్లు పుచ్చుకుంటే ఆ బిడ్డను ఇక వేరే ఎవరికి ఇవ్వరాదు. వేరేవారు చేసుకోకూడదు. పిల్ల 'యిష్టాయిష్టాలతో సంబంధము లేదు. కోరుకున్నవాడికి పోవడానికి ఆడదానిక్కి హక్కులేదంటున్నారు ఈ పెద్దలు.

అలాగే ఒకని పెళ్ళాం మరొకడికి పోవద్దు. అలాపోతే పట్టీ రివాజు ప్రకారం ఆ చేసుకున్నవాడు పాతమొగుడికి మూడువేల రూపాయలు మొగనాలి చెల్లించి గానీ దాన్ని తెచ్చుకోకూడదు. అంటే యిద్దరికి అలికినా, అతక్కపోయినా అయ్య

అవస్థ కట్టిన వాడి దగ్గరే ఆడది పడుండాలనేది వీళ్ళ పంచాయితి మాడియాల్లో మూడు వేలు ఎవడూ యిచ్చుకోలేడనే వీళ్ళ ధీమా.

లామడే యీకోటి.

లామ్ పెట్టుకుంటే ఆరేండ్లు నిండాకనే పెండ్లి చెయ్యాలి. లామడే ఉంటే యిక ఆ పిల్లనూ మరెవరూ పెళ్ళి చేసుకోవద్దు.

ఇంట్లో పనులు ఎక్కువగా ఉండి మనిషి అవుసరమైతే "మా బిడ్డను నీకే ఇస్తామని ఇల్లరికం చందంగా మగాడిని ఇంట్లో పెట్టుకుంటారు. అలా ఆరేళ్ళ చాకిరి చేశాకనే పిల్లనిస్తారు. ఆరేళ్ళ వెట్టిచాకిరి చేయాల్సిందే. ఈ లోగా ఆ పిల్ల ఎవనికయినా ఇల్లు జూస్తే యీ లామడే మొగనాలి కోసం ఆ చేసుకున్నవాడి చుట్టు తిరగాల్సిందే. ఆ లామడే అయినా తల్లితండ్రులకు నచ్చడమే తప్ప పిల్ల యిష్టంతో పనిలేదు.

కులం కాని వాడికి ఆడది పోకూడదు. రివాజుల ప్రకారం రవిక చీర తీసెయ్యాలి. అన్ని రివాజులను అమలు చేయాలి" అంటూ కాబోయే పెద్దల మీటింగ్ చర్చనీయాంశాలు ఏకరువు పెట్టాడు.

"ఊఁ!" అంటూ దీర్ఘంగా మూల్గి రుషి మొదలుపెట్టాడు.

ఉడిగిపోతున్న తరం ఎదిగే తరాన్ని అణచిపెట్టడానికి పడే పాట్లే అవి అన్నీ. కూలిపోయే పెత్తనం నిలబెట్టుకోవడానికే యీ మీటింగులన్నీ. తొలి నుండి మన పార్టీ వీటిపై మీటింగులు పెడ్తూంది. మన సంగాలు సైతం పట్టీ మీటింగ్‌లు ఏర్పాటు చేశాయి. ఈ సనాతన ధర్మాలు మారాలని ప్రచారం చేసేయి. పెద్దల పెత్తనం, ప్రజలపై వారి పట్టు సన్నగిల్లి అడుగంటిపోతుందని వారి బాధ. మన రాజకీయాలతో, మన విధానాలతో మన పార్టీలోనికి వస్తున్న అక్కలను ఆదర్శంగా తీసుకుంటూ, ఇవాళ ఊరూరా మహిళా సంఘాల గాలి వీస్తుంది. దానితో పెద్దల దిమ్మ తిరిగినంత పనవుతుంది. అయితే వారు ఎన్ని సమావేశాలు, సదస్సులు జరిపినా ఏం లాభం లేదు. సరే. వీరి అవతరాలు ప్రజల్లో మరీ ఎండగట్టడానికీ మనం అక్కలతోనే క్యాంపెయిన్ చేయిస్తే మరీ బాగుంటుంది". అంటూ కమాండర్ ఒకనాటి ధీకొండను గుర్తు చేసుకున్నాడు.

అదో పంచరంగి (అనేక కులాలు) ఊరు. ఏ ఒకరి మాట సాగేది గాదు. మాడియా పెద్దలు సాంప్రదాయాలను మాత్రం గట్టిగా పట్టుకునేవారు. సంఘమంటే

కుదరదని జనాల చేతనే చెప్పించిన ఘనులు ఆ ఊరు పెద్దలు. ఆదివారం (పోల్సా) సాయంకాలం అయితే, రిస్కు ముఖాలతో ఆడ, మగ మాట వినిపించుకునేవారు కాదు. కుల పంచాయితీలతో, అనేక దండుగలతో విలవిల్లేది ఊరు. దసరా వచ్చిందంటేనే ఇంటింటికి ఖర్చం జమచేసుకొని కోళ్ళు, మేకలతో అహిరి పోవలసిందే. కాలికి గజ్జెకట్టి మహారాజు సమక్షంలో పడుచులందరు ఎగరాల్సిందే. అహిరి దసరకు డోల్లు, డప్పులతో పోవలసిందే. వెట్టి చాకిరికి కొదువుండదు. ఏ కొంచెం తప్పినా దండుగలు కట్టాల్సిందే.

ఊర్కో సైతం జంగ్లాత్ వారికి అడిగింది సమర్పించుకొని కాళ్ళు, గడుపులు పట్టుకొని వారి దయా దాక్షిణ్యాలపైన బ్రతికేవారు. దొడ్డికెళ్ళి ఆకు తెంపుకున్నా జంగలోడు (గార్డు) చూస్తే ఎంత గుర్రు గర్రంటదోనన్న భయంతోనే వెన్నులో జ్వరం పుట్టేది. కూలి నాలి ఇచ్చినంతే తీసుకోవాలి. చెప్పినంత చేయాలి. ఊర్కో ఉద్యోగస్థులకు, పై నుండి వచ్చే అధికారులకు నచ్చేవన్నీ ఊరివాళ్ళంతా ఇచ్చుకోవలసిందే - కల్లు దించినా భయమే. ఇప్ప పూలు ఇంట్లో ఉన్నా ఇబ్బందే.

పట్టాలేని తుపాకులు ఇంట్లో ఉంటే ఎప్పుడు పోలీసులు మీద పడి గుంజుకుంటరో, ఎంత దండుగేసి ఎన్నేళ్ళు జైలుపాలు చేస్తరో అన్న భయమే. చెప్పరాని పన్నులు వసూలు చేసేవారు. నాగటి పన్ను, మేక, గొడ్డు, దున్నపోతు, ఎడ్లకు, ఇంటికి, భూమికి, ఇలా జంగలోళ్ళు, రెవెన్యూవాళ్ళు కలసి తమ యిష్టం వచ్చినట్లు పన్నులతో ముంచేవారు.

అలాంటి ధీకొండ ఈరోజు ఎంత మారిపోయింది? నిజంగా ఈ ముగ్గురి కృషి ఎంతో ఉంది. ఊరంతా ఒక పట్టు కావడానికి, ఊర్కో సంఘం ఏర్పడడానికి, గ్రామరక్షణ దళం నిర్మాణానికి ఇలా ప్రతిదానిలో వీరు ముగ్గురే ప్రధాన పాత్రధారులు. ఊర్కో ఏ న్యాయం గావాలన్నా ఏ దండుగ చెల్లించాలన్నా, ఏ పనులకు పోవాలన్నా, ఏం చేయాలన్నా, ఏం చేయకూడదన్నా ఇవాళ సంఘమే అన్నీ నిర్ణయించాలి. ఊర్కో షావుకార్లు రూపాయికి పదిపైసల లాభం ఉంచుకొని సంఘం చెప్పిన రేట్లకే సరుకులు అమ్ముకోవలసి వస్తుంది. ఎగిరే దగ్గర, పెళ్ళిళ్ళ దగ్గర ప్రతి కట్టుబాటు రివాజు విషయంలోనూ ప్రజలు సంఘం మాట కోసమే చూస్తున్నారు. 'ఎంత మార్పు' అనుకుంటూ రుషి ఈ ఆడవాళ్ళ రివాజుల విషయంలో కూడ అక్కలతోనే క్యాంపెయిన్ చేయించి సంఘం పొరవ పెంచితే తప్పనిసరిగానే మార్పు త్వరగా వస్తుందని ఊహించుకుంటున్నాడు.

"ఈ నడుమ పోలీసులు తిరుగుడు ఎక్కువైంది దాదా!" అంటూ లెబుడు కొత్త విషయం మొదలెట్టాడు.

"ముగలాయి (ఆదిలాబాదు)లో మన అన్నలు పోలీసులను చంపి తుపాకులు లాక్కెళ్ళినప్పటి నుండి ఇది మరీ పెరిగింది. కొత్త కొత్త పద్ధతుల్లో తిరుగుతున్నారు. రెండేసి జీపుల్లో మంది లేనిదే రావడం లేదు. నలిగిన దారులు విడిచిపెట్టి, వచ్చిన జాడ తెల్వకుండా అడవిలో నడుస్తూ వస్తున్నారు. నలపై, యాభైకి తగ్గకుండా కట్ట కట్టుక తిరుగుతున్నారు. ఏ మాత్రం అలికిడి అయినా వెంటనే పొజిషన్స్ తీసుకుంటున్నారు. ఒక్కొక్కసారి దారుల వెంట, ఖేతుల్ల దగ్గర కూడ పూట పూటంతా మాటు కాస్తున్నారు. మన దళాన్ని దెబ్బ తీయడానికి వాళ్ళు ఎన్నెన్నో చేస్తున్నారు. ఊరి బందుకు వచ్చి గాలిలోకి తుపాకులు కాల్చి ఏమో అయ్యిందన్నట్లు గాథరా పుట్టిస్తున్నారు. రకరకాల తుపాకులు, పెద్ద పెద్ద షైర్‌లెస్‌లు మోసుకొస్తున్నారు. ఒక్కొక్కసారి కుక్కలను కూడ తీసుకొస్తున్నారు. ఎదురైనవారిని తీరొక్క ప్రశ్నలడిగి వేధిస్తున్నారు. కాల్చేస్తం—నక్సలైట్లంటను, ఆంధ్రలో చేసినట్లే చేస్తం. జాగ్రత్త అని బెదిరిస్తున్నారు. తెలుగు, మరాఠీ, హిందీ, మాడియా అన్ని మాట్లాడుతున్నరు. వాళ్ళలో మా గొట్టివాళ్ళు కూడ ఉన్నరు. అచ్చు మీలాగే డ్రెస్సు లేసుకోని, అడవిలో వండుక తింటూ ఎవరు కలసినా 'లాల్‌సలాం' అంటున్నారు. కొందరు గుర్తుపట్టక మోసపోతున్నారు. మాది కొత్తదళం ఇక్కడిఅన్నలకు సామాను లివ్వడానికి వచ్చామనీ అంటూ మీ దగ్గరేమైనా డంపు సామానుందా అంటూ ఆరాలు తీస్తున్నారు. క్యాంపు చుట్టు కందకాలు కూడ తవ్వించారు. కసూర్నార్ క్యాంపులో కూడ ఈ మధ్య మందిని బాగా పెంచారు. జీపు ఎప్పటికి అక్కడ ఉంటుంది. చుట్టు పహరా ఉంటున్నరు.

ఒక్క బొందలోనే పదిమంది పడుకోని కాల్చేంత పెద్దగా అది తవ్వారు. రోజు రోజుకు మన సంఘం బలపడే కొద్దీ వారి తిర్గుడు కూడ పెరుగుతుంది".

ఎంతాకాలం పోయినా ఇంకా తగ్గని నిర్బంధము గూర్చి తనకు తెలిసిందంతా చెప్పాడు లెబుడు.

"ఊరూరికి ఇదే రిపోర్టు వింటున్నాం దాదా! మరి మనం ఏం చేద్దాం అంటాను" అంటూ, రుషి దళం కూచున్న వైపు దృష్టి పోనిచ్చాడు.

ముగ్గురు నలుగురు పుస్తకాలు పట్టుకొని పాఠ్లీన్‌లో కూరుతున్నా డుంగ మాత్రం తుపాకీని తుడుచుకుంటూ అలర్ట్‌గానే ఉన్నాడు.

జైని సెంట్రీ పోస్టులో ఉంది. ఒక దొడ్డు మద్ది చెట్టు చాటుకు నిలబడి చుట్టు పరికించి చూస్తూ ఉంది. గంట దాటుతుంది. కుడిపక్కనున్న నారేప చెట్టు బోలు దగ్గర పుసురీగలు (కన్నె బుల్లలు) జుమ్మంటూ కంటపడ్డాయి. "అబ్బ తేనే" అంటూ లొట్టలు వేసుకుంటూ జైని నెమ్మదిగా నెమలి పిట్టలాగ లోగొంతులో కీఁవ్....కీఁవ్ అని కేకేసింది. పిలుపు విని డుంగ లేచి సెంట్రీ వైపు బయలుదేరాడు.

ఇంతలోనే ఎడమ పైపున ఫల్లున కొమ్మ విరిగినట్టు, వెనువెంటనే అడుగుల చప్పుడు విని జైని సడెన్‌గా అలర్టయ్యింది. ఒకే క్షణంలో రెండు పైపుల నుండి చూపులు తారసపడ్డాయి. అప్పటికే అలర్ట్ పొజిషన్‌లో ఉండి సేఫ్టీకేచ్ తొలగించి రడీగా ఉన్న జైని వెంటనే చెట్టును ఆసరా చేసుకొని ఒక రౌండు ఫైర్ చేసింది.

అంతే! ఎదురుగుండా వస్తున్న పోలీసులు వెంటనే దబదబ లైయింగ్ పొజిషన్‌లో పడిపోయారు. దడ దడ తూటాలు పేలాయి.

జైని కూత వినివచ్చిన డుంగ అకస్మాత్తుగా ఎదురైన పరిస్థితిని క్షణంలో ఆకళించుకొని దార్లోనే ఓ పూసుగు చెట్టు వెనుక నీలింగ్ పొజిషన్ తీసుకోని వెంటనే జైనితో పాటు ఫైరింగ్ చేయసాగాడు. వరసగా పది రౌండ్లు పేలాయి.

సమావేశంలో ఉన్న రుషి వెంటనే వెపన్ తీసుకొని, సభ్యులందరిని సెంట్రీ పోస్టు పైపు కదలమని కాషన్ యిస్తూ లెబుడు, డోలు, డోబిలకు చేతి బాంబులిచ్చి తొమ్మిది మందితో సెంట్రీ పైపు బెండ్ పొజిషన్‌లో కవరు టు కవరు పరుగుతీశాడు. ఐదు నిముషాల్లో సెంట్రీతో సెమీ సర్కిల్‌గా ఏర్పడి ఎదురుగా వచ్చిన కొల్పుల్ని గురిపెట్టి గుళ్ళవర్షం కురిపించారు. అనువైన కవర్లుండి సరైన పొజిషన్ కుదరడంతో నిబ్బరంగా ఫైర్ చేస్తున్నారు

పోలీసులు గందరగోళంలో పడ్డారు. ఎదురుగా ఎందరున్నరో తెల్వడం లేదు. కానీ, ఫైరింగ్‌ను బట్టి తమకన్నా ఎక్కువ మందే ఉంటారని అనుకున్నారు. కాషన్స్, అరుపులను బట్టి ఫైరింగ్ పార్టీ మెల్ల మెల్లగా అడ్వాన్స్ అవుతున్నట్లు కూడ అర్థమవుతూంది. ముగ్గురిని ఊర్లోనే వదలిపెట్టి ఇలా నలుగురే రావడంతో పీకల మీదికి వచ్చిందన్న గందరగోళం ఎక్కువయ్యింది. అంతే! ఉన్నట్లుండి వారికి అతి దగ్గరలో చెవులు చిల్లులు పడే శబ్దంతో చేతి గ్రెనేడు పేలింది. భూమి దద్దరిల్లింది. చావు మూడిందనుకున్న పోలీసులు కల్లుకు ఆశపడి ఊర్లోనే ఉండి పోయిన సాహెబు తల్లిని, అలిని తిట్టుకుంటూ కాలులేపారు 'బతుకు జీవుడా' అని వాళ్ళ కాలికి బుద్ధి చెప్పడంతో అటునుండి ఫైరింగ్ ఆగిపోయింది.

పరుగందుకున్న పోలీసులు దళం కంట్లో పడ్డారు. పది నిమిషాలు గడిచాయి. అంతటా నిశ్శబ్దం. ఎవరి ఊపిరి వారికే బరువుగా వినపడుతుంది.

"డుంగ, సూర మీరిద్దరు బెండింగ్‌లో జాగ్రత్తగా ముందుకు వెళ్ళి యింకా ఎవరైనా ఉన్నారేమో కిల్లింగ్ గ్రౌండ్‌ను వెరిఫై చేయండి. కవర్‌టు కవర్ జాగ్రత్తగా పొండి" అంటూ రుషి కాషన్ ఇవ్వడంతో మళ్ళీ చలనం ప్రారంభ మైంది.

రెండు నిమిషాల తర్వాత అంతా క్లియర్ అంటూ డుంగ కేకేసి చెప్పగానే రుషి లేచి నిలబడ్డాడు.

"కామ్రేడ్స్ అందరూ రండి". అంటూ గట్టిగా కేకేశాడు రుషి.

సెంట్రీ డ్యూటీలో మిగిలిపోయిన జైని మినహా అందరూ కమాండర్ చుట్టు చేరారు.

"కామ్రేడ్స్! అందరూ చాలా ధైర్యంగా నిలబడి ప్రతిఘటించినందుకు సంతోషం. సెంట్రీ కామ్రేడ్ అలర్టుగా ఉండి దళాన్ని కాపాడడంలో మంచి పాత్రవ చూపితన డ్యూటినెరవేర్చింది. ఇక్కడ మనపనులుకూడ ముగిసాయి. మనం వెంటనే ఇక్కడి నుండి కదలాలి" అంటూ దళాన్ని రడీ కమ్మని చెబుతూ రుషి దోలుపైపు చూశాడు.

వారి చిరునవ్వుల్లో విజయోత్సాహం తొణికిసలాడుతుంది.

"కామ్రేడ్స్! మీరు చాలా సాహసంగా నిలబడ్డారు. ధైర్యంగా పోట్లాడితే తప్పనిసరిగా గెలుపు మనదే. మనం తర్వాత కలుద్దాం. ఊళ్ళో జాగ్రత్త. జరిగిందంతా చెప్పి, అందర్ని ధైర్యంగా ఉండమని చెప్పండి" అంటూ వారికి చేతిలో చేయి కలిపాడు. ఇంతలోనే ఊరి దాదలు యిటు రావడం కనపడింది.

భూమ్యల్ సన్నో అందరికి ముందున్నాడు. మొస కొడుతున్న వారి ముఖాల్లో ఆందోళన స్పష్టంగా కానవస్తుంది.

"ఏమైంది దాదా! ఎట్లయింది. తుపాకి చప్పుళ్ళు విని మేము ఇటు ఊరికి వచ్చినం. పోలీసోల్లు నలుగురు అడ్డం పడి పరిగెడుతున్నారు. మనవాళ్ళకేమన్నా అయ్యిందా దాదా" అంటూ గుక్క తిప్పుకోకుండా అరిచాడు సన్నో.

"లేదు. దాద మనకేం కాలేదు. వాళ్ళకేమన్న దెబ్బలు అంటూ తాకాయో లేదో తెల్వాదు" అంటూ రుషి చెప్పాడు.

"లంజకొడుకులు. కల్లు ఆశకు ముగ్గురు ఊళ్ళనే ఉండి పోయినరు గాని మొత్తంమందీ వచ్చింద్రు. ఊళ్ళె ఎవలు కనబడకుంటే వెతుక్కుంటు బయలెల్లింద్రు. మంచిగ బుద్ధి చెప్పింద్రు దాదా" అని సన్నో అనేసరికి అందరు ఒక్కసారి గొల్లున నవ్వారు.

సంస్మరణ :

శంకర్ గుహా నియోగి

సరిగ్గా పది సంవత్సరాల కింద, సృజన 1981 డిసెంబర్ సంచికలో శంకర్ గుహ నియోగి వ్యాసం 'ఛత్తీస్‌ఘర్-జాతి సమస్య' అచ్చయింది. 1981 ఆగస్టులో రాడికల్ విద్యార్థి సంఘం మద్రాసులో 'భారతదేశంలో జాతుల సమస్య' అనే అంశం మీద నిర్వహించిన సదస్సులో ఆయన సమర్పించిన వ్యాసం అది. అప్పటికి ఆయన ఛత్తీస్‌ఘర్ మైన్స్ శ్రామిక్ సంఘ్ నాయకుడుగా సుప్రసిద్ధుడు. కాని అంజలి దేశ్‌పాండే రాసినట్టు 'శంకర్ గుహ నియోగి' కేవలం ఛత్తీస్ ఘర్ కార్మికుల ప్రియతమ నాయకుడు మాత్రమే కాదు. గత దశాబ్దంలో ఆయన ప్రత్యామ్నాయ రాజకీయాల అన్వేషణకు ప్రతీకగా మారిపోయాడు. ఆయన ట్రేడ్ యూనియన్ నాయకుడే గాని, ఇన్నాళ్ళూ మనకు అలవాటయిన ట్రేడ్ యూనియన్ నాయకుల లాంటి వాడు కాదు. ఆయన ఆసక్తులు ఆర్థిక డిమాండ్లను మించి, ప్రజాజీవనానికి సంబంధించిన అన్ని అంశాలనూ తమ పరిధిలోకి తీసుకుంటుండేవి. ప్రజా ఆరోగ్యం, విద్య, స్త్రీలకు హక్కులు కల్పించడం ద్వారా కుటుంబంలో స్త్రీ హోదాను పెంచడం మొదలైన అన్ని విషయాలూ ఆయన పట్టించుకున్నాడు.

ఆయనను భౌతికంగా నిర్మూలిస్తే ఆయన భావాలను, ఆయన నాయకత్వం వహించిన ఉద్యమాలను నిర్మూలించవచ్చునని భిలాయి పారిశ్రామికవేత్తలు అను

"సెంట్రీ ఎవలున్నరు దాదా" — అంటూ గుంపులో నుండి అడిగింది ఓ ముసలమ్మ.

"జైనక్క" — అంది సీదో

"దాదా మేము పోవాలి, మళ్ళీ కలుస్తాం. ధైర్యంగా ఉండండి. మళ్లీ ఊరి మీద పడ్తరేమో గట్టిగ నిలబడండి" అంటూ అందరి చేతుల్లో చేయి కలిపిన రుషిని దళసభ్యులందరు అనుసరించారు.

గ్రామస్తులు సెంట్రీ పోస్టులో ఉన్న జైని వద్దకెళ్ళి అభినందన పూర్వకంగా చేతులు కలిపి వచ్చిన దారి పట్టారు.

దళం మడికొండకు బయల్దేరింది

(ఇంకా ఉంది)

కున్నారు. వాళ్ళ కుట్ర ఫలితంగా సెప్టెంబర్ 28 ఉదయం మూడు గంటలకు శంకర్ గుహ నియోగి కాల్చి చంపబడ్డాడు.

పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయి గురిలో 1943 లో శంకర్ గుహ నియోగి జన్మించాడు. 1961 లో తల్లి మరణంతో మేనమామ దగ్గరికి భిలాయికి వచ్చినప్పటి నుంచీ ఆయన భిలాయి-దుర్గ్ పారిశ్రామిక ప్రాంతంలో ప్రజల తలలో నాలుక అయిపోయాడు. ఆయన మధ్యప్రదేశ్‌కు చెందినవాడు కాడని ఎవరూ గుర్తించ లేనంతగా ఆయన మధ్యప్రదేశ్ కార్మిక ఉద్యమంతో, చత్తీస్‌ఘర్ జాతీయాకాంక్ష లతో మమేకమయ్యాడు. భిలాయి ఉక్కు కర్మాగారంలో కార్మికుడుగా జీవితం ప్రారంభించిన నియోగి అక్కడే తన మొట్టమొదటి ట్రేడ్ యూనియన్ కార్యకలా పాలు మొదలుపెట్టాడు.

నియోగి నాయకత్వాన 16 మంది సభ్యులతో ప్రారంభమైన బ్లాస్ట్ ఫర్నేస్ ఆక్షన్ కమిటీ యాజమాన్యానికి వణుకు పుట్టించింది. తత్ఫలితంగా నియోగి ఉద్యో గం ఊడిపోయింది. ఆ తర్వాత బస్తర్ అడవుల్లో మేకల వ్యాపారం నుంచి చేపలు పట్టడం దాకా అనేక వృత్తులు సాగిస్తూ నియోగి బస్తర్ ఆదివాసుల దుర్భర జీవి తాన్ని ప్రత్యక్షంగా చూశాడు. స్థానిక గిరిజన భాషలు గోండి, హల్బి నేర్చుకున్నాడు. ఈ సమయంలోనే ఆయన తన హిందీ వారపత్రిక 'స్ఫులింగ్' ప్రారంభించాడు.

ఆ కాలంలోని అందరు క్రియాశీల యువజనులనూ ఆకర్షించినట్టుగానే నక్సల్బరీ వసంత మేఘగర్జన ఆయననూ ఆకర్షించింది. మార్క్సిస్టు-లెనినిస్టు ఉద్యమంలోని ఏ ఒక్క పార్టీతోనూ ఆయన తనను తాను అనుబంధించుకోక పోయినా, మొత్తం మీద తాను మార్క్సిస్టు-లెనినిస్టు ఉద్యమంలో భాగమేనని అను కునేవాడు.

బస్తర్ అడవుల నుంచి దుర్గ్‌కు తిరిగి వచ్చిన నియోగి దల్లీ-రాజ్‌హరా సమీపంలోని దాని తోలా మైన్స్‌లో కార్మికుడుగా చేరాడు. 1968 లో మొదటిసారి అరెస్టయి, అప్పటి నుంచి ఎమర్జెన్సీ వరకూ ఎన్నోసార్లు అరెస్టయిన నియోగి ఎమర్జెన్సీలో పదమూడు నెలలపాటు నిర్బంధంలో ఉన్నారు. ఎమర్జెన్సీ తర్వాతనే ట్రేడ్ యూనియనిజంలో నియోగి ప్రయోగాలు విజయవంతం కావడం మొదలైంది.

చత్తీస్‌ఘర్ మైన్స్ శ్రామిక్ సంఘ్ 1977 లో ప్రారంభమైంది. భిలాయి

ఉక్కు కర్మాగారం అధీనంలో ఉండే చత్తీస్‌ఘర్ ఇనుప ఖనిజం గనుల్లో అప్పటికి పని పరిస్థితులు దారుణంగా ఉండేవి. అప్పుడు అక్కడ గని కార్మికులకు రోజు కూలి మూడు రూపాయలు. ఉద్యోగ భద్రత లేదు. కార్మిక చట్టాల పట్ల లక్ష్యం లేకుండా యజమానులు కార్మికులకు ఏ సౌకర్యాన్నీ కల్పించలేదు. చట్టబద్ధమైన కనీస వేతనాల్ని అమలు చేయాలనీ, కంట్రాక్ట్ లేబర్ పద్ధతిని రద్దు చెయ్యాలనీ నియోగి నడిపిన ఉద్యమం చాల వరకు విజయం సాధించింది.

ఈ కార్మికుల ఆర్థిక డిమాండ్ల నుంచి నియోగి త్వరలోనే సాంఘిక, సాంస్కృతిక అంశాల వేపు, రాజకీయ కోణాల వేపు దృష్టి సారించవలసి వచ్చింది. చత్తీస్‌ఘర్ కార్మికులకు పెరిగిన వేతనాలను పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన సారా దుకాణాలు కబళించడం ప్రారంభించాయి. నియోగి కార్మికోద్యమం సారా వ్యతిరేక ఉద్యమంగా మారింది. ఈ క్రమంలో ఉద్యమంలో మహిళల భాగస్వామ్యం అపూర్వంగా పెరిగింది. చత్తీస్‌ఘర్‌లోని బడా సారా వ్యాపారి సుర్జిత్‌సింగ్ భాటియాకూ, కాంగ్రెస్ ఐ నాయకుడు, అప్పటి పరిశ్రమల మంత్రి ఝుముక్‌లాల్ భెడియాకూ ఉన్న సంబంధం కూడ ఈ ఉద్యమంతో బైట పడింది. నియోగిని చంపేస్తామనే బెదిరింపులతో పాటు, ఆయనను జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టు చేయడమూ జరిగింది.

క్రమక్రమంగా చత్తీస్‌ఘర్ మైన్స్ శ్రామిక్ సంఘ్ కార్యకలాపాలు బహుముఖంగా విస్తరించాయి. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం కల్పించడం, సభ్యుల విరాళాల నుంచి షహీద్ హాస్పిటల్ నిర్మించడం, మహిళా ముక్తి మోర్చాను ఏర్పరచడం, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యా కార్యక్రమాలు నిర్వహించడం, పాఠశాలలు నిర్వహించడం మొదలైన అనేక రంగాలలోకి నియోగి కార్మికోద్యమం ప్రవేశించింది.

బ్రిటిష్ పాలకులు 1857 డిసెంబర్ 19 న ఉరితీసిన ఆదివాసి నాయకుడు వీర్‌నారాయణ్‌సింగ్ సంస్మరణలో చత్తీస్‌ఘర్ ముక్తి మోర్చాను ఏర్పాటుచేసిన నియోగి ప్రతి సంవత్సరం డిసెంబర్ 19ని అమరవీరుల సంస్మరణదినంగా పాటిస్తుండేవాడు. చత్తీస్‌ఘర్ ముక్తి మోర్చా కార్మిక, కర్షక, ఆదివాసి, దళిత, యువజన, మహిళా సంస్థలన్నిటి ఉమ్మడి ప్రజాతంత్ర వేదికగా పనిచేస్తోంది.

దల్లీ రాజ్‌హరాలో కార్మికోద్యమం నిలదొక్కుకున్న తర్వాత నియోగి రాజ

నందగ్రాన్‌లోను, భిలాయ్‌లోను కార్మికోద్యమాన్ని నిర్మించే ప్రయత్నాలు ప్రారంభించాడు. 1984 లో రాజ్‌నందగ్రాన్‌లోను, 1990 లో భిలాయ్‌లోను నియోగి ఉద్యమ ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

భిలాయిలో భిలాయి ఉక్కు కర్మాగారానికి అనుబంధంగా ఉన్న పరిశ్రమలలో దాదాపు లక్షమంది కార్మికులు పని చేస్తున్నారు. ఈ పరిశ్రమలలో ఒక్క కార్మిక చట్టం కూడ అమలు కావడం లేదు. ఎనిమిది గంటల పని దినానికి బదులు పన్నెండు గంటల పని దినానికి బదులు పన్నెండు గంటల పనిదినం అమలవుతోంది. పైగా ఎనిమిది గంటల పనిదినానికి ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనాలు కూడ అమలు కావడం లేదు. స్త్రీలకు రాత్రి షిఫ్టుల నుంచి మినహాయింపు లేదు. స్త్రీలకు ప్రసూతి సెలవులుగాని, సౌకర్యాలుగానీ లేవు. కొన్ని ప్రమాదకర పరిశ్రమల్లో ఏ భద్రతా ఏర్పాట్లు లేవు.

ఇవి చిన్న పరిశ్రమలయినందువల్ల ఈ సౌకర్యాలు సమకూర్చడం లేదని అనుకోవడానికి వీలులేదు. ఈ పారిశ్రామికవేత్తలలో ఐదుగురి ఆస్తులు వెయ్యి కోట్ల రూపాయలకు పైబడి ఉన్నాయి. కెడియా డిస్టిలరీస్‌కు చెందిన కైలాస్‌పతి కెడియా, సింప్లెక్స్ గ్రూప్‌కు చెందిన షా కుటుంబం, బిఇసి కి చెందిన బిఆర్ జైన్, బీకేకు చెందిన గుప్తా, భిలాయి వైర్స్‌కు చెందిన కెహ్తావట్ - ఈ ఐదు కుటుంబాలు.

నియోగిని భిలాయిలో ప్రవేశించనివ్వగూడదని ఈ పారిశ్రామికవేత్తలు మొదటినుంచీ ఆటంకాలు కల్పిస్తూ వచ్చారు. ఈ సంవత్సరం ప్రారంభంలో ఆయనను అరెస్టు చేయించి రెండు నెలలపాటు జైల్లో ఉంచారు. ఈ నిర్బంధం నుంచి జబల్‌పూర్ కోర్టు ఆయనను విడుదల చేస్తే, ఆయన విడుదలయ్యేసరికి మరొక కుట్ర సిద్ధంగా ఉంది. మధ్యప్రదేశ్ రాజ్య సురక్షా అధినియమ్, 1991 అనే చట్టంకింద నియోగిని, రాయపూర్, దుర్గ్, రాజ్‌నందగ్రాన్, బస్తర్, బిలాస్‌పూర్ జిల్లాల నుంచి బహిష్కరిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆగస్ట్ 9 న మధ్యప్రదేశ్ హైకోర్టు ఈ బహిష్కరణ ఉత్తర్వుమీద స్టే ఇచ్చింది.

ఈ స్టే వార్త విన్న వెంటనే నియోగి "ఇక వాళ్ళు బుల్లెట్లు ఉపయోగిస్తారు" అని తనతో అన్నాడని మధ్యప్రదేశ్ పియుసిఎల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజిందర్ సైల్ రాశాడు.

అస్పష్టే సెప్టెంబర్ 28 ఉదయం "గుర్తు తెలియని ఆగంతకులు" శంకర్

(11)

సంస్మరణ :

కేతవరపు రామకోటిశాస్త్రి

ప్రముఖ సాహిత్య విమర్శకుడు, కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ప్రొఫెసర్ కేతవరపు రామకోటిశాస్త్రి అక్టోబర్ 29వ తేదీన ఒక లారీ ప్రమాదంలో మరణించారు. ఆయన ఆ రోజు మధ్యాహ్నం తానే డ్రైవ్ చేస్తూ స్కూటర్ మీద యూనివర్సిటీ నుంచి సి కె ఎం కాలేజీవైపు పోతున్నారు. లాల్‌బహదూర్ కాలేజి ముందు ఈ ప్రమాదం జరిగింది. ఆయన స్కూటర్ ఎదురుగా వస్తున్న పెట్రోల్ ట్యాంకర్ కిందికి వెళిపోయింది. ఆసుపత్రిలో చేర్చి అయిదారుగంటలు ఊపిరితో పెనుగులాడినప్పటికి అప్పటికది ఇంక మృత్యుఘాతమేనని అందరికీ స్పష్టమైపోయింది. సి కె ఎం కాలేజీలో హిందీ ఎం ఎ తరగతులను ప్రారంభించడానికి వచ్చిన సుప్రసిద్ధ హిందీ రచయిత భీంసేన్ నిర్మల్‌ను కలవడానికి ఆయన పోతున్నారు. వారిరువురూ వియ్యంపులు కూడ. ఆ కళాశాల అధ్యాపకులకు నవంబర్ ౬న తన కూతురు కాత్యాయని గృహప్రవేశ ఆహ్వానాలివ్వాలని కూడ పోతున్నారు. రోడ్డుమీద చెదరిపడిన ఆ కార్డులను బట్టే ఆయనెవరో రోడ్డుపై వెళ్ళే వాళ్ళు పోల్చుకున్నారు.

డిసెంబర్ 26కు ఆయనకు అరవై ఏళ్ళు నిండుతున్నాయి. పదవీ విరమణ ముందు సెలవుమీద ఇంక కొత్త ఇంట్లో చేపట్టవలసిన రచనా వ్యాసంగం గురించి ఆయన పుస్తకాలు సర్దుకుంటున్నారు. సంపత్కుమార వంటి మిత్రులతో చర్చలు చేస్తున్నారు.

గుహానియోగి ఇంట్లో జొరబడి, నిద్రిస్తున్న ఆయన గుండెల్లోకి ఆరుసార్లు కాల్పులు జరిపారు. కొద్ది నిమిషాల్లోనే ఆయన చనిపోయాడు. తన అసంపూర్ణ కర్తవ్యానికి గుర్తుగా ఆయన నిద్రపోవడానికి ముందు చదువుతున్న "ఆన్ ట్రేడ్ యూనియన్స్" అనే లెనిన్ పుస్తకం ఆ చెక్క మంచం మీద ఉండిపోయింది.

ఆయన సమాధిమీద రక్తవర్ణంలో చెక్కిన అక్షరాలు చెపుతున్నట్టు 'నియోగి ఏక్ వ్యక్తి నహీఁ, ఏక్ ధారా థా. ఏక్ ధారా హైఁ' (నియోగి ఒక వ్యక్తి కాదు. ఒక సాంప్రదాయంగా ఉండేవాడు. ఒక సాంప్రదాయంగా ఉన్నాడు.)

అమరుడు కామ్రేడ్ శంకర్ గుహ నియోగితో పది సంవత్సరాల స్నేహ సంబంధాన్ని సృజన, సాహితీమిత్రులు ఆర్ద్రంగా సంస్మరించుకుంటున్నారు. నియోగి ఉద్యమాలలో కలిసి నడిచిన భార్య ఆశకు, పిల్లలు క్రాంతి, జీత్, ముక్తిలకు, లక్షలాదిమంది ఛత్తీస్‌ఘర్ శ్రామికులకు, ఆదివాసులకు ఈ విషాద సమయంలో సృజన తన సంఘీభావం ప్రకటిస్తోంది.

— 'సాహితీమిత్రులు'

విద్యార్థులతో పాటు ఎదిగిన అరుదైన అధ్యాపకుడు శాస్త్రిగారు. 'గురజాడ అకవి' అని రాసిననాడు కూడా ఆయన కన్యాశుల్కం నాటకంలో అగ్నిహోత్రావధానులు వేషం వేసారు. 'కన్యాశుల్కం' నాటకం ఆడించారు. అప్పటికాయన అభ్యంతరమల్లా కన్యాశుల్కానికి ప్రాచీన నాటక లక్షణాలు పట్టవని ఇపుడయితే 'కన్యాశుల్కం'లో వున్నది బీభత్సరసమని శ్రీశ్రీ అన్నాడు కదా, అదేదో మార్క్సిస్టు పరిభాషలో అన్వయించి విశ్లేషించి వివరించమని త్రిపురనేని మధుసూదనరావును కోరాడేవారు.

పది పన్నెండేళ్ళగా ఆయన ఒక finished productగా రాసింది చాల తక్కువ. కాని త్రిపురనేని మధుసూదనరావు, చలసాని ప్రసాద్, కె వి ఆర్, జె సి మొదలుకొని చేరా, సంపత్‌ల దాకా సాహిత్య విమర్శ చర్చల్లో సత్కాలక్షేపమే ఆయన ఒక దశాబ్దంగా పెట్టుకున్న పెద్దపని. సంపత్కుమార్ మాటల్లో చెప్పాలంటే వాళ్ళిద్దరిదీ ఒకే సంభాషణా వేదిక, ఒక చర్చా గోష్ఠి.

విశ్వనాథ సత్యనారాయణకూ, ఖిరుదురాజు రామరాజుకు ఆయన ఏకకాలంలో శిష్యుడు. జువ్వాడి గౌతమరావుకూ, వట్టికోట ఆళ్వారుస్వామికీ సహచరుడు. వరవరావు, వీరభద్రయ్యలు ఒకేసారి ఆయన పరిశోధనా విద్యార్థులు. గుడివాడ కాలేజీలో కె. జి. సత్యమూర్తి, చలసాని ప్రసాద్, త్రిపురనేని మధుసూదనరావు తనకు విద్యార్థులని గర్వపడి విరసం ఆవిర్భావం తర్వాత ఆ అనుబంధాన్ని పునరుద్ధరించు కొని తన ఆలోచనలకు పదును పెట్టుకున్నారు.

తిక్కన కవిత్వ తత్వంమీద ముప్పై ఏళ్ళ క్రితం రచించిన ఆయన పరిశోధనా గ్రంథాన్ని తనకు అత్యంత ఆప్తమిత్రుడైన వట్టికోట ఆళ్వారుస్వామికి అంకితమిచ్చారు. గుడివాడ కాలేజీలో పనిచేస్తున్న రోజుల్లోనే ఏటుకూరి బలరామమూర్తి గారి గతితార్కిక భౌతికవాదం పాఠాలు విన్నప్పటికీ ప్రజా ఉద్యమాలపట్ల, ప్రగతిశీల భావాల పట్ల ఆయన కిటికీలు తెరుచుకోవడం ఆళ్వారుస్వామిగారితోనే ఆరంభమైంది. అంతకుముందు రామరాజుగారి ఇంట్లో కాళోజీ, రామకోటిశాస్త్రి కలిసివున్నా అప్పుడు కలివిడి తక్కువే.

సాహిత్య విమర్శలో అక్కిరాజు ఉమాకాంతానికో, పొట్లపల్లి సీతారామారావుకో వారసుడు కావలసిన శాస్త్రిగారు అరవైల నాటికి సమన్వయవాది అయ్యాడు. ప్రాచీన అలంకార శాస్త్రం, తత్వశాస్త్రం, వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు చదవకుండా సత్యనారాయణగారిని, మార్క్సిజం తెలుసుకోకుండా శ్రీశ్రీని విశ్లేషించలేమని ఆయన విశ్వాసం. అయినా కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆయన సుప్రసన్నతో కలిసి విశ్వనాథ పీఠమే స్థాపించారు. విశ్వనాథ గ్రంథ సూచి ప్రచురించారు.

ఎనభైలలో కొడవటిగంటి కుటుంబరావు సాహిత్య సర్వస్వంపై యూనివర్సిటీ ప్రాజెక్ట్ చేపట్టాలని ఆయన అనుకునేనాటికి వాతావరణం ప్రతికూలమైపోయింది. కాత్యాయని ప్రచురించిన కుటుంబరావు గ్రంథసూచితో మాత్రమే తృప్తిపడాల్సివచ్చింది. తెలుగు శాఖలోని ఇతర సహాధ్యాయుల సహాయంతో రాయప్రోలు, విశ్వనాథ, శ్రీశ్రీ ఆధునిక నవలలపై ఆయన వెలువరించిన 'విమర్శిని' సాహిత్య సంచికలు మాత్రం చిరస్థాయిగా వుంటాయి.

ఎమర్జెన్సీలో జైల్లో ఒక సాహిత్య విద్యార్థికి ఉత్తరం రాస్తూ 'మీ సాయుధ మార్గమైనా, మా గీతా మార్గమైనా గమ్య మొకటే' అన్నారు. చలంగారి 'మైదానం' ఐనా, విశ్వనాథ 'చెలియలికట్ట' అయినా ఒక సందేశ మిస్తుందనేవారు. 'కవిసేన మానిఫెస్టో' కనికట్టు మంత్రంతో మొదట దంగయిపోయినా రూపం ఏమిటో సారం ఏమిటో బాలగోపాల్ తేల్చినపుడు తెలివడయ్యాడు.

ఒక దశాబ్దంగా రామకోటిశాస్త్రిగారు సృజనకు మిత్రులు. విరసం అభిమాని. క్రిస్టొఫర్ కాడ్వెల్‌ను అనువాదం చేసిన నాటినుంచి మార్క్సిస్టు సాహిత్య విమర్శ మీద వందల పేజీల నోట్స్ రాసుకునేదాకా ఆయన భావాలను గందరగోళపరచింది ఆయన భాష: లేటు వయస్సులో మార్క్సిజం మీద ఏర్పడిన ఘాటు ప్రేమ వల్ల కూడ వదులుకోలేకపోయిన కొన్ని ప్రాచీన బంధాలు.

ప్రాచీన అలంకారశాస్త్ర అధ్యయనం నుంచి సంతరించుకున్న వాదపటిమ ఆయన రచనల్లో కన్నా ప్రసంగాల్లో బలంగా వ్యక్తమయ్యేది. ఉపాధ్యాయుడుగా, వక్తగా ఆయన ఆకర్షణ విస్తారమయింది.

1985-90 గడ్డు రోజుల్లో శ్రీశ్రీ, కొ.కు. సాహిత్య సర్వస్వం ప్రచురించవలసిందిగా విరసంను వెంటబడి ఒప్పించింది శాస్త్రిగారు. 'అరుణతార' సాహిత్య విమర్శ సంచికలు సంవత్సరానికి ఒకటైనా ప్రత్యేకంగా తేవాలని అందుకాయన తన తొలి దోహదంగా రెండు వేల ఒక వంద రూపాయలు పంపారు.

విప్లవ కవిత్వం తన సమయ సందర్భాలను, దేశ కాల పాత్రలను వివరించాలని, పరిభాషకు, కవిసమయాలకు ప్రతిపదార్థ తాత్పర్యాలు చెప్పాలనీ, ఈ పని విప్లవ సాహిత్య విమర్శ చేయాలని అనేవారు. విరసం సాహిత్య విమర్శ వర్క్‌షాప్ (కావలి '85) లో ఆయన విప్లవ కవిత్వంపై అటువంటి ప్రయత్నంతో పాఠం చెప్పారు.

విశ్వవిద్యాలయాల తెలుగు సిలబస్‌లలో కాలానుగుణమైన మార్పును ప్రవేశపెట్టిన ప్రారంభకులు కూడ శాస్త్రిగారే. కాకతీయ విశ్వవిద్యాలయంలో 1978లోనే ఫంక్షనల్ తెలుగు అనువాదం ఎంఎ స్థాయిలో ఒక పేపర్‌గా ప్రారంభించారు. 'ప్రజల మనిషి' మొదలు 'ఏడుతరాలు' వరకు నవలలు, అనువాద గ్రంథాలు, 'కొయ్య

గుర్రం' మొదలు 'చెల్లీ చంద్రమ్మ' వరకు కవితలు, పాఠ్యప్రణాళికల్లో చేర్చడానికి ఆయన చొరవయే కారణమైంది.

చలంగారి 'ఓ పువ్వు పూసింది' వంటి రచనలను పాఠ్యప్రణాళికలో చేర్చి నందుకు కాకతీయ విశ్వవిద్యాలయం అకడమిక్ కౌన్సిల్‌లో ఆయన తీవ్ర ప్రతిఘట నను కూడ ఎదుర్కోవాల్సి వచ్చింది.

ఆధునిక, అభ్యుదయ, విప్లవ భావజాలానికి విశ్వవిద్యాలయం విడిగా, కేటాగా, అస్పృశ్యంగా ఉండకూడదన్న ఆయన జ్ఞాన తపనను అపార్థం చేసుకున్న వాళ్ళు, అపోహలకు గురిచేసినవాళ్ళు ఉండడం ఆశ్చర్యంకాదు. అందుకాయన ఎంతో కొంత మూల్యం కూడ చెల్లించాల్సి వచ్చింది. శాస్త్రిగారికి భార్య, ముగ్గురు కూతుళ్లు. పెద్దకూతురు కాత్యాయనీ విద్మహే తెలుగు సాహిత్య విమర్శకురాలుగా ఆయన ఒరవడిలో ఇప్పటికే ప్రసిద్ధురాలు. తక్కిన ఇద్దరు మైథిలీ, శ్రీగౌరీ సైన్స్‌లో పిహెచ్‌డిలు. ఆయన సంపాదించిన ఆస్తిఅంతా ఆ కుటుంబంలోని విజ్ఞాన తృష్ణయే.

ఆయన సాహిత్య విమర్శ అంతా ఒక సంబద్ధమైన రీతిలో వెలుగు చూడాల్సి వున్నది.

మద్దుకూరి చంద్రశేఖరరావు మొదలుకొని ఈనాటి వరకు తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ గురించి ఆయన రాయ తలపెట్టిన గ్రంథం మాత్రం ఆరంభం కాకుండానే ఆగిపోయింది. దానికోసం ఆయన సేకరించిన సమాచారం, నడిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు రాసుకున్న నోట్స్ ఆధారంగా మరి మిత్రులు, కాత్యాయనీ కృషి చేస్తే ప్రయోజనకరమైన ఫలితాలుండవచ్చు.

అభిప్రాయాలు, దృక్పథాల ప్రమేయం లేకుండా అధ్యయనం, జ్ఞానం పరమా వధిగా ఒక సంప్రదాయం ఇప్పటికే సన్నగిల్లుతున్నది. పాము, నిచ్చెనల విశ్వ విద్యాలయాల్లో డిగ్రీల, ప్రమోషన్ల మెట్లు ఎక్కడమో 'రాజకీయ' విషకోరల బారిన పడడమో తప్ప అర్హతలు అవకాశాలు అనే మాట నీటిమూట అవుతున్నది.

డిగ్రీలు లేని పాండిత్యాన్ని మల్లంపల్లి సోమశేఖరశర్మగారిలో ఆంధ్ర విశ్వ విద్యాలయం గుర్తించిందని అలనాడు చెప్పేవారు. డిగ్రీలు, జ్ఞానం ఒకచోట ఉండ డమే అరుదయి అది సమకాలీన వివేకమయ్యే స్థితి ఏర్పడడం అపవాదమైపోయింది. ఈ నేపథ్యంలో రామకోటిశాస్త్రిగారి ఆకస్మిక ప్రమాద మరణం తెలుగు సాహిత్య విమర్శకు నిస్సందేహంగా ఒక విషాద వార్త.

రామకోటిశాస్త్రిగారి మృతిపట్ల విభ్రాంతులమై, ఆయన కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సంతాప, సంఘీ భావాలను ప్రకటిస్తున్నాము.

నవంబర్ 6, 91 —'సాహితీమిత్రులు'

స్వీకారం

* సోవియట్ ఆర్థికం – విమర్శనాత్మక పరిశీలన – మావో – క్రాంతి ప్రచురణలు, 168+4 పేజీలు, 1/8 డెమ్మీ, రు. 12.
* ఉవ్వెత్తున చెలరేగిన తూర్పుయూరప్ ప్రజా ఉద్యమాలు – క్రాంతి ప్రచురణలు, 44 పేజీలు, 1/8 డెమ్మీ, రు. 2.50.

  ఈ రెండు పుస్తకాలూ ప్రతులకు పీస్ బుక్ సెంటర్, 1-8-518, 16/2, వెంకటేశ్వర గుడి సమీపంలో, చిక్కడపల్లి, హైదరాబాద్ 500 020
* నెత్తుటి జెండాలు – కవితలు – పాటలు. ప్రజారస, అరుణోదయ ప్రచురణ, 80+6 పేజీలు, 1/8 డెమ్మీ, రు. 8.
* సోవియట్ రష్యాలో బహిరంగ పెట్టుబడిదారీ విధానం – చంద్రం – ప్రజాపంథా ప్రచురణ 60+4 పేజీలు, 1/8 డెమ్మీ, రు. 3.

  ఈ రెండు పుస్తకాలూ ప్రతులకు: మేనేజర్, ప్రజాపంథా, 4-13-14, కొరిటిపాడు, గుంటూరు. 522 007
* అంకురం – సాహితీ స్రవంతి, కర్నూలు బులెటిన్, 20 పేజీలు, 1/8 డెమ్మీ, రు. 3, ప్రతులకు ఎం. రాజశేఖర్, 50/348-ఎల్ 8 డి, అశోకానగర్, క్యాంప్ బి, కర్నూల్. 518 002

తెలుగు కథ - ఒక విజ్ఞప్తి

ప్రతి సంవత్సరం వివిధ పత్రికల్లో అచ్చయ్యే వందలాది కథల నుండి ఓ 10 లేదా 15 కథలను ఎంపిక చేసి సంవత్సరానికో సంకలనం తేవాలని 'కథాసాహితి' ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా 1990లో వివిధ పత్రికల్లో వెలువడిన కథల్లోంచి మంచి కథలను ఎంపిక చేసి 'తెలుగు కథ 1990' పేరుతో అక్టోబర్ నాటికి ఓ సంకలనం వెలువరించాలని ప్రయత్నం. ఈ సంకలనానికి వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్‌లు సంకలన కర్తలుగా ఉంటారు.

1990 లో మీ దృష్టికి వచ్చిన మంచి కథలను ఈ క్రింది చిరునామాకు తెలియజేసిగానీ, లేదా వాటి జిరాక్సు కాపీలు గానీ పంపి సహకరించాల్సిందిగా సాహిత్యాభిమానులకు మరీ ముఖ్యంగా కథాభిమానులకు కథాసాహితి విజ్ఞప్తి చేస్తోంది.

చిరునామా : కథాసాహితి 1-4-880/2/33 గాంధీనగర్, హైదరాబాద్.

SṚJANA Telugu Monthly October & November 1991
Regd. No. with the Registrar of Newspapers for India 10953/67

సృజన రేటు, సంవత్సర చందా పెంచక తప్పడంలేదు

సృజనకు ఆర్థికంగా, హార్దికంగా సహకరించవలసినదని చేస్తున్న విజ్ఞప్తికి ముఖ్యంగా మనసు విప్పి చెప్పుకున్న ఇబ్బందులకు కొందరు పాఠకులనుంచయినా మంచి ప్రతిస్పందన వచ్చింది.

అయితే కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ రూపంలో వచ్చిన ఐ.ఎం.ఎఫ్. దాడికి పత్రికలుకూడా తాళలేనంత దెబ్బతిన్నవి. న్యూస్‌ప్రింటు ధర నలభై శాతం పెరిగిపోయింది. న్యూస్‌ప్రింటు కోటాకూడా లేని సృజన వంటి పత్రికలకు ఈ రేటు రెట్టింపు పెరిగినట్లు లెక్క.

పత్రికకయ్యే ఖర్చు సాధారణంగా కాగితానికి సగం, ప్రింటింగుకు సగం అవుతుంది (లెటరు ప్రెస్ కంపోజింగులో). కనుక పెరిగిన కాగితం ధర నలభై శాతమే లెక్క వేసుకున్నా అరవై పేజీల పత్రికకే మరో రూపాయి రేటు పెంచక తప్పదు. మేం ఇటీవల కాలంలో 70 పేజీలకు తగ్గి ఎప్పుడూ సంచిక ఇవ్వలేదు.

ఇప్పుడే మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్లు బడ్జెట్ న్యూస్‌ప్రింటు ధర పెంచింది.

ఇకనుంచి తప్పనిసరిగా 64 పేజీల

విడి ప్రతి 5 రూపాయలు సంవత్సర చందా 50 రూపాయలు

చేయక తప్పడంలేదు.

అన్నీ గ్రహించగల సృజన పాఠకులు సహకరించగలరని ఆశిస్తాం.

'సాహితీమిత్రులు'

SṚJANA Rs. 5/-
Flat 11, Block 2,
MIG 11, Baghlingampalli,
Hyderabad - 500 044.